
# నేనసలే మంచి వాడిని కాను




### ఇరాన్‌ను అణు ఒప్పందానికి రావాల్సిందే
### అప్పటి వరకు శాంతి ఒప్పందం కుదరదు
### మరోమారు హెచ్చరించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్ : దాదాపు రెండు నెలలుగా కొనసాగుతున్న ఘర్షణను ముగించాలనే ఇరాన్ ప్రతిపాదనను అంగీకరించాలంటే తమ షరతులకు ఒప్పుకోవాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని వదులుకునే వరకు ఆ దేశంతో శాంతి ఒప్పందం కుదరదని ఆయన తెలిపారు. అప్పటివరకు ఇరాన్‌పై అమెరికా నౌకా దిగ్బంధనం కొనసాగు తుందని హెచ్చరించారు బుధవారం ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్.. ఇరాన్ యుద్ధం గురించి మాట్లాడారు. 2లో


Crime News

# ది క్రైమ్ న్యూస్

తెలుగు దినపత్రిక

శుక్రవారం, మే 01, 2026 | సంపుటి - 20 | సంచిక 225 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.




## అక్రిడేషన్ కార్డులను అందచేసిన పొంగులేటి

### అర్హులందరికీ అందచేస్తామని ప్రకటన

హైదరాబాద్ : జర్నలిస్టులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కొత్త అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ పక్రియ ఎట్టకేలకు ప్రారంభమైంది. గురువారం హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జర్నలిస్టులకు ఈ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందజేస్తామని, ఇందులో ప్రభుత్వానికి ఎలాంటి రెండో ఆలోచన లేదని స్పష్టం చేశారు.



## తెలుగు రాష్ట్రాలకు చల్లటి కబురు

- తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు ద్రోణి
- తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం

2



## కవిత పార్టీ పేరు తెలంగాణ రక్షణ సేన



### ఆమోదించిన కేంద్ర ఎన్నికల సంఘం
### టిఆర్ఎస్ రాసిపెట్టి ఉందంటూ కవిత పోస్ట్

హైదరాబాద్ : 'తెలంగాణ రక్షణ సేన' పేరును కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదించింది. ఆమె పెట్టుకున్న పేర్ల ఆధారంగా ఈ పేరును ఖరారు చేసింది. 2లో

## సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌తో

# జవాబుదారీతనం



### విద్యార్థులకు సకాలంలో పాఠ్య సామగ్రి అందాలి
### వస్తువుల నాణ్యత విషయంలో రాజీపడొద్దు
### ప్రతి విద్యార్థి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి
### సంక్షేమ శాఖలపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్ : విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా సకాలంలో అందేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. దుస్తులు, నోటు పుస్తకాలు, ఇతర సామగ్రి సకాలంలో అందితే విద్యార్థులు చదువుపై పూర్తి స్థాయిలో శ్రద్ధ చూపుతారని సీఎం అన్నారు. విద్యా శాఖతో పాటు బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖలు, ఎస్సీ డెవలప్‌మెంట్ శాఖల పరిధిలోని విద్యా సంస్థల్లోని విద్యార్థులకు అందజేసే సామగ్రి సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌పై ముఖ్యమంత్రి గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. గతంలో ఏ శాఖకు ఆ శాఖ ప్రొక్యూర్‌మెంట్, సరఫరా చేపట్టడంతో ఏకరూపత లోపించడంతో పాటు అనేక అక్రమాలు చోటుచేసు కునేవని... వాటిని అరికట్టేందుకు సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని తీసుకువచ్చామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలో దుస్తులు, నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ఇతర సామగ్రి సరఫరాకు సంబంధించి ఏ శాఖకు ఆ శాఖ చేపట్టడంతో అవకతవకలకు ఆస్కారం ఉండేదన్నారు. అటువంటి అవకతవకలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని సీఎం స్పష్టం చేశారు. సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానంతో జవాబుదారీతనం పెరుగుతుందని సీఎం అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రయత్నం చేస్తుందని... సరఫరాదారుల ప్రయోజనాలు కాపాడేందుకు కాదన్నారు. విద్యార్థులకు అందజేసే నోటు పుస్తకాలు, ట్రంక్ ప్లేట్లు, గ్లాసులు, ట్రాక్ షూట్లు, బెడ్ షీట్లు, స్కూల్ బ్యాగ్లు, ఐడీ కార్డులు, యూనిఫాంలు అన్నీ నాణ్యమైనవే ఉండాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. 2లో

## త్వరలో ట్రైబల్ వర్సిటీ క్యాంపస్ నిర్మాణం



### రూ.7,823 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలు
### ప్రధాని పర్యటనపై కిషన్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్ : సమ్మక్క- సారలమ్మ ట్రైబల్ యూని వర్సిటీ క్యాంపస్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. మే 10న హైదరాబాద్ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ.. రూ.7,823 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంబి స్తారని చెప్పారు. భాజపా రాష్ట్ర కార్యాల యంలో కేంద్రమంత్రి ఈమేరకు మీడియాతో మాట్లాడారు.

తరువాయి 2లో




2

## ఎల్ఆర్ఎస్ రాయితీ పథకం

### కేవలం మూడు నెలలకే పరిమితం

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో అనుమతి లేని మరియు అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్న సామాన్య ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. పెండింగ్‌లో ఉన్న క్రమబద్ధీకరణను వేగవంతం చేసే ఉద్దేశంతో, ఎల్ఆర్ఎస్ ఫీజు మరియు ఇతర చార్జీలపై ఏకంగా 25 శాతం రాయితీని ప్రకటిస్తూ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది.

## బెంగాల్లో విజయం ముమ్మాటికీ టిఎంసిదే

### కేంద్రం అధికార దుర్వినియోగం చేసినా ప్రజలు మావెంటే
### వీడియో సందేశం విడుదల చేసిన మమతా బెనర్జీ



కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ముఖ్య మంత్రి మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో 226 కంటే ఎక్కువ సీట్లను టీఎంసీ గెలుస్తుందని స్పష్టం చేశారు. 'మా-మాటి-మానుష్' స్ఫూర్తితో టీఎంసీ ప్రభుత్వాన్ని తిరిగి తీసుకురావడానికి పశ్చిమ బెంగాల్ ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా మమతా బెనర్జీ 2లో

## కుప్పం విమానాశ్రయానికి తొలగిని అడ్డంకులు

### భూసేకరణపై పిటిషన్లు కొట్టివేసిన సుప్రీం

2





## ఏపీ పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదల



### 85.25 శాతం ఉత్తీర్ణత నమోదు
### 87.90 శాతం ఉత్తీర్ణతతో బాలిలు టాప్
### 96.07శాతంతో పార్వతీపురం మన్యం జిల్లా ఫస్ట్
### ఫలితాలు విడుదల చేసిన మంత్రి లోకేశ్

అమరావతి : ఏపీ పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. గురువారం ఉదయం విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఫలితాలను ప్రకటించారు. టెన్త్ ఫలితాల్లో 85.25 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది 81.14 శాతం ఉత్తీర్ణతతో పోలిస్తే ఈసారి మెరుగైన ఫలితాలు వచ్చాయి. టెన్త్ ఫలితాల్లో బాలికలు ముందంజలో ఉన్నారు. బాలికలు 87.90 శాతం ఉత్తీర్ణత సాధించగా.. బాలురు 82.68 శాతం ఉత్తీర్ణత పొందారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెరిగింది. 2లో

## 20పైగా అంశాలకు కేబినేట్ ఆమోదం

### ఢిల్లీలో రూ.124.50 కోట్లతో కొత్త ఏపీ భవన్ నిర్మాణం

- క్వాంటం వ్యాలీ ట్విన్ టవర్ల నిర్మాణానికి రూ.1,208 కోట్లు
- మార్క్‌ఫెడ్‌కు రూ.1800 కోట్ల రుణం పొందేందుకు గ్యారెంటీ
- ల్యాండ్ పూలింగ్ స్కీమ్ నిబంధనల్లో సవరణ

అమరావతి : ఉద్యోగ, మౌలిక వసతులు, వ్యవసాయం, పట్టణాబి వృద్ధి, పెట్టుబడుల వంటి అంశాలపై క్యాబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన దాదాపు మూడున్నర గంటలపాటు సమావేశమైన మంత్రివర్గం.. దాదాపు 20కి పైగా అజెండా అంశాలకు ఆమోదం తెలిపింది. అనంతరం మంత్రి పయ్యావుల కేశవ్.. క్యాబినెట్ నిర్ణయాలను మీడియాకు వెల్ల డించారు. ఢిల్లీలో 11.5 ఎకరాల్లో రూ.124.50 కోట్లతో కొత్త ఏపీ భవన్ నిర్మాణానికి మంత్రివర్గం పచ్చజెండా ఊపిందన్నారు. మున్సి పాలిటీలకు చెందిన ఆస్తుల లీజ్ రెన్యువల్, అద్దె నిర్ణయ విధానాల సవరణలకు 2లో

# నేనసలే మంచి వాడిని కాను

'బాంబు దాడి కంటే దిగ్బంధనమే ఎక్కువ ప్రభావవంతంగా ఉంది. వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వారి పరిస్థితి మరింత దారుణంగా ఉండబోతోంది. వారు రాజీ పడాలనుకుంటున్నారు. నేను దిగ్బంధనాన్ని కొనసాగించడం వారికి ఇష్టం లేదు. ఎత్తివేయడం నాకు ఇష్టం లేదు. ఎందుకంటే వారు అణ్వాయుధాన్ని కలిగి ఉండడానికి వీల్లేదు' అని ట్రంప్ స్పష్టం చేశారు . కాగా, శాంతి ఒప్పందానికి అంగీకరించేలా ట్రంప్ చేస్తున్న బెదిరింపులపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. అమెరికా మోసపూరిత ప్రణాళిక ఓడిపోతుందని, దిగ్బంధనం ద్వారా దేశంలో అంతర్గత కలహాలను సృష్టించాలనే ట్రంప్ ప్రణాళిక ఎన్నటికీ సఫలం కాదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ పేర్కొన్నారు. ఏదేమైనా అమెరికా-ఇరాన్ మధ్య ప్రస్తుతానికి శాంతి చర్చలు జరగడం లేదు. ఇదిలావుంటే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను మరోసారి తీవ్రంగా బెదిరించారు. నిలిచిపోయిన అణు కార్యక్రమం చర్చలపై ఇరాన్ త్వరగా తేల్చాలని, తెలివిగా వ్యవహరించాలని ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో తుపాకితో ఉన్న ఫొటోను పోస్టు చేశారు. దీంతో ఇది నెట్టింట వైరల్ అయింది. యుద్ధం ముగిసిన తరువాతే అణు కార్యక్రమంపై చర్చలని ఇరాన్ తేల్చి చెప్పిన నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ట్రంప్ తన పోస్టులో, 'ఇరాన్ తమ పనిని సరిగ్గా చేయలేకపోతోంది. వారికి అణురహిత ఒప్పందంపై ఎలా సంతకం చేయాలో తెలియదు. వారు త్వరగా తెలివిగా వ్యవహరించాలి!' అని రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌తో పాటు, ట్రంప్ తన ఎఐ రూపొందించిన చిత్రాన్ని కూడా పంచుకున్నారు, అందులో ఆయన అసాల్ట్ రైఫిల్‌ను పట్టుకొని ఉండగా, వెనుక పర్వత ప్రాంతంలో బాంబులు పేలుతున్నాయి. ఆ చిత్రంపై 'నో మోర్ మిస్టర్ నైస్ గై- (ఇకపై మంచివాడిగా ఉండను!) అని బ్యానర్ ఉంది. అమెరికా-ఇరాన్ మధ్య ఉన్న సున్నితమైన కాల్పుల విరమణ ఒప్పందంపై అనిశ్చితి పెరుగు తున్న నేపథ్యంలో ట్రంప్ ఈ బెదిరింపులకు దిగడం గమనార్హం. ఇరాన్ ఓడ రేవులను దిగ్బంధి ంచాలని ట్రంప్ ఆదేశించారని వాల్ స్ట్రీట్ జర్నల్ బుధవారం నివేదించింది. ఈ కథనం ప్రకారం ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని వదులుకునేలా ఒత్తిడి తెచ్చేందుకు ఆ దేశ ఓడరేవులను సుదీర్ఘకాలం పాటు దిగ్బం ధించడానికి సిద్ధం కావాలని ట్రంప్ జాతీయ భద్రతా అధికారులను ఆదేశించారు. ఇరాన్ చిత్తశుద్ధితో చర్చలు జరపడం లేదని ట్రంప్ భావిస్తున్నారు. ఇరాన్ తన యురేనియం శుద్ధిని 20 ఏళ్ల పాటు నిలిపివేసేలా, ఆ తర్వాత కఠినమైన ఆంక్షలను అంగీకరించేలా బలవంతం చేయాలని ఆయన ఆశిస్తున్నారని ఆ కథనం తెలిపింది. అమెరికా తమ దేశ నౌకలను స్వాధీనం చేసుకోవడాన్ని ఇరాన్ సముద్రపు దొంగతనంగా అభివ ర్ణించింది. ఈ వివాదంపై ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్‌కు, భద్రతా మండలికి ఇరాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరవాని అధికారికం గా ఫిర్యాదు చేశారు. అమెరికా చర్యలు అంతర్జాతీయ వాణిజ్యంలో చట్టవిరుద్ధమైనవని ఆయన పేర్కొన్నారు.

# కవిత పార్టీ పేరు తెలంగాణ రక్షణ సేన

దీనిపై కవిత హర్షం వ్యక్తం చేశారు. 'ఈసీ నిబంధనలకు అనుగుణంగా జనవరిలో మొత్తం ఐదు పేర్లతో దరఖాస్తు చేసుకున్నాం. మూడో ప్రాధాన్యంగా ఇచ్చిన పేరును ఈసీ ఆమోదించింది. టీఆర్ఎస్.. నాకు రాసిపెట్టి ఉందేమో! రెండు దశాబ్దాలుగా తెలంగాణ సాంస్కృతిక పరిరక్షణ, పునరుజ్జీవం కోసం చేస్తున్న కృషిని కొనసాగిస్తా. రాష్ట్ర అస్తిత్వ పరిరక్షణెళి ధ్యేయంగా అంకితభావంతో పనిచేస్తా' అని కవిత 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ఈ నెల 25న కవిత ప్రకటించిన రాజకీయ పార్టీ 'టీఆర్ఎస్'కు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదముద్ర వేసిన విషయం తెలిసిందే. తెలంగాణ రాష్ట్ర సేన బదులు 'తెలంగాణ రక్షణ సేన' పేరును ఆమోదించింది. టీఆర్ఎస్ పార్టీకి అనుమతిస్తూ బంజారాహిల్స్‌లోని కవిత నివాసంలో ఎన్నికల సంఘం అధికారులు ఆమెకు లేఖ అందజేశారు. పార్టీ పేరుపై పత్రికల్లో ప్రకటన ఇవ్వాలని కవితకు ఈసీ సూచించింది. అదేవిధంగా కొత్త పార్టీ పేరుపై అభ్యంతరాలుంటే 30 రోజుల్లోపు తమ దృష్టికి తీసుకురావాలని తెలిపింది.

## త్వరలో ట్రైబల్ వర్సిటీ క్యాంపస్ నిర్మాణం

'హైదరాబాద్‌లో పెట్రోలియం ఉత్పత్తులకు సంబంధించి టెర్మినల్‌ను ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. మహబూబ్‌నగర్‌లో రూ.3,175 కోట్ల విలువైన జాతీయ రహదారి పనులకు వర్చువల్‌గా శ్రీకారం చుట్టనున్నారు. హఫీజ్‌పేట, జోగులాంబ రైల్వేస్టేషన్లను, కాజీపేట- విజయవాడ మధ్య మూడో రైల్వే లైన్‌ను ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో రూ.85 వేల కోట్ల రైల్వే ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. హైదరాబాద్-యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్ పనులు ప్రారంభమయ్యాయి. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నాం. 2030 నాటికి రూ.9 లక్షల కోట్ల విలువైన టెక్స్‌టైల్ ఉత్పత్తులను ఎగుమతి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం అని కిషన్‌రెడ్డి తెలిపారు.

# అక్రిడేషన్ కార్డులను అందచేసిన పొంగులేటి

ఒకవేళ కార్డు పొందిన తర్వాత ఎవరైనా సంస్థ మారితే, ఆ సమాచారాన్ని అధికారులకు తెలియజేస్తే వారి కార్డులను తొలగించబోమని భరోసా ఇచ్చారు.గత ప్రభుత్వ హయాంలో అక్రిడిటేషన్ల సంఖ్య 32 వేల నుండి 35 వేల మధ్య ఉండేదని, తమ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జీవోల వల్ల సుమారు 46 వేల మందికి లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర స్థాయి కార్డుల్లో 2500 మందికి క్లియరెన్స్ ఇచ్చామని, జిల్లా స్థాయి కార్డుల మంజూరుపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. రాబోయే 15 రోజుల్లో అర్హులందరికీ కార్డుల మంజూరు పూర్తి చేస్తామని మంత్రి ప్రకటించారు. కొత్త దరఖాస్తులకు ఒక గడువు నిర్ణయించాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఖచ్చితమైన సంఖ్య తెలిస్తే, దాని ఆధారంగా జర్నలిస్టుల కోసం మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందని పేర్కొన్నారు. పాత కార్డుల గడువు ముగియడంతో, యుద్ధ ప్రాతిపదికన కొత్త కార్డుల జారీని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు.

## ఇక కొత్త ఆయుధంతో విరుచుకు పడతాం

### అమెరికాకు ఇరాన్ నేవీ కమాండర్ హెచ్చరిక

టెహ్రాన్,ఏప్రిల్30 : అమెరికా- ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకీ తీవ్రమవుతోన్నాయి. ఈ క్రమంలో ఇరాన్ నేవీ కమాండర్ రేర్ అడ్మిరల్ షారమ్ ఇరానీ కీలక వ్యాఖ్యలు చేశారు. శత్రు బలగాలపై త్వరలోనే కొత్త ఆయుధంతో విరుచుకుపడనున్నట్లు తెలిపారు. ఆ ఆయుధం అమెరికాను తీవ్రంగా భయపెడుతుందని హెచ్చరించారు. దిగ్బంధనాన్ని ఎత్తివేస్తేనే.. హర్మూజ్‌ను తెరుస్తామంటూ ఇరాన్ చేసిన ప్రతిపాదనలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ (ఆనీనిజీటె ఉసబీపూ) తిరస్కరించారు. ఈ క్రమంలో ఇరాన్ నుంచి తాజా హెచ్చరికలు వచ్చాయి. 'అతిత్వరలో శత్రు బలగాలపై కొత్త ఆయుధాన్ని ప్రయోగిస్తాం. అది వారిని తీవ్రంగా భయపెట్టనుంది. అది వారి పక్కనే ఉంది. దానితో వారికి గుండెపోటు కూడా రావొచ్చు' అని షారమ్ ఇరానీ పేర్కొన్నారు. అయితే, ఆ ఆయుధం ఏంటి అనే విషయాన్ని మాత్రం ఆయన స్పష్టంగా వెల్లడించలేదు. హర్మూజ్ ను దిగ్బంధించి.. ఇరాన్‌ను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసి, చర్చలకు తీసుకురావాలనే అమెరికా వ్యూహాన్ని ఆయన కొట్టిపారేశారు. అమెరికాకు చెందిన విమాన వాహక నౌక యూఎస్ఎస్ అబ్రహాం లింకన్‌పై తమ దళాలు దాదాపు ఏడు క్షిపణులతో విరుచుకుపడ్డాయన్నారు. దీంతో అది కొన్ని రోజులు కార్యకలాపాలను నిర్వహించలేకపోయిందన్నారు. అమెరికా దిగ్బంధనం ఉన్నప్పటికీ.. నౌకలు కొన్ని తమ ఓడరేవుల నుంచి వెళ్తున్నాయన్నారు. మరికొన్ని వాటి గమ్యస్థానాలకు కూడా చేరుకుంటున్నాయని వెల్లడించారు. ఈసందర్భంగా యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన తమ ప్రజల కోసం చివరి రక్తపుబొట్టు వరకు పోరాడి ప్రతీకారం తీర్చుకుంటామని ఆయన ప్రతిజ్ఞ చేశారు. శత్రువులు పశ్చాత్తాపం చెందేవరకు వారిని దెబ్బ కొడతామన్నారు.

# సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌తో జవాబుదారీతనం

నాణ్యతతో పాటు సకాలంలో అందడంపైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జూన్ 15 నాటికి విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా అందాలని, అలా అందగానే సరఫరాదారులకు చెల్లింపులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. విద్యార్థులకు అందజేసే వస్తువులకు సంబంధించి మండల స్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. అక్కడి నుంచి క్షేత్ర స్థాయిలో గ్రామాల్లోని పాఠశాలలు, హాస్టళ్లకు వస్తువులు సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని, సరఫరాకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీయించాలన్నారు. ప్రతి విద్యార్థికి వారికి అవసరమైన సామగ్రి అంతా అందిందా లేదా అనే దానిని చెక్ చేసుకోవాలని సీఎం ఆదేశించారు. నోటు పుస్తకాలు, యూనిఫాం, ఇతర సామగ్రి క్వాలిటీ... వాటిని అందుకున్న తర్వాత వారి భావాలను తెలియజేసేందుకు విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సీఎం సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విద్యాశాఖల మధ్య సమన్వయానికి ఒక కమిటీని నియమించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాల మాయాదేవి, సెర్ప్ సీఈవో దివ్య, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి సంతోష్, బిసి కార్యదర్శి బి.సైదులు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాలకు చల్లటి కబురు

హైదరాబాద్ /అమరావతి : తెలుగు రాష్ట్రాల్లో ఎండలు దంచికొడుతున్న నేపథ్యంలో వాతావరణ శాఖ ఉపశమనం కలిగించే వార్త చెప్పింది. ద్రోణి ప్రభావంతో అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వచ్చే మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈదురు గాలులు సహా పిడుగులతో కూడిన జల్లులు కురుస్తాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. అమరావతి వాతావరణ కేంద్రం ప్రకారం.. దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో ద్రోణి విస్తరించి ఉంది. ఫలితంగా.. ఏపీలోని దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో మూడు రోజుల పాటు అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశముంది. గురువారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా పిడుగులతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే ఛాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో గంటకు 50- 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముంది. శుక్ర, శనివారాల్లో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవడం సహా గంటకు సుమారు 40 - 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ఛాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో వేడి, తేమ సహా అసౌకర్యమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడనున్నట్టు సమాచారం. హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకారం.. ద్రోణి/వాయు అస్థిరత ఇప్పుడు దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో విస్తరించి ఉంది. అంతర్గత మహారాష్ట్ర సహా దానిని ఆనుకుని ఉన్న తెలంగాణపై సముద్ర మట్టానికి 3.1 కి.మీ. ఎత్తులో ఒక ప్రతిచక్రవాత వలయం ఏర్పడింది. దీంతో రానున్న మూడు రోజుల్లో కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలో రానున్న మూడు రోజులలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు దాదాపు ఇదే స్థాయిలో కొనసాగే అవకాశం ఉంది.ఇదిలావుంటే తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. హైదరాబాద్, వరంగల్, ఆదిలాబాద్, విశాఖ, విజయవాడ, నెల్లూరు వంటి ప్రాంతాల్లో ఎండలు దంచికొడుతున్నాయి. తెలంగాణలో వడదెబ్బ మృతుల సంఖ్య పెరిగిపోతోంది. పగలంతా ఎండ కొడుతుండగా.. సాయంత్రం మాత్రం అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయి. మరోవైపు గురు, శుక్రవారాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. ఏపీలోనూ పిడుగులతో కూడిన వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయని అధికారులు తెలిపారు.

# ఏపీ పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదల

72.8 నుంచి 78.39కి ఉత్తీర్ణత శాతం పెరిగింది. వాట్సాప్ 'మన మిత్ర' సేవ ద్వారా 9552300009కు మెజేజ్ పంపి ఫలితాలను తెలుసుకోవచ్చు. టెన్త్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మంత్రి లోకేశ్ అభినందనలు తెలియజేశారు. 'మీ కృషి, అంకితభావం ఫలించాయి. ఫెయిల్ అయిన విద్యార్థులు నిరాశ చెందవద్దు. ఇది ఒక పరీక్ష మాత్రమే. మళ్లీ ధైర్యంగా ప్రయత్నించండి. మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల అభివృద్ధికి పూర్తి మద్దతు ఇస్తుంది' అని లోకేశ్ పేర్కొన్నారు.మొదటి స్థానంలో పార్వతీపురం మన్యం జిల్లా - 96.07శాతం ఉత్తీర్ణత సాధించగా, రెండో స్థానంలో డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ 95.85శాతం ఉత్తీర్ణత సాధించింది. మూడో స్థానంలో విజయనగరం - 91.08శాతం, చివరి స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా - 57.12శాతం ఉత్తీర్ణత సాధించాయి. జిల్లాల వారీగా ఉత్తీర్ణత వివరాలు ఇలావున్నాయి. కర్నూలు జిల్లా - 71.08,విశాఖపట్నం - 89.51,గుంటూరు - 88.89,తూర్పు గోదావరి - 88.49, కృష్ణా జిల్లా- 88.06, ఎన్టీఆర్ జిల్లా -87.91,నెల్లూరు - 87.37,అనంతపురం - 77.17, చిత్తూరు- 76.69 శాతం ఉత్తీర్ణత సాధించాయి. మొత్తం హాజరైన విద్యార్థులు - 6,18,131కాగా, ఉత్తీర్ణులైన విద్యార్థులు - 5,26,954 పాసయ్యారు. రీకౌంటింగ్ / రీ-వెరిఫికేషన్: ఫలితాలపై అసంతృప్తి ఉన్న విద్యార్థులు మే 1 నుంచి మే 7వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. రీకౌంటింగ్‌కు సబ్జెక్టుకు రూ.500, రీ-వెరిఫికేషన్‌కు రూ.1,000 ఫీజు చెల్లించాలి. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీని పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించని వారి కోసం మే 25 నుంచి జూన్ 4 వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. అపరాధ రుసుము లేకుండా మే 9 వరకు, రూ.50 అపరాధ రుసుముతో మే 10 నుంచి మే 25 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చు. సబ్జెక్టు వారీగా మార్కుల మెమోలు నాలుగు రోజుల్లో అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు.

# ఎల్ఆర్ఎస్ రాయితీ పథకం

రాష్ట్ర మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ ఈ మేరకు జీఓ ఎంఎస్ నెం. 131ని విడుదల చేసింది. ఈ రాయితీ పథకం మే 1నుంచి జూలై 31 వరకు మూడు నెలల పాటు అందుబాటులో ఉంటుంది. ఈ గడువు లోపు తమ ఎల్ఆర్ఎస్ చార్జీలను చెల్లించే దరఖాస్తుదారులకు మాత్రమే ఈ 25 శాతం డిస్కౌంట్ వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పూర్తి చేయడంలో ప్రజలకు ఆర్థిక వెసులుబాటు కల్పించడం. రాయితీ ప్రకటించడం ద్వారా ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ప్లాట్లను/లేఅవుట్లను రెగ్యులరైజ్ చేసుకుంటారని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణ రెగ్యులరైజేషన్ ఆఫ్ అన్అప్రూవ్డ్ అండ్ ఇల్లీగల్ లేఅవుట్ రూల్స్-2020 కు సవరణలు చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఈ ఉత్తర్వులను జారీ చేస్తూ, తదుపరి చర్యలు తీసుకోవాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, హెచ్ఎండిఏ మెట్రోపాలిటన్ కమిషనర్, మరియు పంచాయతీ రాజ్ కమిషనర్ సహా సంబంధిత అధికారులందరినీ ఆదేశించారు. దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న అక్రమ లేఅవుట్ల సమస్యకు ఈ రాయితీ ద్వారా పరిష్కారం లభిస్తుందని, తక్కువ ధరకే తమ భూములను చట్టబద్ధం చేసుకునే సువర్ణావకాశం ప్రజలకు దక్కిందని అధికారులు విశ్లేషిస్తున్నారు.

## యువ పోలీసుల చేతుల్లోనే పోలీస్ శాఖ ప్రతిష్ట

### వీడ్కోలు సన్మానంలో డిజిపి శివధర్ రెడ్డి

### కొత్త డిజిపి సివి ఆనంద్‌కు అభినందనలు

హైదరాబాద్ : రాష్ట్ర డీజీపీ బి. శివధర్‌రెడ్డికి తెలంగాణ పోలీస్ అకాడమీలో ఘనమైన వీడ్కోలు లభించింది. గురువారం ఆయన రిటైర్డ్ అవుతున్న సందర్భంగా పోలీస్ అధికారులు ఆయనకు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా శివధర్ రెడ్డి మాట్లాడుతూ..32 ఏళ్లు సుదీర్ఘకాలంలో ఎన్నో అనుభవాలు, అనుభూతులు మిగిలాయన్నారు. వృత్తిలో భాగంగా పలు సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. పోలీసింగ్ విధానంలో నేడు అనేక మార్పులు చోటు చేసుకున్నాయని, యువ పోలీస్ అధికారులు డిపార్ట్‌మెంట్‌కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పోలీస్ విభాగం పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రస్తుత సిటిజన్స్‌కు ఫ్రెండ్లీ పోలీసింగ్ అవసరమన్నారు. సర్వీసులో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాగా, పదవీ విరమణ పొందిన శివధర్ రెడ్డికి నూతన డీజీపీగా నియామకమైన సీవీ ఆనంద్ అభినందనలు తెలిపారు. ఆయన ఉద్యోగ జీవితంలో ఎన్నో సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని పలు సంస్కరణలు తీసుకొచ్చారని ప్రశంసించారు. తన సూచనలు, సలహాలు తీసుకునేందుకు తాను సిద్ధమేనని సీవీ ఆనంద్ తెలిపారు. 1970, 1980లో పోలీసుల పరిస్థితులు వేరని.. ఇప్పుడు పని చేస్తున్న పోలీస్ సిబ్బంది పరిస్థితులు వేరన్నారు. గతం కంటే ఇప్పుడున్న పోలీసింగ్‌లో చాలా మార్పులు వచ్చాయని అన్నారు. పోలీస్ విభాగం పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రస్తుత సిటిజన్స్‌కు ఫ్రెండ్లీ పోలీసింగ్ అవసరమన్నారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ఫ్రెండ్లీ పోలీసింగ్ నడిపించామని తెలిపారు. భవిష్యత్తుకు అనుగుణంగా పోలీస్ శాఖను సిద్ధం చేశామని చెప్పారు. 'నా స్వరాష్ట్రానికి నన్ను డీజీపీగా నియమించిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు. సీఎం ఎన్నో కీలక బాధ్యతలు అప్పగించారు. నేను ఈ స్థాయికి రాడానికి కారణమైన నా గురువులకు ధన్యవాదాలు. యంగ్ పోలీస్ వల్ల పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలి. పోలీస్ పవర్ అంటే గౌరవంగా జీవించడం. సమష్టి కృషి వల్లే ఈ స్థాయిలో ఉన్నాను. నా కుటుంబసభ్యులకు ధన్యవాదాలు. మంచి ఛాలెంజింగ్ అధికారి రాబోతున్నారు.. రాష్ట్ర నూతన డీజీపీగా సీవీ ఆనంద్‌కు అభినందనలు' అని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు.

# రాష్ట్రంలో పెరుగుతున్న ఎండల తీవ్రత

### భారీగా పెరిగిన విద్యుత్ డిమాండ్

### అధికారులతో సమీక్షించిన డిప్యూటి సిఎం భట్టి

### కరెంట్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తరాదని ఆదేశం

హైదరాబాద్,ఏప్రిల్30 : రాష్ట్రంలో ఎండల తీవ్రత దృష్ట్యా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజాభవన్‌లో విద్యుత్ సరఫరా పై ఇంధన శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.రాష్ట్రంలో భానుడి భగభగలకు తోడు ఇళ్లు, కార్యాలయాల్లో ఏసీలు, కూలర్ల వాడకం విపరీతంగా పెరిగిందని అధికారులు మంత్రికి వివరించారు. దీనికి వ్యవసాయ అవసరాలు కూడా తోడవడంతో గ్రిడ్‌పై ఒత్తిడి పెరుగుతోందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా విద్యుత్ మార్కెట్‌పై ఒత్తిడి ఉన్నప్పటికీ, రాష్ట్ర అవసరాలకు ఏమాత్రం లోటు రాకుండా పవర్ ఎక్స్ఛేంజీల ద్వారా అదనపు విద్యుత్ కొనుగోళ్లు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఆసుపత్రులు, తాగునీటి సరఫరా పథకాలు మరియు అత్యవసర సేవలకు విద్యుత్ అంతరాయం కలగకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, జల విద్యుత్ ఉత్పత్తిని సమర్థంగా నిర్వహించాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున, అన్ని విద్యుత్ సంస్థలు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వివరించారు. రాష్ట్ర విద్యుత్ వ్యవస్థ స్థిరంగా ఉందని, ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు తగిన ఏర్పాట్లు చేశామని అధికారులు మంత్రికి హామీ ఇచ్చారు. పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని, అన్ని వర్గాల వినియోగదారులకు నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరాను కొనసాగించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ అగ్ర ప్రాధాన్యమని స్పష్టం చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, క్షేత్రస్థాయి సిబ్బందిని నిరంతరం అప్రమత్తంగా ఉంచాలని ఆదేశించారు.

# 20పైగా అంశాలకు కేబినేట్ ఆమోదం

క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల్లో మ్యుటేషన్ ఛార్జీలను ఒకే విధంగా అమలు చేసే చట్టసవరణ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ కార్యాలయంలో ఆఫీస్ మేనేజర్ పోస్టును సెక్షన్ ఆఫీసర్‌గా అప్‌గ్రేడ్ చేసే ప్రతిపాదనకు ఆమోద ముద్ర వేసింది. రామాయపట్నంలో నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ పోర్ట్ ప్రాజెక్టు నిర్మాణ పనులకు రూ.354 కోట్ల మేర పాలనా అనుమతులకు అంగీకారం తెలిపింది. ఏపీ మార్క్‌ఫెడ్‌కు రూ.1800 కోట్ల రుణం పొందేందుకు ప్రభుత్వ గ్యారంటీ ఇచ్చే ప్రతిపాదనకు ఆమోద ముద్ర వేసింది. అమరావతిలో క్వాంటం వ్యాలీ ట్విన్ టవర్ల నిర్మాణానికి రూ.1,208 కోట్ల వ్యయానికి అంగీకారం తెలిపింది. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ 2000 బ్యాచ్‌కు చెందిన 385 మంది కానిస్టేబుళ్లను హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతికి పచ్చజెండా ఊపింది. హైకోర్టు, జిల్లా న్యాయస్థానాల్లో 21 కొత్త పోస్టులు సృష్టించేందుకు అంగీకారం తెలిపింది. రూ.2,540 కోట్లతో అమరావతిలో పలు అభివృద్ధి పనులు చేపట్టాలని కేబినెట్ నిర్ణయించింది. కృష్ణానది ఫ్లడ్ ప్రొటెక్షన్ పనులతో పాటు అమరావతిలోని సచివాలయం గ్లాస్ క్లాడింగ్ పనులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ల్యాండ్ పూలింగ్ స్కీమ్ నిబంధనల్లో సవరణలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పోలవరం ప్రాజెక్ట్ బాధితులకు గృహ యూనిట్ ఖర్చు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీ పరిసరాల్లో సివిల్ వర్క్స్ కోసం రూ.798 కోట్ల ప్రణాళికతో పాటు ఉండవల్లి జోన్‌లో మౌలిక వసతుల కోసం రూ.580 కోట్ల ప్రణాళికకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. 220 కేవీ కేబుల్స్ రీరూటింగ్ పనులకు రూ.1,180 కోట్లు కేటాయించింది. ప్రకాశం జిల్లాలో ఇండస్ట్రియల్ హబ్‌కు భూమిని కేటాయించింది.

# కుప్పం విమానాశ్రయానికి తొలగిని అడ్డంకులు



న్యూఢిల్లీ : చిత్తూరు జిల్లాలో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కుప్పం విమానాశ్రయ ప్రాజెక్టుకు పెద్ద ఊరట లభించింది. భూసేకరణపై కొనసాగుతున్న న్యాయపరమైన వివాదాలకు ముగింపు పలుకుతూ సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. కుప్పం విమానాశ్రయం కోసం చేపట్టిన భూసేకరణను సవాల్ చేస్తూ దాఖలైన స్పెషల్ లీవ్ పిటిషన్ ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో ముందుగా ఏపీ హై కోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టు కోసం సుమారు 150 ఎకరాల భూమిని సేకరించేందుకు చిత్తూరు జిల్లా కలెక్టర్ జారీ చేసిన నాలుగు నోటిఫికేషన్లు చట్టబద్ధమేనని సుప్రీంకోర్టు తేల్చింది. భూమి అనుకూలతపై సరైన ఆధారాలు లేవంటూ చక్రపాణి రెడ్డి, ఇతరులు చేసిన వాదనలను కోర్టు తిరస్కరించింది. ఈ కేసుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఇతర అనుబంధ పిటిషన్లు కూడా ముగిసినట్లు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీంతో ఈ ప్రాజెక్టుకు ఉన్న న్యాయపరమైన అన్ని అడ్డంకులు పూర్తిగా తొలగిపోయాయి. ఈ తీర్పుతో కుప్పం విమానాశ్రయ పనులు త్వరలోనే వేగవంతం కానున్నాయి. ఈ ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధి, రవాణా సౌకర్యాల మెరుగుదల, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల పెరుగుదల వంటి అంశాలకు ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది. కుప్పం విమానాశ్రయ నిర్మాణం పూర్తయితే దక్షిణ ఆంధ్రప్రదేశ్‌కు మెరుగైన ఎయిర్ కనెక్టివిటీ, సమీప ప్రాంతాల ఆర్థిక వృద్ధి, టూరిజం అభివృద్ధి వంటి ప్రయోజనాలు కలగనున్నాయి.

# బెంగాల్లో విజయం ముమ్మాటికీ టిఎంసిదే

ఓ వీడియో సందేశం పోస్టు చేశారు.ఎన్నికల ఫలితం ఇప్పటికే తమ పార్టీకి అనుకూలంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తన పూర్తి యంత్రాంగాన్ని రంగంలోకి దించినా.. విజయం మాత్రం టీఎంసీదే అని తేల్చి చెప్పారు. మరోవైపు ఎగ్జిట్ పోల్స్ అంచనాలపైనా మమతా బెనర్జీ నిప్పులు చెరిగారు. ఎగ్జిట్ పోల్ గణాంకాలను బీజేపీ కార్యాలయం నుంచే విడుదల చేశారంటూ ఆరోపణలు గుప్పించారు. తమ పార్టీ కార్యకర్తలు, నేతల్లో భయాందోళనలు సృష్టించేందుకు బీజేపీ సంఖ్యలను తారుమారు చేసిందని మండిపడ్డారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలతో తన మద్దతుదారుల మనోస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు కుట్ర చేశారని ధ్వజమెత్తారు. రెండో దశ ఎన్నిక వేళ తన నియోజకవర్గం భవానీపూర్‌లో రాత్రంతా దాడులు జరిగాయని మమతా ఆరోపించారు. ఓట్ల లెక్కింపు నాడు పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని మమతా కోరారు. రాష్ట్ర ప్రజలంతా ఐక్యంగా ఉండి లెక్కింపును నిశితంగా గమనించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల్లో విజయం టీఎంసీదే అని మరోసారి స్పష్టం చేశారు మమతా బెనర్జీ. కాగా, బుధవారం సాయంత్రం పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ముగిశాయి. దీంతో వెంటనే ఎగ్జిట్ పోల్స్ విడుదల అయ్యాయి. అందులో మెజారిటీ పోల్స్.. బీజేపీనే ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నాయి. దీనిపై మమతా బెనర్జీ స్పందిస్తూ వీడియో సందేశం రిలీజ్ చేశారు.

# పోలీసు సేవలు అమూల్యం

## సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్

క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన ఏడు మంది పోలీసు సిబ్బందిని సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రిటైర్ అయిన సిబ్బందికి పెన్షన్ పత్రాలు అందజేసి, పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ యూనిఫాం పోలీస్‌కు రెండో చర్మంలాంటిదని, ప్రజల కన్నీరు తుడిచి వారికి సేవలు అందించిన ప్రతి పోలీసు అధికారి పదవీ విరమణ సమయంలో గర్వంగా ఉండాలని అన్నారు. విధుల నిర్వహణలో పోలీసుల కుటుంబ సభ్యులు చేసిన త్యాగాలను గుర్తుచేసి, ప్రతి పోలీస్ అధికారి తన కుటుంబానికి రుణపడి ఉంటాడని పేర్కొన్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి ప్రతిరోజూ వ్యాయామం చేయాలని, సమాజంలోని పౌరులతో సానుభూతి, గౌరవంతో మెలగాలని సూచించారు. రిటైర్ అయిన సిబ్బంది తమ అనుభవంతో భవిష్యత్తులో శాఖకు అవసరమైనప్పుడు సలహాలు ఇవ్వాలని కోరారు.



అలాగే ఎస్బీ ఏడీసీపీ రవికుమార్ డీసీపీగా ప్రమోషన్ పొందినందుకు అభినందనలు తెలిపారు. పదవీ విరమణ సందర్భంగా ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్ మాట్లాడుతూ, ప్రజలకు చేరువయ్యే దిశగా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఒక కానిస్టేబుల్ కుమారుడిగా ప్రారంభమైన తన ప్రయాణం డీసీపీ స్థాయికి చేరడం గర్వకారణమని అన్నారు. పోలీస్ విధుల్లో శారీరక శ్రమతో పాటు మేధోపరమైన కృషి, హ్యూమన్ ఇంటెలిజెన్స్ కీలకమని పేర్కొన్నారు. తన విజయానికి కుటుంబ సభ్యుల సహకారం ఎంతో ముఖ్యమని గుర్తు చేసుకున్నారు. సైబరాబాద్ పరిధిలో ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్, ఎస్బీ ఎస్ఐ పి. వెంకట్ రెడ్డి, ఏఆర్ఎస్ఐ కె. మురళీధర్, ఏఆర్ఎస్ఐ ఎన్. కృష్ణ, ఏఎస్ఐ వి. వెంకట సూర్యనారాయణ రాజు, డి. రాములు, జి. అశోక్ తదితరులు పదవీ విరమణ పొందారు. వారి సేవలను అధికారులు అభినందిస్తూ, భవిష్యత్తులో ఆరోగ్యంగా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, డీసీపీ క్రైమ్స్ ముత్యం రెడ్డి, డీసీపీ స్పెషల్ బ్రాంచ్ వై.వి.ఎస్. సుధీంద్ర, సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్, విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన కర్ణం, ఎస్బీ ఏడీసీపీ రవికుమార్ తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# చిన్నారిని మింగిన మిషన్ భగీరథ గుంత

**పూడ్చకుండా ఉంచడంతో గుంతలో పడ్డ ఐదేళ్ల మోక్షిత**

**అధికారుల తీరుపై గ్రామస్థుల ఆందోళన**

జనగామ : జిల్లాలోని బచ్చన్నపేట మండలం ఆలీంపూర్ గ్రామంలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. అధికారుల నిర్లక్ష్యం ఒక పసి ప్రాణాన్ని బలితీసుకుంది. మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మత్తుల కోసం తవ్విన గుంతను అలాగే వదిలేయడంతో, ప్రమాదవశాత్తు అందులో పడి మోక్షిత అనే ఐదేళ్ల చిన్నారి మృతి చెందింది. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం అలుముకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఆలీంపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఎదుట మిషన్ భగీరథ పైపులైన్ లీక్ కావడంతో, సుమారు 20 రోజుల క్రితం అధికారులు మరమ్మత్తుల కోసం 4 మీటర్ల లోతున భారీ గుంతను తవ్వారు. అయితే, మరమ్మత్తులు పూర్తయినా లేదా మధ్యలో నిలిచిపోయినా, ఆ గుంతను పూడ్చకుండా అధికారులు అలాగే వదిలేశారు. గత మూడు వారాలుగా ఆ మృత్యు గుంత పాఠశాల ముందే దర్శనమిస్తున్నా, ఏ ఒక్క అధికారి కూడా దాని భద్రత గురించి పట్టించుకోలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలీంపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో కవిత అనే మహిళ ఆయాగా పనిచేస్తోంది. ఆమె తన ఇద్దరు కుమార్తెలు దక్షిత , మోక్షితలను వెంటబెట్టుకుని పాఠశాలకు వచ్చింది. తల్లి లోపలికి వెళ్లిన క్రమంలో, ఆడుకుంటూ వెళ్లిన మోక్షిత ప్రమాదవశాత్తు ఆ గుంతలో పడిపోయింది. పక్కనే ఉన్న అక్క దక్షిత ఈ విషయాన్ని వెంటనే తల్లికి చెప్పడంతో, కవిత పరుగులు తీస్తూ వచ్చి తన చిన్నారిని కాపాడుకునేందుకు గుంతలోకి దూకింది. కవితతో పాటు దక్షిత కూడా గుంతలోకి దూకింది. గుంతలో మునిగిపోతున్న వారిని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి ముగ్గురినీ బయటకు తీశారు. అయితే, అప్పటికే జరగరాని నష్టం జరిగిపోయింది. తల్లి కవిత, అక్క దక్షిత ప్రాణాలతో బయటపడినప్పటికీ, ఐదేళ్ల మోక్షిత అప్పటికే మృతి చెందింది. అల్లారుముద్దుగా పెంచుకున్న బిడ్డ తన కళ్లముందే విగతజీవిగా పడి ఉండటంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మిషన్ భగీరథ అధికారుల బాధ్యతారాహిత్యం వల్లే మోక్షిత ప్రాణాలు కోల్పోయిందని ఆగ్రహించిన బంధువులు, గ్రామస్తులు చిన్నారి మృతదేహంతో ఆందోళనకు దిగారు. స్కూల్ ఎదుటే అంత లోతైన గుంతను 20 రోజుల పాటు పూడ్చకుండా వదిలేయడం అధికారుల నేరపూరిత నిర్లక్ష్యమేనని వారు మండిపడుతున్నారు. తక్షణమే బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని , బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనతో ఆలీంపూర్ గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది.

# రుణాల ఎగవేత కేసులో రఘురామకు ఊరట

**అరెస్ట్ చేయవద్దంటూ ఢిల్లీ కోర్టు బెయిల్**

న్యూఢిల్లీ,ఏప్రిల్30 : ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, తెలుగుదేశం పార్టీ ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజుకు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ఊరట దక్కింది. బ్యాంకుల రుణ ఎగవేత కేసులో రఘురామకు బెయిల్ మంజూరు చేసింది. కోర్టుకు వ్యక్తిగతంగా రఘురామ గురువారం హాజరయ్యారు. ఈ కేసు దర్యాప్తు సమయంలో అరెస్ట్ చేయొద్దని ఆయనకు న్యాయస్థానం బెయిల్ ఇచ్చింది. రూ. 50,000 షురిటీ బాండ్‌పై బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో ఆయనతో పాటు మరో నలుగురు నిందితులకు కూడా ఊరట లభించింది. సీబీఐ అధికారులు దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో సుమారు 15 వేల పేజీలకు పైగా ఉండటంతో, ఆ పత్రాల పరిశీలనకు నిందితుల తరపు న్యాయవాదులు సమయం కోరారు. పత్రాల పరిశీలన (÷ూఇసబీబితినా) కోసం తదుపరి విచారణను జులై 6, 2026కి వాయిదా వేసింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న కంపెనీల లిక్విడేషన్ స్థితిగతులను తెలపాలని సంబంధిత అధికారులను ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశించింది.

# చిన్నపాటి మందలింపుకే ఆత్మహత్య

**మృత్యువుతో పోరాడుతూ బాలిక మృతి**

**టెన్త్ ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన వర్షిత**

ఖమ్మం,ఏప్రిల్30 : ఖమ్మం జిల్లా రఘునాధపాలెం మండలంలో జరిగిన ఈ ఘటన అత్యంత విషాదకరం. పదోతరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించి ఉజ్వల భవిష్యత్తు ఉండాల్సిన ఒక విద్యార్థిని ప్రాణాలు తీసుకోవడం అందరినీ కలిచివేస్తోంది. ఖమ్మం జిల్లా రఘునాధపాలెం మండలం చింతగుర్తి గ్రామానికి చెందిన దారెల్లి వర్షిత (16) అనే విద్యార్థిని విషాదకరంగా ప్రాణాలు కోల్పోయింది. ఏప్రిల్ 24వ తేదీన ఉదయం ఆలస్యంగా నిద్రలేచినందుకు తల్లి మందలించగా, ఆవేశానికి లోనైన వర్షిత ఇంట్లో ఉన్న ఎలుకల మందు పేస్టు తిని అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వర్షిత పరిస్థితి విషమించడంతో ముందుగా ఖమ్మంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. వైద్యులు ఆమెను బతికించడం కోసం ప్రయత్నాలు చేసిన పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందింది. మృతదేహాన్ని తిరిగి గ్రామానికి తీసుకువచ్చి గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. వర్షిత బుధవారం విడుదలైన పదోతరగతి పరీక్షల ఫలితాల్లో 530 మార్కులు సాధించి చదువులో మంచి ప్రతిభ కనబరిచింది. ఈ విషయం తెలిసిన తర్వాత కుటుంబ సభ్యులు, స్నేహితులు, పాఠశాల ఉపాధ్యాయులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# ఉద్యోగాల కల్పన లక్ష్యంగా కృషి

**కేబినేట్ సబ్‌కమిటీ భేటీలో మంత్రులు**

అమరావతి,ఏప్రిల్30 : ఉద్యోగాల సృష్టిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని అధికారులకు కేబినేట్ సబ్‌కమిటీ సూచించింది. ఏపీ మంత్రివర్గ ఉపసంఘ సమావేశం గురువారం రాష్ట్ర సచివాలయంలో జరిగింది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై అధికారులతో మంత్రులు చర్చించారు. ప్రధానంగా ఏపీలో 20 లక్షలకు పైగా ఉద్యోగ కల్పన లక్ష్యంపై మంత్రులు మాట్లాడారు. అలాగే, ఇన్వెస్ట్‌మెంట్, ఎంప్లాయిమెంట్‌పై మంత్రులు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో మంత్రులు కందుల దుర్గేశ్, టీజీ భరత్, గొట్టిపాటి రవి కుమార్, కొండపల్లి శ్రీనివాస్, సీఎస్ జి. సాయిప్రసాద్ హాజరయ్యారు. ఉద్యోగ వివరాలు ఒకే పోర్టల్‌లో నమోదు చేయాలని మంత్రులు ఆదేశించారు. పారదర్శకంగా ఉద్యోగ డేటా నమోదు చేయాలని సూచించారు. శాఖల వారీగా నిరంతర పర్యవేక్షణకు ఆదేశాలు జారీ చేశారు. భారీ, మధ్య, చిన్న పరిశ్రమల స్థాపనపై అధికారులు దృష్టిసారించాలని అన్నారు. ఎంఎస్‌ఎంఈల ద్వారా ఉద్యోగాల విస్తరణకు ప్రాధాన్యం కల్పించాలని చెప్పారు. ఉద్యోగాల కల్పన వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. అలాగే, పెట్టుబడులు ఉద్యోగాల అనుసంధానంపై మంత్రులు దృష్టి సారించారు. ఆయా అంశాలపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో మంత్రులు సమగ్రంగా చర్చించారు. ఉద్యోగావకాశాల పెంపు దిశగా చర్యలు వేగవంతం చేయాలని అధికారులకు మంత్రులు దిశానిర్దేశం చేశారు.

# గుజరాత్ పోలీసుల అదుపులో మురుగన్ గ్యాంగ్

**గ్యాంగ్ సమాచారంతో మూడు ఫెర్టిలిటీ సెంటర్లలో సోదాలు**

హైదరాబాద్,ఏప్రిల్30 : చిన్నారుల అక్రమ రవాణా కేసులో మురుగన్ గ్యాంగ్‌ను గుజరాత్ పోలీసులు అరెస్ట్ చేశారు. మూడు ఫెర్టిలిటీ సెంటర్లకు మురుగన్ గ్యాంగ్‌తో సంబంధాలు ఉన్నాయి. ఈ గ్యాంగ్ ఇచ్చిన సమాచారం మూడు ఫెర్టిలిటీ సెంటర్లలో గుజరాత్ పోలీసులు సోదాలు నిర్వహించారు. ఆదిలాబాద్‌లో గత ఏడాది వరకు ఇటుకల బట్టీలో పని చేసిన మురుగన్, కేవలం ఒక్క ఏడాదిలోనే చైల్డ్ ట్రాఫికింగ్‌లో కింగ్‌పిన్‌గా ఎదిగాడని పోలీసుల విచారణలో వెల్లడైంది. గత ఏడాది చైతన్యపురి కేసులో మురుగన్ పేరు వెలుగులోకి వచ్చింది. గత ఏడాది మూడు నెలల పాటు జైల్లో ఉన్న అతడు జూలైలో విడుదలయ్యాడు. ఆపై దేశవ్యాప్తంగా చైల్డ్ ట్రాఫికింగ్ ముఠా నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్నాడు. అతడి భార్య కృష్ణవేణి మరో గ్యాంగ్‌ను నడుపుతున్నట్టు గుజరాత్ పోలీసులు గుర్తించారు. ఈ మురుగన్ గ్యాంగ్ ఒక్క ఏడాదిలోనే 25 మంది చిన్నారులను విక్రయించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ప్రస్తుతం మురుగన్ గ్యాంగ్ సభ్యులు గుజరాత్ పోలీసుల అదుపులో ఉన్నారు. వారి విచారణలో మురుగన్ గ్యాంగ్‌కు మూడు ఫెర్టిలిటీ సెంటర్లతో సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మురుగన్ గ్యాంగ్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు వారిని గుజరాత్‌కు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఫెర్టిలిటీ సెంటర్ల ప్రమేయానికి సంబంధించి పూర్తి స్థాయిలో గుజరాత్ పోలీసులు విచారణ చేపట్టారు. ఇదిలావుంటే హైదరాబాద్‌లోని ప్రముఖ నోవా ఐవీఎఫ్ ఫర్టిలిటీపై గుజరాత్ పోలీసులు తనిఖీలు చేశారని ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. ఈ విషయంపై నోవా సంస్థ నిర్వాహకులు క్లారిటీ ఇచ్చారు. చిన్నారుల అక్రమ రవాణా కేసులో మురుగన్ గ్యాంగ్‌కు.. తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తమ ఫర్టిలిటీ సెంటర్లపై గుజరాత్ పోలీసులు తనిఖీలు చేయలేదని వెల్లడించారు. చట్టానికి అనుగుణంగా తాము క్లినిక్ సెంటర్లు నిర్వహిస్తున్నామని, క్లినికల్, ఎథికల్, లీగల్ ప్రమాణాలకు అనుగుణంగా పనిచేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. సోషల్ మీడియాలో తమ ఫర్టిలిటీ సెంటర్లపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలు పూర్తి అవాస్తవమని, ఎలాంటి ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు తమ సెంటర్లపై జరగలేదని వివరణ ఇచ్చారు. రోగులకు ఉత్తమ సేవలు అందించడమే తమ లక్ష్యమని నోవా ఐవీఎఫ్ ఫర్టిలిటీ నిర్వాహకులు పేర్కొన్నారు.

# మైక్రో ఫైనాన్స్ స్కామ్ కేసు

**మంగ్లీ సోదరుడి అకౌంట్‌కు డబ్బులు**

**నిందితుడు రమావత్ మధు ట్రాన్స్‌ఫర్**

**బ్యాంకర్లను వివరాలు కోరిన పోలీసులు**

హైదరాబాద్,ఏప్రిల్30 : తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టిస్తోన్న మైక్రో ఫైనాన్స్ స్కామ్ కేసు కీలక మలుపు తిరిగింది. సింగర్ మంగ్లీ సోదరుడు శివ చౌహాన్ అకౌంట్‌కు నిందితుడు రమావత్ మధు నగదు పంపినట్లు పోలీసులు గుర్తించారు. కేసు విచారణలో భాగంగా రమావత్ మధు అకౌంట్‌ను పరిశీలించగా.. మంగ్లీ సోదరుడు శివ చౌహాన్ అకౌంట్‌కు డబ్బులు పంపినట్లు తేలింది. మూడుసార్లు నగదు ట్రాన్స్‌ఫర్ అయినట్లు పోలీసులు గుర్తించారు. డబ్బులు పడిన రోజే ఖాతా నుంచి విత్ డ్రా చేసినట్లు నిర్ధారించారు. అయితే, ఎంత మేర నగదు ట్రాన్స్‌ఫర్ అయ్యిందో అధికారులు ఇంకా వెల్లడించలేదు. మరోవైపు రమావత్ మధు అకౌంట్‌ను సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం(ఈవోడబ్ల్యూ) సీజ్ చేసింది. రమావత్ మధు, హిమకాంత్‌రెడ్డి, శివ చౌహాన్‌కు చెందిన అకౌంట్ల పూర్తి వివరాలను ఇవ్వాలని సంబంధిత బ్యాంకులకు పోలీసులు లేఖ రాశారు. మరోవైపు నిందితులతో తమకు ఎలాంటి సంబంధం లేదని, ఈ కేసులో తమ పేర్లను అనవసరంగా లాగుతున్నారని మంగ్లీ, ఆమె సోదరుడు శివ చౌహాన్ ఆరోపిస్తున్నారు. కాగా, నిందితుడు రమావత్ మధు.. అధిక వడ్డీ పేరుతో వేల మంది నుంచి వందల కోట్ల రూపాయలు వసూలు చేశాడని ఆరోపణలు ఉన్నాయి. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిని పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు.

# యాదాద్రిలో నృసింహ జయంతి

యాదాద్రి భువనగిరి : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో నృసింహ స్వామి జయంతి ముగింపు ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి అలంకరణ సేవను గురువారం ఉదయం ఊరేగింపు చేపట్టారు. యాగశాలలోని ప్రత్యేక వేదిక పై అధిష్టింప జేశారు. ద్వార తోరణ, మూర్తి కుంభారాధన, చతుఃస్థానార్చన లక్ష్మీనృసింహ, సుదర్శన, గరుడ మూలమంత్ర హోమాలను శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం ద్వారకోరణ మాషబలి మహా పూర్ణాహుని చేపట్టి ఏకోత్తర సహస్ర కలశావీషేకము సహస్ర ఘటాభిషేక వేడుకలను ఘనంగా నిర్వహించారు.సాయంత్రం 6.30 గంటలకు అర్చన, తదుపరి వేదస్వస్తి, నృసింహ అవిర్భావము. ఋత్విక్ సన్మానము మహానివేధన, తీర్థ ప్రసాద గోష్ఠి ఉత్సవ పరిసమాప్తి చేపట్టనున్నారు. అనుబంధ పాతగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవాలయం, దబగుంటుపల్లి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో నృసింహ జయంతి ఉత్సవాల సందర్భంగా ముగింపు ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బీ. నరసింహ మూర్తి, ఈవో భవాని శంకర్, డీఈవో నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# సీతారాం ఆత్మహత్యలో చీకటి కోణం

**భార్య అక్రమ సంబంధాలతో తీవ్ర మనోవేదన**

**తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డ టెక్కీ**

**సూసైడ్ నోట్ ఆధారంగా వివరాలు వెల్లడి**

హైదరాబాద్,ఏప్రిల్30 : రాష్ట్రంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో కలకలం సృష్టించిన టెకీ సీతారాం ఆత్మహత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసులో సీతారాం రాసిన 19 పేజీల సూసైడ్ నోట్ బయటకు రావడంతో ఆత్మహత్యకు గల కారణాలు తెలిశాయి. భార్య ఇతరులతో శారీరక సంబంధాలతో విసిగిపోయి సీతారాం ఆత్మహత్య చేసుకున్నట్టు నోట్ ద్వారా వెల్లడించాడు. తను వద్దని చెప్పినా వినలేదని సీతారాం పేర్కొన్నాడు. ఏపీలోని మార్కాపురానికి చెందిన సీతారాం, నంద్యాలకు చెందిన రేణుకకు 2018లో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. సీతారాం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. సీతారాం కుటుంబం బాచుపల్లిలో స్థిరపడింది. అయితే రేణుక తన భర్తకు తెలియకుండా ముగ్గురితో అక్రమ సంబంధం పెట్టుకొని, ప్రైవేట్ వీడియోలు తీసుకుంది. ఆ దారుణాలు చూడలేక భర్త సీతారం హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. భర్తకు తెలియకుండా ముగ్గురితో అక్రమ సంబంధం పెట్టుకున్న రేణుక రమణారెడ్డి అనే వ్యక్తితో కలిసినప్పుడు ప్రైవేట్ వీడియోలు తీసుకుంది. ఆ వీడియోలను రమణారెడ్డి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయగా.. తన భార్య నిజ స్వరూపం తెలిసిన సీతారాం ఫిబ్రవరి నెలలో 19 పేజీల సూసైడ్ లేఖ రాసి హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.సూసైడ్ లేఖలో నా భార్య రేణుకకు ఏలోటు రాకుండా చూసుకున్నా.. కానీ ఆమె ఏడాదిన్నరలోనే ముగ్గురితో అక్రమంగా శారీరక సంబంధం పెట్టుకుంది. అంతేకాకుండా ప్రైవేట్ వీడియోలను రికార్డు చేసుకోగా.. ఓ లవర్ దానిని ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశాడు. ఆ దారుణాలను చూసి నేను ఎలా తట్టుకోగలగాలి.. అసలు రేణుకకు ఏం కావాలి. ప్రేమనా లేక శృంగారమా..? నా భార్యకు ఏలోటు రాకుండా చూసుకున్నా.. కానీ ఆమె నాకు నమ్మక ద్రోహం చేసింది అంటూ తన ఆవేదన తెలుపుతూ బలవన్మరణానికి పాల్పడ్డాడు. సూసైడ్ నోట్ ఆధారంగా దర్యాప్తు జరిపి రేణుకతోపాటు ఆమె ఇద్దరు లవర్స్ రమణారెడ్డి, శ్రవణ్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. రేణుక నమ్మకద్రోహం వల్ల నెలకు రూ.2 లక్షలు సంపాదించే సీతారాం ప్రాణాలు పోగొట్టుకున్నాడని, ఇద్దరు పిల్లలు అనాథలు అయ్యారని కుటుంబసభ్యుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# శ్రామిక వర్గానికి ఎప్పుడూ అండగా ఉన్నాం

**కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నాం**

**మేడు శుభాకాంక్షలు తెలిపిన సిఎం రేవంత్**

హైదరాబాద్,ఏప్రిల్30 : మే డే సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి కార్మిక వర్గానికి ప్రత్యేకంగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రభుత్వ పాలనలో కార్మిక వర్గ స్ఫూర్తితో ముందుకు వెళుతున్నట్టు పేర్కొన్నారు. తమ ప్రభుత్వ పాలనలో కార్మికులకు సముచిత గౌరవం లభిస్తుందని స్పష్టం చేశారు. శ్రామికులే తమ ప్రభుత్వ అభివృద్ధిలో అసలైన భాగస్వామ్యులని... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే నూతన పారిశ్రామిక విధానం శ్రామికుల అభ్యున్నతికి దోహదపడుతుందని చెప్పారు. కార్మికుల శ్రేయస్సు, సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. మే డే స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే అసంఘటిత రంగంలో పని చేస్తున్న గిగ్ వర్కర్ల కోసం రూ. 5 లక్షల ప్రమాద బీమా అమలు చేశామన్నారు. తెలంగాణ గిగ్, ఎ÷-లాట్ ఫాం వర్కర్స్ సంక్షేమ బిల్లు తీసుకువచ్చినట్టు తెలిపారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తున్నదని సీఎం పేర్కొన్నారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ శాఖల్లో పెండింగ్ లో ఉన్న కారుణ్య నియామకాలను భర్తీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ దేశానికే తలమానికంగా ఉన్న సింగరేణి కార్మికులకు, దసరా, దీపావళి పండుగలకు ముందే బోనస్ చెల్లించడం జరిగిందన్నారు. సింగరేణి చరిత్రలో తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకు రూ. 5 వేలు చొప్పున బోనస్ ఇచ్చినట్టు గుర్తు చేశారు. దాంతోపాటు, పలు బ్యాంకుల సహకారంతో కార్మికులకు కోటి రూపాయల బీమా సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించినట్టు వివరించారు. గల్ఫ్ దేశాల్లో పని చేసే తెలంగాణ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. తెలంగాణ కార్మికులు ఆయా దేశాల్లో ఏ కారణంతో మరణించినా.. వారి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించడం జరుగుతుందన్నారు.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

న్యూఢిల్లీ,ఏప్రిల్30 : అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ తగ్గడం, డాలర్ బలపడడం వంటి కారణాలతో బంగారం ధరలు క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. గత కొన్ని రోజులుగా పెరుగుతూ వెళ్లిన బంగారం ధరలు ప్రస్తుతం తగ్గుతుండడంతో కొనుగోలుదారులకు కొంత ఊరట లభిస్తోంది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, గురువారం ఉదయం 6.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,50,430గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,37,890గా ఉంది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,50,580గా, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,38,040గా ఉంది. మరోవైపు వెండి ధరలు కూడా తగ్గుదల నమోదు చేశాయి. కిలోకు వంద రూపాయల మేర తగ్గాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2,64,900గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,54,900గా ఉంది. అలాగే చెన్నైలో కిలో వెండి ధర రూ.రూ.2,64,900గా, బెంగళూరులో రూ.రూ.2,54,900 ఉంది.

# ఆస్తిపన్ను తగ్గించేందుకు లంచం

**ఎసిబికి పట్టుబడ్డ కాంట్రాక్ట్ ఉద్యోగి**

సంగారెడ్డి,ఏప్రిల్30 : జిల్లాలోని సదాశివపేట మున్సిపల్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు చేపట్టిన సోదాలు ముగిశాయి. ఆస్తి పన్ను తగ్గించడానికి బిల్లు కలెక్టర్ ఒక వ్యక్తి నుంచి రూ.35 వేలు లంచం డిమాండ్ చేశాడు. అప్పటికే బాధితుడి నుంచి రూ. 20 వేలు తీసుకున్నాడు. మిగిలిన నగదు కూడా ఇవ్వాలంటూ బాధితుడిపై నిఖిల్ రెడ్డి ఒత్తిడి పెంచాడు. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులను బాధితుడు ఆశ్రయించాడు. గురువారం రూ.15 వేలు బాధితుడి నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు నిఖిల్ రెడ్డి చిక్కాడు. అనంతరం సదాశివపేట మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ నేతృత్వంలో గురువారం సోదాలు చేపట్టారు. దాదాపు 4 గంటల పాటు ఈ సోదాలు కొనసాగాయి. నిఖిల్ రెడ్డిపై కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టినట్లు ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ వెల్లడించారు. మున్సిపల్ కార్యాలయంలో నిఖిల్ రెడ్డి కాంట్రాక్ట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడని డీఎస్పీ తెలిపారు

# సంపాదకీయం

## శ్రమదోపిడీని ప్రోత్సహిస్తున్న పాలకులు !

శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది ఏదీ లేదని మహాకవి శ్రీశ్రీ అన్నారు. కార్మిక లోకాన్ని తట్టి లేపిన విప్లవకారుడు శ్రీశ్రీ. అయితే దేశంలో ఐటి విప్లవం వచ్చిన తరవాత పాలకులు కార్మికులను పట్టించుకోవడం మానేశారు. నేటికీ వారి బతుకులు ఛిద్రం అవుతున్నా కనీసం పలకరింపులు, సానుభూతి వచనాలు లేవు. ఇప్పుడు కార్మికులంటే కేవలం కర్మాగారాల్లో పనిచేస్తున్నవారే కాదు. రోడ్డుమీద పడి పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ కార్మికులే. వారికి ముఖ్యంగా ఆరోగ్య, ఆర్థిక భద్రత లేదు. ఆకాశ హర్మ్యాలను కడుతున్నా.. కుటుంబబానికి దూరంగా ఊడిగం చేస్తున్నా కూలీ తప్ప పెద్దగా ప్రయోజనాలు కలగడం లేదు. వీరందరికీ ప్రధానంగా ఆరోగ్య వసతి, పెన్షన్ పథకాలు కలగాలి. పనిచేసే ప్రతి ఒక్కరినీ కార్మికులుగా చూడాలి. వారికి విద్య,ఆరోగ్య, పెన్షన్ భద్రత వంటి కనీస సౌకర్యాలు కలగాలి. అలాగే అసంఘటిత కార్మికులను ఆదుకునే ప్రయత్నాలు చేయాలి. పాలకులంతా ఎసి కార్లలో, విమానాల్లో తిరుగుతూ.. ఎసి బంగలాల్లో నివస్తున్నారు. వీరికి సామాన్యుల కష్టాలు తెలియడం లేదు. ప్రజలు కట్టిన పన్నులతో జల్సాలు చేస్తున్నారు. సమాజ గతిని, పురోగతిని శాసించేది, నిర్దేశించేది శ్రామిక వర్గమే. ఆ శ్రమే వెట్టిచాకిరికి గురవుతోంది. శ్రామికుడు దోపిడీకి గురవుఉతన్నాడు. పరిస్థితులు ఇలాగే ఉంటే.. కష్టించి పని చేసే చేతులు పిడికిళ్లు బిగిస్తాయని గుర్తించాలి.  ఉద్యమాలు పుట్టుకొస్తాయి. కార్మిక దినోత్సవ ఆవిర్భావాన్ని ఏ ఒక్క దేశానికో, సంఘటనకో ముడిపెట్టలేం. కానీ 1886లో షికాగోలోని హే మార్కెట్‌లో జరిగిన కార్మికుల ప్రదర్శనే ఈ మే డే పుట్టుకకు పునాది వేసిందని చెబుతారు. కానీ ఆ ప్రదర్శన ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జరిపిన కాల్పుల్లో కొందరు కార్మికులు చనిపోయారు. ఆ సంఘటన అనంతరం 1889 నుంచి 1890 వరకు అనేక దేశాల్లో కార్మికుల ఉద్యమాలూ, నిరసన ప్రదర్శనలూ చోటుచేసుకున్నాయి. షికాగోలో జరిగిన కార్మిక ప్రదర్శనలో చనిపోయిన వారికి గుర్తుగా మే 1ని కార్మిక దినోత్సవంగా జరుపుకోవాలన్న ఒప్పందం కూడా కుదిరింది. భారతదేశంలో చాలా ఆలస్యంగా కార్మిక దినోత్సవాన్ని జరుపుకున్నాము. 1923 మే 1వ తేదీన మద్రాసులో లేబర్ కిసాన్ పార్టీ ఆధ్వర్యంలో తొలిసారి ఈ వేడుకలను జరుపుకున్నారు.  రెండో ప్రపంచ యుద్ధం తరవాత ఐరోపా దేశాల్లో మే 1వ తేదీని సెలవు దినంగా పాటించడం మొదలు పెట్టారు. అనంతరం అనేక దేశాలు ఇదే బాటలో నడిచాయి. చాలా దేశాల్లో కార్మికులకు సంబంధించిన అనేక సంక్షేమ పథకాలు ఆ రోజునే అమల్లోకి వచ్చాయి. కార్మిక దినోత్సవం సందర్భంగా చాలా దేశాల్లో కార్మికులకు సంబంధించి అనేక సంక్షేమ పథకాలు పుట్టుకొచ్చాయి. అలాగే సంక్షేమ పథకాల అమలుకు, నిరసన ప్రదర్శనలకు మే 1వ తేదీ వేదికగా మారింది. ముఖ్యంగా మేడే రోజున కార్మికులు వారి హక్కులను గుర్తు చేసుకోవడం, సమాజానికి వారు చేసిన సేవలకు గాను తగిన గుర్తింపు ఇచ్చి వారిని సన్మానించడం చేస్తున్నాం. 1916లో తొలిసారిగా రోజుకు 8 పని గంటలు మాత్రమే అన్న డిమాండ్‌కు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. మనదేశంలో ఇతర దేశాల కంటే ముందే కలకత్తాలో కార్మికుల పనిగంటల కోసం హౌరా రైల్వే స్టేషన్లో 1862లోనే సమ్మె చేశారు. 1923లో తొలిసారిగా భారత్ దేశంలో మే డే ను పాటించారు. ఆ తర్వాత 1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడడంతో అప్పటి నుంచి కార్మికవర్గాల్లో చైతన్యం మొదలైంది. దీంతో మే డే పాటిస్తున్నారు. కానీ అసంఘటిత కార్మిక వర్గం అన్ని రంగాల్లో వచ్చింది. 1985 తర్వాత చోటుచేసుకున్న ప్రైవేటైజేషన్, లిబరలైజేషన్, గ్లోబలైజేషన్  పరిణామాల వల్ల అసంఘటిత కార్మికవర్గాల కార్మిక చట్టాలు అమలుకు నోచుకోవడంలేదు. మనదేశంలో అసంఘటిత రంగం పూర్తిగా నిరాదరణకు గురవుతోంది. నిర్మాణ, వ్యవసాయ, గిర కార్మిక రంగాలు పూర్తిగా వెలివేయ వడ్డాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 80కి పైగా దేశాల్లో కార్మిక దినోత్సవాన్ని జరుపుకుంటారు. సామాజిక న్యాయం, అందరికీ గౌరవప్రదమైన పనిని ప్రోత్సహించడానికి పాలకులు ముందుకు రావాలి. ముఖ్యంగా, ఐ.టి.రంగంలో ఎంతోమంది ఆడపిల్లలు, యువకులు పనిచేస్తున్నారు. ప్రస్తుతం  మార్కెట్ శక్తులు ఎక్కడ శ్రమను దోచుకునే అవకాశం వుంటే అక్కడ కంపెనీలు పెడుతున్నారు. అమెరికాలో వున్న కంపెనీలు అక్కడ ప్రజాచైతన్యం ఉన్నది కాబట్టి కార్మిక చట్టాలు అమలుకానటువంటి ఇండియాలో కంపెనీలు పెడుతూ వాళ్ళచే 10,12 గంటలు పనిచేయి స్తున్నారు. ఐటి రంగంలో పనిచేస్తున్న  విద్యావంతులైన యువత శ్రమ దోపిడీకి బలవుతున్నది. రాత్రుళ్లు ఆడపిల్లలను భద్రతలేకుండా ఇళ్ళకు పంపించడం మూలంగా నేరాల సంఖ్య కూడా పెరుగుతున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థ వున్నంతవరకు శ్రమదోపిడీ, ఎక్కువ పనిచేయించుకోవడం సర్వసాధారణం. కార్మిక చట్టాలను ఐ.టి. రంగంలో కూడా అమలుకై పోరాటం ఇప్పుడు అత్యంత అవసరం. కార్మిక చట్టాలు అమలు చేయబోమని పాలకవర్గాలు బహుళజాతి కంపెనీలకు హామీలిస్తూ దేశంలోకి స్వాగతిస్తున్నాయి. అసంఘటితరంగంలో అయితే సరేసరి. ఇటీవల ప్రభుత్వం కాంట్రాక్టు, పార్ట్‌టైం ఉద్యోగుల పేరుతో ప్రవేశపెట్టిన ఔట్ సోర్సింగ్‌లోను కార్మిక చట్టాల నియమాలు అమలు కావడం లేదు. అందుకే అనేక సంస్థల్లో రెగ్యులర్ ఉద్యోగుల కన్నా కాంట్రాక్టు ఉద్యోగులే అధికమైనారు. అంతేకాకుండా ప్రభుత్వరంగంలో పనిచేసే ఉద్యోగుల సంఖ్య కూడా క్రమంగా తగ్గిపోయింది. నిరుద్యోగాన్ని, బలహీనతలను ఆసరా చేసుకొని వాళ్ళచే 10,12 గంటలు పనిచేయిస్తున్నారు. ఇది విద్యా, వైద్య రంగాల్లో ప్రయివేటీకరణ పెరిగిన కొద్దీ సర్వీసు భద్రత తక్కువవుతుంది కాబట్టి శ్రమదోపిడీ కూడా పెరుగుతుంది. వెనుకటికి స్కూళ్ళు 10 నుండి 14గంటల వరకు పనిచేసేవి. పిల్లవాణ్ణి ఆరు గంటల కంటే ఎక్కువ చదివించకూడదని విద్యావేత్తలు, పరిశోధకులు చెబుతున్నా, సెమీ రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ పేర పాఠశాలలు సర్వసాధారణమైపోయాయి. అందుకే ప్రైవేట్ టీచర్స్ నోరు మెదపకుండా 12 గంటలు పనిచేయాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రపంచీకరణ వలన వంద సంవత్సరాల క్రితం సాధించిన కనీస డిమాండ్లు కూడా ఈనాడు అమలుకు నోచుకోవడంలేదు.  ఎనిమిది గంటల పనికోసం చేసిన పోరాటం పెట్టుబడిదారీ వర్గం పతనానికి ఆరంభమవుతుందనుకున్నాం. కానీ మళ్ళీ మార్కెట్ శక్తులు పాత పరిస్థితులకు ప్రాణప్రతిష్ఠ చేస్తున్నాయి. ఆనాటి కార్మికవర్గ చైతన్యం మరోసారి వెల్లివిరుస్తుందని, ఈ మే డే నాడు కొత్త స్ఫూర్తిని రగిలిస్తుందని ఆశిద్దాం. ప్రపంచీకరణ, సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారులు, బహుళజాతి కంపెనీలు, మొదలైనవి శ్రామిక దోపిడీకి, కార్మిక చట్టాల ఉల్లంఘనకు సంఘటితమవుతున్న ఈ తరుణంలోనే ప్రపంచ కార్మికవర్గం ఆ శక్తులను ప్రతిఘటించేందుకు ద్విగుణీకృత ఉత్సాహంతో పోరాడాలి. ప్రపంచ శాంతిని అసలు ఈ భూగోళాన్నే కాపాడుకోవాల్సిన అవసరం కూడా ఉంది. అందుకు కార్మిక శ్రేణులు ఏకం కావాల్సిన చారిత్రక సందర్భం కూడా ఇదే.

# మమత, స్టాలిన్‌లకే మళ్లీ అవకాశం





ప్రతిష్ఠాత్మకంగా జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం, మొత్తం అయిదు అసెంబ్లీల ఎన్నికల పోలింగ్ ఘట్టం బుధవారంతో ముగిసింది. రెండు చోట్ల ఎన్‌డిఎ, మూడు చోట్ల ప్రత్యర్థి పార్టీ/ కూటములు గెలుపొందే అవకాశాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. దేశప్రజల దృష్టినాకర్షించిన పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో ఆసక్తికరంగా ప్రస్తుత ముఖ్యమంత్రులు తమ ప్రభుత్వాల్ని నిలబెట్టుకునే సూచనలున్నాయి. ఈ రెండు చోట్ల, కేంద్రంలో పాలకపక్షమైన బిజెపికి గట్టి ప్రత్యర్థులు మమతా బెనర్జీ (టిఎంసి), ఎం.కె. స్టాలిన్ (డిఎంకె) లు ముఖ్యమంత్రులుగా ఉన్న విషయం తెలిసిందే! ఇక బిజెపి నేతృత్వం వహిస్తున్న ఎన్‌డిఎ ప్రస్తుత పాలనలోని అసోం (హిమంత బిశ్వశర్మ), పుదుచ్చేరి (ఎన్.ఆర్. రంగస్వామి) ల్లోనూ పాలకపక్షాలే గెలుపొందనున్నాయి. దేశంలో ఏకైక కమ్యూనిస్టు రాష్ట్రం కేరళ (పినరయ్ విజయ్) లో మాత్రమే పాలక వామపక్ష ఎల్‌డిఎఫ్ ఓడి కాంగ్రెస్ నేతృత్వపు యుడిఎఫ్ గెలుపొందే సంకేతాలున్నాయి. ఇక్కడ బిజెపి ఉనికి నామమాత్రమే! కమ్యూనిస్టు పాలనలోని ఒక్క కేరళలో తప్ప మిగతా నాలుగుచోట్ల పాలకపక్షాలే ఎన్నికల్లో గెలిచే సూచనలున్నాయి. అందులో రెండు ఎన్‌డిఎ ప్రభుత్వాలయితే రెండు ప్రత్యర్థి ప్రభుత్వాలు. అంటే, ఎన్నికలు జరిగిన అసెంబ్లీలు అయిదింట రెండు ఎన్‌డిఎకు, మూడు ఇతరులకు దక్కనున్నాయి. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) వివాదమొకవైపు, నియోజకవర్గాల పునర్విభజనను మహిళా రిజర్వేషన్‌తో ముడిపెట్టిన రాజ్యాంగ సవరణ పంచాయతీ మరోవైపు రేపిన ఉత్కంఠ మధ్య ఈ ఎన్నికలు జరిగాయి. పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ రికార్డు స్థాయిలో నాలుగోసారి ముఖ్యమంత్రి కానున్నారు. అసోంలో బిజెపి వరుసగా మూడో మారు ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. తన తండ్రి కరుణానిధి సాధించలేని రికార్డు, తమిళనాడులో వరుసగా రెండోసారి డిఎంకెను గెలిపించి ఎం.కె. స్టాలిన్ నెలకొల్పనున్నారు. కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో సిఎం ఎన్.ఆర్. రంగస్వామి నేతృత్వంలో మళ్లీ ఎన్‌డిఎ అధికారం కైవసం చేసుకోనుంది. ప్రతిసారీ కొత్త ప్రభుత్వాన్నే ఎన్నుకునే కేరళ సాంప్రదాయానికి భిన్నంగా 2021లో వరుసగా రెండోసారి ప్రభుత్వం ఏర్పరచి రికార్డు సృష్టించిన సిఎం పినరయ్ విజయ్ నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ ఈసారి గట్టెక్కే పరిస్థితులు లేవు. వాయ్‌నాడ్ లోక్‌సభ స్థానంవల్ల కాంగ్రెస్ నేతలు రాహుల్, ప్రియాంకల ప్రాబల్యం పెరిగిన కేరళలో ఈసారి సమీకరణాలు యుడిఎఫ్‌కు ప్రభుత్వం ఏర్పర్చే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. అయిదు చోట్ల 'పీపుల్స్‌పల్స్' జరిపిన సర్వేలో వెల్లడయిన అంశాలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. గూడులేని ఆ గోడు పట్టేదెవరికి? మమతకే మళ్లీ పట్టం! ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) అత్యంత వివాదాస్పదమైన రాష్ట్రం పశ్చిమబెంగాల్. ఈసారి ఎన్నికల ప్రచారాలు ఆద్యంతం 'సర్' చుట్టూ అల్లుకున్న పరిస్థితుల్లో ఫలితంపై ఉత్కంఠ, దేశ ప్రజల ఆసక్తి తారస్థాయికి చేరాయి. 'ఈసారి మమత ఓటమి ఖాయమని బిజెపి వర్గాలు బలంగా విశ్వసిస్తున్న చోట, ఫలితం అందుకు భిన్నంగా ఉండే అవకాశాలే మెండుగా ఉన్నాయి. 'సర్'ను వ్యతిరేకిస్తూ మమత తన కేసు తానే సుప్రీం కోర్టులో వాదించి సంచలనం సృష్టించారు. ఆమె ఎన్నికల వ్యూహకర్త 'పికె టీం' పై ఇడి దాడులు, కేంద్ర బలగాల మోహరింపుతో సహా కేంద్ర సర్కారు ఈ పోరులో ఎన్నో ఎత్తుగడలు పన్నింది. గత ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి), బిజెపిలకు లభించిన ఓట్ల మధ్య వ్యత్యాసం 60 లక్షలు కాగా ఈసారి 'సర్'లో తొలగించిన ఓట్లే 90 లక్షలు! కిందటి ఎన్నికలతో పోలిస్తే టిఎంసి (215) స్థానాలు తగ్గి బిజెపి స్థానాలు (77) పెరిగే అవకాశముంది. కాంగ్రెస్, కమ్యూనిస్టులతో సహా ఇతరులంతా నామమాత్రమైపోయిన ఇక్కడ, ఈ రెండు పార్టీల మధ్యే ముఖాముఖి పోరు ముదిరింది. ఇరు పార్టీల మధ్య ఓటు వాటా వ్యత్యాసం, గత ఎన్నికల్లో నమోదైన 10 నుంచి ఈసారి 5 శాతానికి తగ్గనుంది. మళ్లీ గెలిస్తే మమత నాలుగోసారి ప్రభుత్వం ఏర్పాటు చేస్తారు. 294 స్థానాలున్న బెంగాల్‌లో మ్యాజిక్ నంబర్ 148. టిఎంసి 46.5 శాతం ఓటు వాటాతో 177- 187 స్థానాలు గెలిచే అవకాశం ఉంది. బిజెపి 41.5% ఓటు వాటాతో 95 -110 స్థానాలు గెలవొచ్చు. కాంగ్రెస్‌కి 2.1 శాతం ఓటు వాటతో 1-3 స్థానాలు, వామపక్షాలు 4.1శాతం ఓట్లతో 0-1, బిజిపిఎం పార్టీ 0.7శాతం ఓట్లతో 1- 2 స్థానాలు గెలుపొందే అవకాశాలు ఉన్నాయి. మరిన్ని కనుగొనండి ఆన్‌లైన్ వార్తాపత్రిక ఎడిటోరియల్స్ టెక్ ట్రెండ్స్  నిధుల్లో వివక్ష, గవర్నర్ ద్వారా దొడ్డిదారి రాజకీయాలు, పునర్విభజనతో దక్షిణాది ప్రాతినిధ్యం తగ్గించే యత్నం... ఇట్లాంటి పలు విషయాల్ని తెరమీదకు తెచ్చి ఎన్నికల పోరుని ఢిల్లీ పెత్తనం వర్సెస్ తమిళ గౌరవంగా స్టాలిన్ మలిచారు. 234 స్థానాలున్న తమిళనాడులో మ్యాజిక్ నంబర్ 118. డిఎంకె నేతృత్వపు కూటమి 38.4 శాతం ఓటు వాటాతో 125 -145 స్థానాలు గెలిచే అవకాశముంది. ఎఐఎడిఎంకె కూటమి 31.5 శాతం ఓటు వాటాతో 65- 80 సీట్లు గెలిచే ఆస్కారముంది. ఓట్లను గణనీయంగా చీల్చే అవకాశమున్న టివికె తనకు తానుగా 21.8 శాతం ఓటు వాటాతో 18 -24 స్థానాలు గెలుచుకోవచ్చు. మరిన్ని కనుగొనండి వార్తల విశ్లేషణ లైవ్ అప్‌డేట్స్ డిజిటల్ వార్తాపత్రిక ాశ్రీంశీ =ముఃం - ఇంధన సంక్షోభం.. ఏదీ ప్రత్యామ్నాయం? అసోంలో మళ్లీ బిజెపి జెండా! కూటమి భాగస్వాములతో నిమిత్తం లేకుండా బిజెపి సొంతంగానే అసోంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయదగ్గ స్థాయిలో మెరుగుపడింది. ఈసారి గెలిస్తే బిజెపి వరుసగా మూడోసారి అధికారం కైవసం చేసుకున్నట్టవుతుంది. వరుస మూడు ఎన్నికల్లో కమ్యూనిస్టులకు ఆధిపత్యమున్న రిజర్వుడు స్థానాల్లో వెనుకంజ, పట్టణ ప్రాంతాల్లో కొన్ని ఇతర పాకెట్లలో బిజెపి విస్తరణ, రెండు పర్యాయాల ఓటమి తర్వాత కాంగ్రెస్ పుంజుకోవడం వంటివి ఎల్‌డిఎఫ్ అవకాశాలను బాగా దెబ్బతీస్తున్నాయి. రాష్ట్రంలోని ఉపకులాలలో వచ్చిన చీలికలు కూడా కమ్యూనిస్టుల్ని కొన్ని జిల్లాల్లో బలహీనపరిచాయి. అదే సమయంలో ఇవే అంశాలు కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్‌కు అనుకూలించడం కారణంగా ఆ కూటమి గెలుపొందే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కూటముల మధ్య ఓటు వాటాల వ్యత్యాసం స్వల్పంగానే ఉన్నప్పటికీ సీట్ల విషయంలో తేడా విస్పష్టంగానే ఉండే సూచనలున్నాయి. 140 అసెంబ్లీ స్థానాలున్న కేరళలో అధికారానికి రావటానికి అవసమయ్యే మ్యాజిక్ నంబర్ 71. విపక్ష యుడిఎఫ్‌కు 75 -85 స్థానాలు లభించే అవకాశముంది. పాలక ఎల్‌డిఎఫ్ 55- 65 స్థానాలకు పరిమితం కావచ్చు. బిజెపి రెండు, మూడు స్థానాలు రావొచ్చు. సిఎం లీడింగ్ కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో పలు ప్రతికూలతల మధ్య కూడా ఎన్‌డిఎ భాగస్వామ్యమే ఆధిక్యతలో ఉంది. కాంగ్రెస్ నుంచి విడిపోయి, ఎన్.ఆర్ కాంగ్రెస్ నెలకొల్పి, దాన్ని కిందటి ఎన్నికల్లో అతి పెద్ద పార్టీగా గెలిపించి, బిజెపి మద్దతుతో ఎన్.ఆర్. రంగస్వామి ముఖ్యమంత్రి అయ్యారు. ఈ ఎన్నికల్లోనూ ఎన్‌డిఎ కూటమి గెలుపు ద్వారా ఆయనే తిరిగి ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలున్నాయి. తమిళనాడు పక్కలో, భౌగోళికంగా మూడుముక్కలై ఉన్న ఈ కేంద్రపాలిత ప్రాంతంలో తమిళ రాజకీయాల ప్రభావం ఎక్కువ. సినీతార విజయ్ (టివికె) ప్రభావం వల్ల ఓట్లలో చీలిక ముఖ్యాంశం కానుంది. డిఎంకె - కాంగ్రెస్‌ల ఎస్‌పిఎ కూటమి ఈసారి తన పరిస్థితిని మెరుగుపరచుకోనుంది. అయినా, పాలక ఎన్‌డిఎ కూటమి సుమారు 4 శాతం ఓట్ల వాటా వ్యత్యాసంతో తన ఆధిక్యతను కొనసాగించే సూచనలున్నాయి. హంగూ, ఆర్భాటం లేకుండా సామాన్యుడిలా జనంలో కలిసిపోయే రంగస్వామికి మంచి పేరే ఉంది. లెఫ్టినెంట్ గవర్నర్‌తో సిఎంకు విభేదాలతో విసిగిపోయి ఉన్నారు. రాష్ట్ర హోదాపై ఆశలున్నాయి. 30 స్థానాలున్నా పుదుచ్చేరి అసెంబ్లీలో అధికారానికి అవసరమైన మ్యాజిక్ నంబర్ 16. మూడు నామినేటెడ్ ఎంఎల్ఎ పదవులున్నాయి. ఎన్ఆర్ కాంగ్రెస్ 10-12 స్థానాలతో అతిపెద్ద పార్టీగాను, బిజెపి గెలిచే 5- 6 తో కలిపి ఎన్‌డిఎ 16- 19 స్థానాలతో విజయకూటమిగా అవతరించే అవకాశాలున్నాయి. విపక్ష ఎస్‌పిఎకు 10-12 స్థానాలు గెలవొచ్చు. ఒకటి, రెండు స్థానాలు ఇతరులకు దక్కొచ్చు.

## కార్మిక చట్టాలను కాలరాస్తున్న బిజెపి

### కార్మికుల పట్ల కనీస సానుభూతి లేని మోడీ

### హక్కులపై దాడి చేస్తున్నకేంద్ర ప్రభుత్వం

### సిపిఐ జనగామ జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి

జనగామ,ఏప్రిల్30 : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ వర్గాల ప్రయోజనాలే మిన్నగా భావిస్తున్నదని సిపిఐ జనగామ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ రాజిరెడ్డి అన్నారు. కార్మికుల పట్ల బిజెపికి కనీస సానుభూతి కూడా లేకుండా పోయిందన్నారు. మేడే సందర్భంగా ఆయన కార్మికులకు అభినందనలు తెలిపారు.  కోట్లాది మంది కార్మికుల వేతనాలపై, ఉపాధిపై, హక్కులపై దాడి చేస్తున్నది. లేబర్‌కోడ్ల ద్వారా జాతీయ కనీస వేతనం పేరిట రోజుకు రూ.178 కన్నా తక్కువ వేతనాలు ఇవ్వకూడదంటున్నది. ఇంతకంటే ఎక్కువ వేతనాలను ఏ యాజమాన్యం ఆచరణలో చెల్లించదు. 300 లోపు కార్మికులు పని చేసే సంస్థలను యాజమాన్యాల దయాదాక్షిణ్యాలకు వదిలేసింది. ఈ 300 కార్మికుల సంఖ్యను తమ ఇష్టానుసారం పెంచుకునే హక్కును రాష్ట్రాలకు కట్టబెట్టింది. రాష్ట్రాల్లో ఉన్న వివిధ సంక్షేమ బోర్డులను నిర్వీర్యం చేసి గుత్తాధిపత్యాన్ని కేంద్రం తన గుప్పెట్లోకి తీసుకున్నదని ఆరోపించారు.  ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లారుమెంట్ పేరుతో రెగ్యులర్ ఉద్యోగాలకు తిలోదకాలిచ్చే విధానాలను అమలు చేస్తున్నది. ఈ పేరిట అతి తక్కువ వేతనాలతో కార్మికులను దోపిడీ చేయడానికి కార్పొరేట్ యాజమాన్యాలకు బిజెపి ప్రభుత్వం మార్గం సుగమం చేస్తున్నదని మండిపడ్డారు వీటికి వ్యతిరేకంగా రాబోయే కాలంలో ఐక్య పోరాటాలు పెంచాల్సి ఉందన్నారు.  సంఘటిత రంగ కార్మికులు సంక్షేమ పథకాలు, సమగ్ర చట్టం చేయాలని,ప్రభుత్వ పథకాల్లోని అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్రశిక్ష, వెలుగు, ఉపాధి హామీ, 108, 104, ఆయుష్, తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వంటి వివిధ పథకాల్లోని వారిని ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ చేశారు.

## నష్టాలతో ప్రారంభమైన మార్కెట్లు

### రూపాయి విలువ 95.07కు చేరిక


న్యూఢిల్లీ,ఏప్రిల్30 : దేశీయ మార్కెట్లు గురువారం భారీ నష్టాల్లో ప్రారంభమయ్యాయి. ఇరాన్ ఓడరేవులపై అమెరికా దిగ్బంధనం కొసాగుతుండటంతో చమురు ధరలు భగ్గమంటున్నాయి. దాంతో మన సూచీలపై బేర్ పట్టు బిగించింది. దాంతో  ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 1000 పాయింట్ల వరకు నష్టపోయింది. ఉదయం సెన్సెక్స్ 868 పాయింట్లు పతనమై, 76,623 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 278 పాయింట్లు క్షీణించి, 23,899 వద్ద కదలాడుతోంది. నిఫ్టీ సూచీలో బజాజ్ ÷నాన్స్, బజాజ్ ఫిన‌సర్వ్, కోల్ ఇండియా, ఓఎన్‌జీసీ షేర్లు లాభాల్లో ఉండగా.. ఎటర్నల్, శ్రీరామ్ ఫైనాన్స్, అల్టా టెక్ సిమెంట్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ఎంఅండ్ఎం షేర్లు నష్టాల్లో ఉన్నాయి. అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి విలువ అంతకంతకూ క్షీణిస్తోంది. ఉదయం సెషన్‌లో తొలిసారి ఏకంగా 95.07 వద్ద ప్రారంభమై.. సరికొత్త జీవనకాల కనిష్ఠాన్ని తాకింది.

## మే2న నీటి సరఫరాలో అంతరాయం

హైదరాబాద్,ఏప్రిల్30 :  నగరంలోని పలు ప్రాంతాలకు మే 2వ తేదీన 24గంటల పాటు తాగునీటి సరఫరాలో అంతరాయం తలెత్తుతుందని వాటర్‌బోర్డు అధికారులు ప్రకటించారు. ఆసిఫ్‌నగర్ ఫిల్టర్ బెడ్స్‌లో ఉన్న 1.36ఎంఎల్ సామర్థ్యం గల పాత బ్యాలెన్సింగ్ ట్యాంక్ శుభ్రపరిచే పనులను మే 2న ఉదయం 6గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు చేపట్టనున్నారు.

## ప్రపంచం.. పంచ సూక్తాత్మకం

'సూక్తం' అంటే మంచిమాట. 'బాగా చెప్పింది' అనే అర్థం కూడా ఉంది. సమగ్రంగా నిరూపణ చేయడాన్ని కూడా 'సూక్తం' అని అంటారు. ఈ అర్థాలన్నిటినీ సమన్వయం చేస్తే.. మనిషికి సమున్నతమైన మార్గదర్శనం చేసే బోధన 'సూక్తం' అని చెప్పొచ్చు. ప్రకృతి పరిణామ కమం, దానిపై మనిషికి ఉండాల్సిన అవగాహన, చేయాల్సిన పనులు, చేయకూడని చర్యలు, సాధించాల్సిన అద్వైతభావన మొదలైన విషయాలన్నిటినీ వేదాల్లోని సూక్తాలు వివరిస్తాయి. భక్తుడి మనసు ఎప్పుడూ నిశ్చలంగా ఉండటానికి, పరమాత్మ మీద లగ్నం కావడానికి భారతీయ రుషులు ప్రతిపాదించిన ప్రాథమిక సూచన వేద సూక్త పఠనం. నిజానికి ఇవి వేదాల్లో ఒకే చోట, ఒకే మంత్రభాగంగా ఉండవు. విభిన్న భాగాల నుంచి గ్రహించిన మంత్రాలతో సూక్తం తయారవుతుంది. వేదంలో చెప్పిన కొన్ని పరమ ప్రామాణికమైన అంశాలు, మనిషికి అత్యవసరంగా అందాల్సిన సందేశాన్ని గుర్తించి మహర్షులు చేసిన క్రోడీకరణే సూక్తాలు. నాలుగు వేదాల్లో వందలాదిగా ఉన్న సూక్తాల్లో పురుషసూక్తం, శ్రీసూక్తం, నారాయణసూక్తం, భూ, నీలాసూక్తం%8%% పంచసూక్తాలుగా ప్రసిద్ధిపొందాయి. పురుష సూక్తం.. 'పురుష' అనే పదానికి భగవంతుడు అని అర్థం చేసుకోవాలి. విశ్వానికి మూలశక్తి అయిన విరాట్పురుషుడి స్వరూప, స్వభావ వర్ణన, విశ్లేషణ ఈ సూక్తంలో ప్రధానంగా ఉంటాయి. సాధారణభావనలో మనం ఊహించుకునే విష్ణుమూర్తి, పురుషసూక్తం ప్రకటించే నారాయణుడు ఇద్దరూ వేర్వేరు. ఈయన త్రిమూర్తుల్లో ఒకరైన విష్ణువు కన్నా పూర్వమే ఉన్నాడు. విశ్వం ఆవిర్భావానికి మూలకారణశక్తి ఇతనే.



ఆధ్యాత్మికం

# అవగాహన లేని మాటలు ఆధారాలు లేని ఆరోపణలు

● బీఆర్ఎస్ నేతల తప్పుడు ఆరోపణలను తిప్పి కొట్టిన కాంగ్రెస్ నేతలు



**ధర్మపురి, ఎప్రిల్ 30, (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురికి చెందిన బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం పై చేసిన ఆరోపణలపై తీవ్రంగా మండిపడ్డారు. బుధవారం బీఆర్ఎస్ నాయకులు మీడియా సమావేశంలో అవగాహన లేని మాటలు మాట్లాడారని, ఆధారాల్లేని ఆరోపణలు చేశారని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. గురువారం ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, ధర్మపురి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వేముల రాజు తో పాటు మాజీ పీఏసీఎస్ చైర్మన్ నరేష్ తో పాటు పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ మాట్లాడుతూ గడిచిన రెండున్నరేళ్ల ప్రజా ప్రభుత్వంలో ధర్మపురి పట్టణ సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కృషి చేస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగా ధర్మపురి పట్టణ ప్రజలకు తాగు నీటిని అందించడంతో పాటు ప్రముఖ పుణ్యక్షేత్రం గా ఉన్న ధర్మపురిని టెంపుల్ సిటీగా మార్చి ధర్మపురి క్షేత్ర విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పే ఒక మహత్తరమైన యజ్ఞానికి మంత్రి అడ్లూరి శ్రీకారం చుట్టారని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఆలయ అభివృద్ధి పై చేసిన ఆరోపణలను వారు తిప్పి కొట్టారు. ఆలయ విస్తరణ కోసం భూసేకరణ ప్రక్రియ చేపట్టగా కొందరు కోర్టును ఆశ్రయించారని అన్నారు. కోర్టు వివాదాన్ని పరిష్కరించి భూ నిర్వాసితులను ఒప్పించి ఆలయ అభివృద్ధికి ముందుకు సాగుతున్నామని దినేష్ వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఇప్పటివరకు ఎవరిని బెదిరించలేదని ఈ సందర్భంగా వివరించారు. ఆలయ అభివృద్ధి విషయంలో గత ప్రభుత్వ కాలంలో భూమిని సేకరిస్తున్న లబ్ధిదారులకు తెలవకుండానే వ్యవసాయ భూములతో పాటు ఇంటి స్థలాలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బ్లాక్ చేసి ఉంచారని దినేష్ ఈ సందర్భంగా వారికి గుర్తు చేశారు. ప్రస్తుతం ఆలయ అభివృద్ధి కొరకు సేకరిస్తున్న భూ యజమానులతో మంత్రి అడ్లూరి ఇప్పటికే పలుమార్లు చర్చలు జరిపారని ఎలాంటి బలవంతం లేకుండా శాంతి యుతంగా, చట్టపరంగా భూ సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తుందని దినేష్ వివరించారు. గతంలో ప్రజా ప్రతినిధిగా పనిచేసిన బీఆర్ఎస్ నాయకులు అధికారం కోల్పోవడంతో అసహనంతో అర్థంలేని ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల రాజేష్ అన్నారు. శనివారం సంతకు సంబంధించి గతంలో మూడున్నర లక్షలకు వేలం పాడిన ఒక వ్యక్తి మార్చి 31 తో గడువు ముగిసినప్పటికీ మరో రెండున్నర లక్షల రూపాయలు ధర్మపురి మున్సిపాలిటీకి బాకీ ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. మున్సిపల్ కు బాకీ ఉన్న వ్యక్తులను పక్కన పెట్టుకొని తప్పుడు ఆరోపణ చేస్తున్నారని రాజు ఈ సందర్భంగా వారిని విమర్శించారు. ఒక ప్రజా ప్రతినిధిగా పనిచేసిన వ్యక్తి సోషల్ మీడియాలో వచ్చిందట, వారు అంటున్నారు, వీరు అంటున్నారు అంటూ ఆధారాల్లేని ఆరోపణలు చేస్తున్నారని రాజు అన్నారు. వాస్తవాలు తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందని హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పిన నాయకుల తీరులో మార్పు రావడంలేదని రాజు విమర్శించారు. అనంతరం సింగల్ విండో మాజీ చైర్మన్ నరేష్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ భూములను పట్టాలు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసిన చరిత్ర బీఆర్ ఎస్ నాయకులదని అన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో దాన్యం కొనుగోలు లో అక్రమాలు జరుగుతున్నాయని శ్రీకాంత్ రెడ్డి ఆరోపించడం విడ్డూరంగా ఉందని అన్నారు. ధాన్యం కొనుగోలు లో అక్రమాలు జరిగాయని రైతులు ఎవరైనా ఫిర్యాదు చేశారా అని ప్రశ్నించారు. శ్రీకాంత్ రెడ్డి డిసిసి అధ్యక్షులుగా ఉన్న సమయంలో తన సొంత గ్రామం రైతులు ధాన్యాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు పోసి నిరసన వ్యక్తం చేశారని గుర్తు చేశారు. ధాన్యం కొనుగోలులో అక్రమాలు జరిగినట్లు నిరూపిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని నరేష్ అన్నారు. లేకుంటే శ్రీకాంత్ రెడ్డి రాజకీయ సన్యాసం తీసుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీకాంత్ రెడ్డి అధికారాన్ని అడ్డం పెట్టుకొని అనేక అక్రమాలకు పాల్పడ్డారని నరేష్ ఆరోపించారు. ఇప్పటి కైనా బిఅరెస్ నాయకులు ప్రజల మన్నన లు పొందే విధంగా ప్రెస్ మీట్లో మాట్లాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పది ఫలితాల్లో పారడైజ్ పాఠశాల ప్రభంజనం రాష్ట్ర స్థాయిలో విద్యార్థుల ప్రతిభ







**కరీంనగర్ టౌన్,ఏప్రిల్ 30(ది క్రైమ్ న్యూస్):** విడుదలైన పదో తరగతి ఫలితాల్లో రేకుర్తిలోని పారడైజ్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి మార్కులతో అద్భుత విజయాన్ని సాధించినట్లు పాఠశాల చైర్మన్ డాక్టర్ పి. ఫాతిమా రెడ్డి తెలిపారు.టాప్ స్కోరర్లు పాఠశాలకు చెందిన వి. సాయిప్రేమ్ 591 మార్కులతో అగ్రస్థానంలో నిలవగా, షిఫా తమన్నా 586, వి. అశ్విని 584, బి. సాహితీ 584, బి. సుధీష్ణ 579, బి. లక్ష్మీ ప్రసన్న 578, ఎన్. స్ఫూర్తి రెడ్డి 574, బి. నక్షత్ర 574, సానియా 573, బి. జిషిత 570, ఎస్. శ్రీదేవి 570 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. విద్యార్థుల విజయాన్ని పురస్కరించుకుని పాఠశాల ఆవరణలో ప్రత్యేక అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలను డాక్టర్ ఫాతిమా రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల కష్టం, ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ టి. వసంత, వైస్ ప్రిన్సిపాల్ ఎ.మధు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొని సంబరాలు చేసుకున్నారు.

# ఐదు రాష్ట్రాలలో బీజేపీకి అనుకూల ఫలితాలు

● మే 10న మోదీ సభ ద్వారా తెలంగాణకు దిశా నిర్దేశం ● రాజ్యసభ సభ్యుడు, బీజేపీ పార్లమెంటరీ కమిటీ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్



**కరీంనగర్ టౌన్, ఏప్రిల్30(ది క్రైమ్ న్యూస్):** ఐదు రాష్ట్రాల ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ ఎలా ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో బీజేపీ కి ఉన్న రిపోర్టు , అంచనాలకు అనుగుణంగా గణనీయ విజయాలు సాధిస్తుందని, అంచనాలకు మించిన ఫలితాలు వస్తాయని రాజ్యసభ సభ్యుడు, బీజేపీ పార్లమెంటరీ కమిటీ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు.గురువారం కరీంనగర్లోని గణేష్ నగర్ బైపాస్ రోడ్డులో గల అదితి హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడారు. తెలంగాణ రాజకీయాల్లో కొత్త మార్పులకు నాంది పలికేలా ఈ నెల 10న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రానికి వస్తున్నారని,. ప్రధానిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా తెలంగాణ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఈనెల భారీ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. చారిత్రక మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్న కాంగ్రెస్, ఇండియా కూటమి నిజస్వరూపాన్ని బట్టబయలు చేసేలా ఈనెల 10న, “జనాగ్రహ సభ”ను నిర్వహించడానికి బిజెపి తెలంగాణ పార్టీ సన్నాహాలు చేస్తుందని, ప్రధాని మోదీ హాజరయ్యే ఈ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాది మంది హాజరవుతారని, ఇది తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు తిప్పే సభగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఓ ఫెయిల్యూర్ గవర్నమెంట్ అని ఆయన ఘాటుగా విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్రాన్ని ఏ లా నడపాలో అర్థం కాని స్థితిలో పాలన కొనసాగిస్తుందన్నారు. ఇక బిఆర్ఎస్ పార్టీకి ప్రజలు విఆర్ఎస్ ఇచ్చారని, ఆ పార్టీ అవుట్ డేటెడ్ పార్టీ అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రప్రదమంగా కరీంనగర్‌లో తొలి మేయర్‌గా బీజేపీ అభ్యర్థి గెలవడం ప్రజల్లో మార్పు సంకేతమని ఆయన అన్నారు.

## రెండు పూటలా ఫోటో విధానం రద్దు చేయాలి

**- కందుకూరి కోటేష్ డిమాండ్..**



**నల్గొండ (ది క్రైమ్ న్యూస్):** ఉపాధి హామీ పనుల్లో హాజరు నమోదు కోసం కూలీలకు రెండు పూటలా ఫోటోలు తీసే విధానాన్ని వెంటనే రద్దు చేసి, పాత మాస్టర్ రోల్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి కోటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని సురేపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులను సందర్శించిన ఆయన, కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిపిజి రాంజీ బిల్లును ఉపసంహరించుకుని పాత విధానంలోనే పనులు కొనసాగించాలని కోరారు. రెండు పూటలా ఫోటో విధానం వల్ల ఫోటో మ్యాచ్ కాకపోవడంతో కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం 100% నిధులు కేటాయించి, సంవత్సరానికి 200 రోజుల పని కల్పించి, కనీస వేతనం ?800 అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం వ్యవసాయంలో పనులు తగ్గిపోవడంతో కూలీలకు ఉపాధి దొరకడం కష్టమైందని, ఈ పరిస్థితిలో ఉపాధి హామీ పథకం జీవనోపాధికి ఎంతో ఉపయుక్తమని పేర్కొన్నారు. అలాగే వ్యవసాయ కార్మికులు, భూమిలేని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ?12,000 హామీని అమలు చేయాలని, గ్రామాల్లో పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలను వెంటనే పంపిణీ చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కొండేటి సైదయ్య, తోట సీనయ్య, గోపయ్య, ఆవుల రామకృష్ణ, గురువయ్య, రాంబాబు, చంద్రకళ, అచ్చమ్మ, సరిత, లక్ష్మమ్మ, మంగమ్మ, బంగారి తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్ల నిర్మాణ సమస్యలపై జాప్యాన్ని ఉపేక్షించం: రాష్ట్ర మంత్రి పొంగులేటి



**మానకొండూర్, ఎప్రిల్30(ది క్రైం న్యూస్):** హైదరాబాద్ హిమయత్ నగర్ లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి సమీక్ష సమావేశంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ..... ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ఇండ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయించాలన్నారు. గత ప్రభుత్వ పథకాలతోపాటు నేటి హామీలను కూడా ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తుందని స్పష్టం చేస్తూ ఇకపై సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని ఉపేక్షించేది లేదని ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జీ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఉమ్మడి జిల్లా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, గడ్డం వివేక్, అడ్లూరి, ఆది శ్రీనివాస్,ఎమ్మెల్యే కవ్వంపల్లి, డాక్టర్ సంజయ్ కుమార్,రాజ్ ఠాకూర్, కౌశిక్ రెడ్డితోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ఆయా జిల్లాల కలెక్టర్లు తదితరులు మంత్రి పొంగులేటితో సమావేశంలో పాల్గొన్నారు.


## పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు అభినందనలు

**- కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డా, కోటా రాంబాబు**



**మధిర, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పదోతరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపిన జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రముఖ వైద్యులు డాక్టర్ కోటా రాంబాబు, ఈ సందర్భంగా గురువారం పత్రిక ప్రకటనగా మాట్లాడుతూ మీ కఠిన శ్రమ, పట్టుదల క్రమశిక్షణతో సాధించిన ఈ అద్భుతమైన విజయం మీకు, మీ తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు ఎంతో గర్వకారణం. ఈ విజయం మీ ఉన్నత చదువులకు, మంచి భవిష్యత్తుకు బలమైన పునాది కావాలని ఆశిస్తున్నాము. మీరు పడ్డ కష్టానికి తగిన ప్రతిఫలం దక్కింది, ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని తెలియజేశారు.

## 10 వ తరగతిలో మంచిర్యాల నారాయణ విద్యార్థుల ప్రభంజనం




**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** బుధవారం రోజు వెలువడిన తెలంగాణ పదవ తరగతి ఫలితాల్లో మంచిర్యాల నారాయణ హైస్కూల్ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనబరిచారు. నారాయణ పాఠశాలకు చెందిన విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా, 32మంది విద్యార్థులలో 25 మందికి పైగా 500 మార్కులకంటే ఎక్కువ మార్కులు తెచ్చుకొని రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి ర్యాంకులను సాధించి మంచిర్యాల నారాయణ పాఠశాల కీర్తిని దశదిశలా చాటారు. ఈ సందర్భంగా పాఠశాల డీజీఎం వెంకటరమణ రెడ్డి , ఏజీఎం చైతన్య రావు మాట్లాడుతూ, విద్యార్థులు సాధించిన ఈ అద్భుత ఫలితాలు, వారు చూపిన పట్టుదల, క్రమశిక్షణకు అధ్యాపకుల నిరంతర కృషితో కూడిన బోధనకు నిదర్శనం అని అన్నారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని చదివిన విద్యార్థులకు, ప్రోత్సహించిన తల్లిదండ్రులకు మా అభినందనలు అని తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం ప్రత్యేక అభినందనలు తెలియజేసారు. భవిష్యత్తులో విద్యార్థులు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం చైతన్య రావు తో పాటుగా, ఆర్ ఐ సత్యం రావు, హై స్కూల్ కోఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్, ప్రిన్సిపల్ స్రవంతి, అకాడమిక్ డీన్ వెంకటస్వామి, ఏజీఎం అనాలసిస్ రాజేందర్, ఏవో కిషన్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఆంజనేయస్వామి పూజా విధానం' పుస్తకావిష్కరణ





**సుల్తానాబాద్, ఏప్రిల్ 30 (ది క్రైమ్ న్యూస్):** హనుమాన్ దీక్షా పరుల కోసం రూపొందించిన 'ఆంజనేయస్వామి పూజా విధానం' పుస్తకావిష్కరణ కార్యక్రమం సుల్తానాబాద్ మండలంలోని కనుకుల ఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం ఘనంగా జరిగింది. సుద్దాల ఒకటవ వార్డు సభ్యులు ముత్యాల శ్రీనివాస్ తన సొంత ఖర్చులతో 1000 పుస్తకాలను ముద్రించి స్వాములకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముత్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. తన తల్లి కీర్తిశేషులు ముత్యాల అంజలీదేవి మరణానంతరం, తనను అక్కున చేర్చుకున్న పిన్ని తూముల జయలక్ష్మి జ్ఞాపకార్థం ఈ పుస్తకాలను ముద్రించి వారికి అంకితం చేసినట్లు తెలిపారు. భక్తులకు పూజా క్రమం సులభంగా అర్థమయ్యేలా ఈ పుస్తకంలో విషయాలను క్లుప్తంగా పొందుపరిచామని, ఇప్పటివరకు మూడు విడతలుగా పుస్తకాలను ముద్రించామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఓజ్జ సంపత్ యాదవ్, ఉప సర్పంచ్ గుజ్జ వెంకన్న, ఆలయ పూజారులు చంద్రశేఖర్ శర్మ, కాందూరి వాసు పాల్గొన్నారు. అలాగే గురుస్వాములు బాలసాని సదయ్య, వివరం నేని తిరుపతిరావు, బొంకూరి సదయ్య, ధూడం శ్రీనివాస్, ఓజ్జా సతీష్ యాదవ్, గుజ్జ విజయ రావు పెద్ద సంఖ్యలో హనుమాన్ మాలధారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్రిన్సిపాల్ పద్మశ్రీ ఘన సన్మానం




**మానకొండూర్, ఎప్రిల్30(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం పోచంపల్లిలోని ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరచిన విద్యార్థులకు గురువారం సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 550 పైగా మార్కులు సాధించి టాపర్లుగా నిలిచిన 8మంది విద్యార్థినిలను పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ పద్మశ్రీతో పాటు అధ్యాపక బృందం శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# హాలియా మున్సిపాలిటీలో ఆయు ఫైనాన్స్‌పై వినియోగదారుల ఆగ్రహం

## ● వేధింపులు, బెదిరింపులపై తీవ్ర ఆరోపణలు..




**నల్గొండ ప్రతినిధి, ఏప్రిల్ 30 (ది క్రైమ్ న్యూస్):** నల్లగొండ జిల్లా హాలియా మున్సిపాలిటీ పరిధిలోని తారకరామా కాంప్లెక్స్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆయు ఫైనాన్స్ సంస్థపై వినియోగదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంస్థ మేనేజర్ ఆంజనేయులు మరియు ఎగ్జిక్యూటివ్ సిబ్బంది కస్టమర్లను మానసికంగా వేధిస్తూ, అవమానకరంగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వినియోగదారుల వివరాల ప్రకారం, మేనేజర్ ఆంజనేయులు మాట్లాడే తీరు మర్యాద రహితంగా ఉండి, కస్టమర్లను గౌరవించకుండా అహంకారంగా స్పందిస్తున్నారని తెలిపారు. సమస్యలు చెప్పడానికి వెళ్లిన వారిని "మీకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు" అంటూ తిరస్కరించడం, అసభ్య పదజాలంతో దూషించడం జరుగుతుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. "మేము మనుషులమనే విషయం కూడా మరిచిపోయి మాట్లాడుతున్నారు" అని వారు అంటున్నారు. ఇక ఎగ్జిక్యూటివ్ సిబ్బంది, ముఖ్యంగా దిలీప్, నిరంతరం ఫోన్ కాల్స్ చేస్తూ చెల్లింపుల కోసం ఒత్తిడి తీసుకువస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. చెల్లింపులు చేసిన తర్వాత కూడా ఇంటికి వెళ్లి వేధించడం, రిసీట్లు ఇవ్వడంలో ఇబ్బందులు సృష్టించడం వంటి చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇ.ఎం.ఐ చెల్లింపులు ఆలస్యమైన సందర్భాల్లో అధిక లేట్ ఫీజులు, చెక్ బౌన్స్ చార్జీలు విధించడమే కాకుండా, గుంపులుగా ఇంటి ముందుకు వెళ్లి "పేమెంట్ చేస్తారా లేక చస్తారా" వంటి బెదిరింపులకు దిగుతున్నారని బాధితులు తెలిపారు. ఈ విధమైన ప్రవర్తన కుటుంబ సభ్యుల్లో భయాందోళనలు కలిగిస్తోందని వారు పేర్కొన్నారు. ఈ విషయంపై సమాచారం సేకరించేందుకు వెళ్లిన రిపోర్టర్‌ను కూడా మేనేజర్ ఆంజనేయులు అవమానకరంగా మాట్లాడినట్లు తెలిసింది. "నువ్వు నా కస్టమర్ కాదు, బయటికి వెళ్లి మాట్లాడు" అంటూ దురుసుగా స్పందించి, అసభ్య పదజాలంతో దూషించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. గౌరవంగా సంబోధించినప్పటికీ స్పందనలో అహంకారం స్పష్టంగా కనిపించిందని వారు అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం ఫైనాన్స్ సంస్థలు వినియోగ దారులను వేధించకూడదని స్పష్టంగా పేర్కొన్నప్పటికీ, ఆయు ఫైనాన్స్ సంస్థ వాటిని పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వినియోగదారుల గౌరవం, ప్రాథమిక హక్కులను పక్కనబెట్టి మానసిక ఒత్తిడి తీసుకువస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి మనిషికి గౌరవంతో జీవించే హక్కు ఉందని, ఆర్థిక లావాదేవీల పేరుతో అవమానించడం, బెదిరించడం వంటి చర్యలు అంగీకారయోగ్యం కాదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనలపై సంబంధిత అధికార యంత్రాంగం వెంటనే స్పందించి, విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టడి చేయాలని, వినియోగదారుల హక్కులను రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

## జాఫర్ ఖాన్ పేటలో ఘనంగా చిరుతల రామాయణం పట్టాభిషేకం





**సుల్తానాబాద్, ఏప్రిల్ 30(సుల్తానాబాద్):** పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం జాఫర్ ఖాన్ పేట గ్రామంలో నిర్వహించిన చిరుతల రామాయణం పట్టాభిషేక మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకులు, ఏగోలపు కుమార్ గౌడ్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు ఏగోలపు సదయ్య గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిరుతల రామాయణంలో అద్భుత ప్రదర్శన ఇచ్చిన పాత్రధారులను సదయ్య గౌడ్ ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని భక్తులకు స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తి మార్గంలో నడవడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని, పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలందరూ సీతారాముల ఆశీస్సులతో ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామా సర్పంచ్ యాదగిరి జోష్నా శ్రీనివాస్, ఉప సర్పంచ్ శ్రావణి శ్రావణ్ కుమార్, చిరుతల రామాయణ గురువు కట్టెకొల అశోక్ కుమార్, మాజీ సర్పంచ్ దొమ్మటి శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ బొజ్జం శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే బీజేపీ నాయకులు ఓరుపుల శ్రీనివాస్, చొప్పరీ కుమార్, పురేళ్ళ దిలీప్, తిప్పని నరేష్, గడ్డం అనిల్, తోట రవి, సంగ గట్టయ్య, నెట్టేట్ల శ్రీనివాస్ తో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

## 'ఉద్యమ్ రిజిస్ట్రేషన్'పై అవగాహన సదస్సు..



**జమ్మికుంట ఏప్రిల్ 30 (ది క్రైమ్ న్యూస్):** మెప్మా ఆధ్వర్యంలో స్థానిక వినాయక గార్డెన్ గురువారం 'ఉద్యమ్ రిజిస్ట్రేషన్' ప్రక్రియపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ ఆధ్వర్యంలో, టీఎల్ఎఫ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కరీంనగర్ పిడి స్వరూప రాణి, మున్సిపల్ చైర్ పర్సన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ప్రభుత్వం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ నిబంధనల ప్రకారం, వ్యాపార సంస్థల పెట్టుబడి, వార్షిక టర్నోవర్‌ను ప్రాతిపదికగా తీసుకుని వాటిని వర్గీకరిస్తూ, వ్యాపార లావాదేవీలను సులభతరం చేసేందుకు, ప్రభుత్వ పథకాలు పొందడానికి ప్రతి యంఎస్ఎంఈ ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ద్వారా శాశ్వత గుర్తింపు పొందాలని వారు సూచించారు. ఈ రిజిస్ట్రేషన్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి, చిరు వ్యాపారులు దీనిని వినియోగించుకోవాలని కోరారు. వ్యాపార రంగంలో పారదర్శకత, ప్రభుత్వ చేయూత అందాలంటే ప్రతి చిన్న, మధ్య తరహా పరిశ్రమ తప్పనిసరిగా ఉద్యమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డీఎంసీ శ్రీవాణి, డీపీఎం సతీష్, ఇంచార్జి టి.ఏం.సి. మల్లీశ్వరి, సీఎల్ఆర్పీలు మంజుల, జ్యోతి, ఆర్పీలు, ఓబీలు పలువురు పాల్గొన్నారు.

## విషాదంలో అండగా నిలిచిన చత్రపతి శివాజీ యువసేన

### - మౌనిక కుటుంబానికి ఆర్థిక సహాయం



**మంథని, (ది క్రైమ్ న్యూస్):** కమాన్‌పూర్ మండల కేంద్రంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన జంగపల్లి లక్ష్మి –ఆశాల చిన్న కుమార్తె జంగపల్లి మౌనిక (18) అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో మృతి చెందడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. యువతి అకాల మరణం గ్రామ ప్రజలను కలచివేసింది. మౌనిక వైద్యం కోసం చత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో సేకరించిన విరాళాలు మొత్తం రూ.71,467 కాగా, ఆమె మరణానంతరం దహన సంస్కారాల కోసం రూ.23,000 వినియోగించి, మిగిలిన రూ.48,467ను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ ఆర్థిక సహాయాన్ని గురువారం సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, చత్రపతి శివాజీ యువసేన అధ్యక్షుడు మల్యాల శేఖర్ గౌడ్ సమక్షంలో అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ మానవతా విలువలను ప్రతిష్ఠింపజేస్తున్న చత్రపతి శివాజీ యువసేన సేవలు ప్రశంసనీయం అని కొనియాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, యువసేన సభ్యులు, కుటుంబ సభ్యులు పాల్గొని మౌనిక మృతికి సంతాపం తెలియజేశారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచిన ఈ సహాయక చర్య స్థానికంగా ప్రశంసలు అందుకుంది.

## కాంగ్రెస్ హామీలు నమ్మితే మా బతుకులాగమైనయ్.....! కేసీఆర్ రావాలే, మా బతుకులు మారాలే.....!

### - రసమయితో ఉపాధి కూలీల గోడు



**బెజ్జంకి, ఎప్రిల్30 (ది క్రైం న్యూస్):** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం ఇట్టిరెడ్డిపల్లి శివారులో గురువారం ఉపాధిహామీ కూలీలు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తో తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఇల్లంతకుంట మండలం గాలిపెల్లికి వెళ్తుండగా ఇట్టిరెడ్డిపల్లి వద్ద ఉపాదికులీలను గమనించిన రసమయి వాళ్ళతో మాట్లాడి కూలీల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఉపాది కూలీలు మాట్లాడుతూ.... నమ్మి నానబోస్తే పుచ్చి బుర్రలైనట్లు ఎన్నికల ముందు కాంగ్రెస్ భోగస్ మాటలు నమ్మి మోసపోయి గోసపడుతున్నామని, ఇచ్చిన హామీల్లో ఒక్క పిరీ బస్సు తప్ప ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిందేమి లేదని ఆరోపించారు.గత రెండున్నరేళ్లలో యూరియా బస్తాలు దొరకక, ధాన్యం, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు ఉత్పత్తులు కొనేదిక్కులేక రైతుభరోసా,రైతు రుణమాఫీ రాక ఇబ్బంది పడుతుంటే మరోవైపు కరెంటు కుడా సరిగా రాక పంటలకు సాగునీళ్లు అందడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాము చేసిన తప్పుకు కేసీఆర్ మళ్ళెప్పుడత్తడా మా బతుకులెప్పుడు మారుతయా అని, మళ్ళీ కేసీఆర్ సర్కారే రావాలని వేయి కళ్లతో ఎదురుచూస్తున్నామంటూ ముక్తకంతగా నినదించారు.పదేళ్లు ఎమ్మెల్యేగా ఆపద సమయాల్లో ఎక్కడున్నా తమ ఊరికి వచ్చేవాడివని గుర్తుచేసుకుంటూ ప్రస్తుత ఎమ్మెల్యే ఊరు ముఖం కూడా చూడడంలేదని మండిపడ్డారు. ఈసారి ఎమ్మెల్యేగా తన గెలుపు కోసం తామంతా అండగా ఉంటామని ధీమా వ్యక్తం చేస్తూ మాజీ ఎమ్మెల్యే రసమయిని కూలీలు, రైతులు ఆశీర్వదించారు.

## నృసింహుని నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి అడ్లూరి





**ధర్మపురి, ఏప్రిల్ 30, (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి నవరాత్రుల ముగింపు సందర్భంగా, అలాగే లక్ష్మీ నరసింహ స్వామి జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ పురోహితులు మంత్రికి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## హాలియా మున్సిపాలిటీలో ఘనంగా పదవీ విరమణ అభినందన సభ





**నల్గొండ ప్రతినిధి, ఏప్రిల్ 30 (ది క్రైమ్ న్యూస్):** హాలియా పురపాలక సంఘంలో వార్డ్ ఆఫీసర్ మరియు జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న గాదె వెంకట రామచంద్రరావు గారి పదవీ విరమణ కార్యక్రమం సాగర్ రోడ్డులోని వైభవ్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి గారు మాట్లాడుతూ, రామచంద్రరావు గారు తన సేవలను అంకితభావంతో, నిజాయితీతో, క్రమశిక్షణతో నిర్వహించారని తెలిపారు. ఆయన చేసిన సేవలు మున్సిపాలిటీకి ఆదర్శప్రాయంగా నిలిచాయని, సహోద్యోగులతో స్నేహపూర్వక సంబంధాలు కలిగి ప్రతి పనిని బాధ్యతగా పూర్తి చేయడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. మున్సిపల్ కమిషనర్ ఎ. శ్రీనివాస్ రెడ్డి గారు మాట్లాడుతూ, జీ.వి.ఆర్. రావు గారి సేవలు కేవలం పనికే పరిమితం కాకుండా కొత్తవారికి మార్గదర్శకత్వం ఇవ్వడం వంటి లక్షణాలతో ప్రత్యేకంగా నిలిచారని అన్నారు. ఆయన శేష జీవితం ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ బొంగరాల యేసురాజు, 9వ వార్డు కౌన్సిలర్ చేరుపల్లి ముత్యాలు, 2వ వార్డు కౌన్సిలర్ సలహాదారు నకిరేకంటి సైదులు, 5వ వార్డు కౌన్సిలర్ సలహాదారు చిట్టిపోలు కరుణాసాగర్, 8వ వార్డు కౌన్సిలర్ సలహాదారు మజార్ మొయినుద్దీన్, 12వ వార్డు కౌన్సిలర్ సలహాదారు ఎడవల్లి రంజిత్, కోఆప్షన్ సభ్యురాలు కొమ్మనబోయిన జయమ్మ, అనుముల మండల ఎమ్మార్వో, ఎంపీడీవో, హాలియా మున్సిపల్ సిబ్బంది, కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు పాల్గొన్నారు.

## రెండు పూటలా ఫోటో విధానాన్ని రద్దు చేయాలి



**నల్గొండ ప్రతినిధి, ఏప్రిల్ 30 (ది క్రైమ్ న్యూస్):** ఉపాధి హామీ పనుల్లో హాజరు నమోదు కోసం కూలీలకు రెండు పూటలా ఫోటోలు తీసే విధానాన్ని వెంటనే రద్దు చేసి, పాత మాస్టర్ రోల్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి కోటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని సురేపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులను సందర్శించిన ఆయన, కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిపిజి రాంజీ బిల్లును ఉపసంహరించుకుని పాత విధానంలోనే పనులు కొనసాగించాలని కోరారు. రెండు పూటలా ఫోటో విధానం వల్ల ఫోటో మ్యాచ్ కాకపోవడంతో కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం 100% నిధులు కేటాయించి, సంవత్సరానికి 200 రోజుల పని కల్పించి, కనీస వేతనం ?800 అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం వ్యవసాయంలో పనులు తగ్గిపోవడంతో కూలీలకు ఉపాధి దొరకడం కష్టమైందని, ఈ పరిస్థితిలో ఉపాధి హామీ పథకం జీవనోపాధికి ఎంతో ఉపయుక్తమని పేర్కొన్నారు. అలాగే వ్యవసాయ కార్మికులు, భూమిలేని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ?12,000 హామీని అమలు చేయాలని, గ్రామాల్లో పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలను వెంటనే పంపిణీ చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కొండేటి సైదయ్య, తోట సీనయ్య, గోపయ్య, ఆవుల రామకృష్ణ, గురువయ్య, రాంబాబు, చంద్రకళ, అచ్చమ్మ, సరిత, లక్ష్మమ్మ, మంగమ్మ, బంగారి తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో ఘనంగా పోలీసు అధికారుల పదవీ విరమణ సన్మానం




**కరీంనగర్ టౌన్, ఏప్రిల్30(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలంపాటు విశేష సేవలందించిన ఏడుగురు పోలీసు అధికారుల పదవీ విరమణ సన్మాన కార్యక్రమం గురువారంనాడు కరీంనగర్ కమీషనరేట్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. కరీంనగర్ పోలీసు కమీషనరేటు కరీంనగర్ వన్ టౌన్ పోలీసు స్టేషన్ నుండి ఎస్సై ఏ సత్యనారాయణ, సిఎస్బి నుండి ఎస్సై డి శ్రీనివాస్, ఏ ఆర్ విభాగం నుండి సర్దార్ భగవాన్ సింగ్, మానకొండూరు పోలీసు స్టేషన్ నుండి ఏఎస్సై ఖాజా జమాలుద్దీన్, ఏఆర్ విభాగం నుండి ఏ ఆర్ ఎస్సై పి లక్ష్మయ్య, కొత్తపల్లి పోలీసు స్టేషన్ నుండి ఏఎస్సై హెచ్ వెంకటరమణ, ఏఆర్ అట్టాచ్డ్ హెడ్ కానిస్టేబుల్ రంగస్వామి లు పదవీ విరమణ పొందారు.కరీంనగర్ అడిషనల్ డీసీపీ వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై, పదవీ విరమణ పొందిన అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ, అనేక సవాళ్లతో కూడుకున్న పోలీస్ ఉద్యోగాన్ని విజయవంతంగా, నిబద్ధతతో పూర్తి చేసి పదవీ విరమణ పొందడం ఒక గొప్ప విజయమని కొనియాడారు. అధికారులు అందించిన సేవలకు వారి కుటుంబ సభ్యుల సహకారం ఎంతో కీలకమని, ఆ సహకారం వల్లే వారు సమర్థవంతంగా పనిచేయగలిగారని గుర్తు చేశారు. పదవీ విరమణ తర్వాత అధికారులు తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.అడిషనల్ డీసీపీ స్వయంగా పదవీ విరమణ పొందిన ఏడుగురికి పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు. వారికి జ్ఞాపికలను అందజేసి, వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజర్వు ఇన్స్పెక్టర్ (సంక్షేమం) కిరణ్ కుమార్, కరీంనగర్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్సై శ్రీ మామిడి సురేందర్ ఆర్ ఎస్సై తిరుపతి, ఇతర అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్సి ఫలితాల్లో ఇండియన్ పబ్లిక్ పాఠశాల ప్రభంజనం: 100 శాతం ఉత్తీర్ణత

**సుల్తానాబాద్, ఏప్రిల్ 30(ది క్రైమ్ న్యూస్):** బుధవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో సుల్తానాబాద్‌లోని ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి వార్షిక పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ విద్యార్థులను ఘనంగా సత్కరించారు. పాఠశాల నుండి మొత్తం 78 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, అందరూ ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 70 మంది విద్యార్థులు 500 కంటే ఎక్కువ మార్కులు సాధించడం విశేషం. ఎ. సహస్ర: 580 మార్కులతో ప్రథమ స్థానం. శ్రీవల్లి: 578 మార్కులతో ద్వితీయ స్థానం. బ్లెస్సి: 576 మార్కులతో తృతీయ స్థానం సాధించి పాఠశాల కీర్తిని చాటారు. ఈ సందర్భంగా చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల అంకితభావం, విద్యార్థుల కఠిన శ్రమ వల్లే ఈ విజయం సాధ్యమైందని కొనియాడారు. ప్రిన్సిపల్ కృష్ణప్రియ మాట్లాడుతూ.. పాఠశాలలో నాణ్యమైన బోధన, క్రమశిక్షణతో కూడిన విద్యా విధానం అమలు చేయడం వల్లే ప్రతి ఏటా ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని పేర్కొన్నారు. అనంతరం టాపర్లను పుష్పగుచ్చాలతో అభినందిస్తూ, భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలతో



ముందుకు సాగాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో పాఠశాల విద్యా ప్రమాణాలను మరింత పెంపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కుమార్, ఆరిఫ్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి లా ఇంటర్న్‌లకు సర్టిఫికెట్ల ప్రదానం

**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలిలో ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన లా విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తూ, మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్ట రెడ్డి నిర్దేశించిన తప్పనిసరి ఇంటర్న్‌షిప్ ప్రాముఖ్యతను వివరించారు. ఇంటర్న్‌షిప్‌ల ద్వారా విద్యార్థులు వాస్తవ జీవిత సమస్యలపై అనుభవాన్ని పొందగలరని ఆయన పేర్కొన్నారు. అలాగే, తమ విద్యా కార్యక్రమంలో ప్లేస్‌మెంట్‌కు సిద్ధమవుతున్న సమయంలో ఇంటర్న్‌షిప్ అవసరాన్ని అవగాహన చేసుకునేలా ఈ కార్యక్రమం ఉపయోగపడిందన్నారు. ఈ ఇంటర్న్‌లకు ప్రొఫెసర్ రెడ్డి మరియు వారి బృందం నిర్వహించిన వివిధ ఇంటరాక్టివ్ సెషన్లలో కమ్యూనికేషన్ నైపుణ్యాలు, భారత రాజ్యాంగం, గ్లోబల్ రాజకీయ ఆర్థిక వ్యవస్థ అంతర్జాతీయ న్యాయంపై ప్రభావం, మేధో సంపత్తి హక్కుల ప్రాధాన్యం, భారత విదేశాంగ విధానం, దేశీయ-అంతర్జాతీయ చట్టాల సంబంధం, గ్లోబలైజేషన్ నేపథ్యంలో ట్రాన్స్‌నేషనల్ గవర్నెన్స్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనుబంధంగా ఉన్న ఆంధ్ర మహిళా సభ మహిళా న్యాయ కళాశాల మరియు ఇస్లామియా కళాశాలల విద్యార్థులు ఈ 21 రోజుల తప్పనిసరి




ఇంటర్న్‌షిప్‌ను టీజీసీహెచ్ఈలో విజయవంతంగా పూర్తి చేశారు. ఈ కాలంలో వారు వివిధ సెషన్లకు హాజరు కావడంతో పాటు ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ వివాద పరిష్కారం, ఆర్బిట్రేషన్, మధ్యవర్తిత్వం, సమన్వయం, లా అండ్ టెక్నాలజీ, న్యాయ విద్యలో మారుతున్న ధోరణులు, 21వ శతాబ్దంలో చట్టపరమైన నిబంధనలు వంటి అంశాలపై ప్రెజెంటేషన్లు చేసి అసైన్‌మెంట్‌లు సమర్పించారు. ఇంటర్న్‌లు తమ అనుభవాలను ప్రొఫెసర్ రెడ్డి గారితో పంచుకొని, తమకు ఈ అవకాశాన్ని కల్పించిన టీజీసీహెచ్ఈకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్



శ్రీరామ్ వెంకటేష్, ప్రొఫెసర్ రాజేశ్వర్ మిట్టపల్లి, ఆర్. రాధాకృష్ణన్, ఆంధ్ర మహిళా సభ న్యాయ విభాగానికి చెందిన అమృత అశోక్ , ఇస్లామియా కళాశాల న్యాయ విభాగ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆజమ్ ఖాన్ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. చివరగా ఇంటర్న్‌లకు సర్టిఫికెట్లు ప్రదానం చేసి కార్యక్రమం ముగిసింది.

## చందమామలాంటి మచ్చలేని అందం మీసొంతం కావాలంటే ఉల్లి రసం ఇలా వాడండి..



జుట్టు ఆరోగ్యంగా పెరిగేందుకు చాలా మంది ఉల్లిపాయల రసాన్ని ఉపయోగిస్తారు. అయితే ఇది జుట్టుకే కాదు చర్మానికి కూడా మేలు చేస్తుంది. చర్మంపై ఏర్పడిన మచ్చలను తొలగించడంలో ఉల్లిపాయ ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఈ రోజుల్లో చాలా మంది ముఖంపై ఎర్రటి మచ్చల సమస్యతో బాధపడుతున్నారు. ఇది ముఖం అందాన్ని తగ్గిస్తుంది. చర్మంపై ఈ మచ్చలను తొలగించడం అంత సులభం కాదు. కానీ ఉల్లిపాయ ఆ పనిని సులభతరం చేస్తుంది. అయితే దీనికి ముందు, అసలు ఇలా ఎందుకు జరుగుతుందో మీరు తెలుసుకోవాలి? ముఖంపై ఎర్రటి మచ్చలు ఏర్పడటానికి అసలు కారణం చర్మంలో మెలనిన్ స్థాయి పెరుగుదల. శరీరంలో మెలనిన్ స్థాయిలు పెరిగడం వల్ల ఇలా జరుగుతుంది. మచ్చలను తొలగించడానికి ఉల్లిపాయ రసాన్ని క్రమం తప్పకుండా ఉపయోగించవచ్చు. ఉల్లిపాయ రసంలో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ పిగ్మెంటేషన్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మంపై మచ్చలను తగ్గించడంలో సహాయపడతాయి. మచ్చలను తొలగించడానికి ముందుగా.. 1 నుంచి 2 చెంచాల ఉల్లిపాయ రసాన్ని తీసుకోవాలి. కాటన్ సహాయంతో ఉల్లిరసాన్ని చర్మంపై ఎర్రగా ఉన్న ప్రదేశంలో అప్లై చేసి సున్నితంగా మసాజ్ చేయాలి. సుమారు 10 నిమిషాల పాటు మసాజ్ చేసిన తర్వాత ముఖం కడుక్కోవాలి. ఇలా రోజూ చేయడం వల్ల మచ్చల సమస్య నుంచి బయటపడవచ్చు. మచ్చలను తొలగించడానికి ఉల్లిపాయ రసంతోపాటు తేనెను కూడా ఉపయోగించవచ్చు. తేనెలో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇది ముఖంపై మచ్చలను సులువుగా తగ్గిస్తుంది. 1 టీస్పూన్ ఉల్లిపాయ రసంలో కొద్దిగా తేనె కలపాలి. దీన్ని ముఖానికి పట్టించి 10 నిమిషాల పాటు అలాగే ఉంచి, తర్వాత నీళ్లతో ముఖాన్ని శుభ్రంగా కడిగేసుకుంటే సరి.

## తిన్న వెంటనే నిద్రపోవడం ఎంత ప్రమాదమో తెలుసా?



రాత్రి భోజనం చేసిన తర్వాత నేరుగా పడుకునే అలవాటు ఉంటే ఈరోజు నుంచి దీన్ని ఆపేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎందుకంటే ఇది జీర్ణవ్యవస్థకు చాలా ఇబ్బందిని కలిగిస్తుంది. తిన్న వెంటనే నిద్రపోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి. రాత్రి భోజనం చేసిన వెంటనే నిద్రపోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు . అందుకే భోజనం చేసిన వెంటనే నిద్రపోకూడదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. తిన్న తర్వాత 2 నుంచి 3 గంటల గ్యాప్ ఉండాలంటున్నారు. తిన్న వెంటనే నిద్రపోవడం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు: రాత్రి భోజనం చేసిన వెంటనే నిద్రపోవడం మధుమేహం వంటి తీవ్రమైన వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుందని చెబుతున్నారు నిపుణులు. ఈ అలవాటు శరీరంలో గ్లూకోజ్ స్థాయిని పెంచుతుంది. అందుకే తిన్న వెంటనే నిద్రపోకండి. ఇలా చేయడం వల్ల మధుమేహం, ఊబకాయం వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది జీర్ణ సమస్యలు: రాత్రి భోజనం చేసిన వెంటనే నిద్రపోవడం వల్ల అనేక జీర్ణ సమస్యలు వస్తాయి. తిన్న వెంటనే నిద్రపోవడం జీర్ణవ్యవస్థపై చెడు ప్రభావం చూపుతుంది. అదే సమయంలో జీర్ణక్రియ నెమ్మదిగా ఉంటుంది. ఆహారం సరిగ్గా జీర్ణం కాక పొట్ట ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలు వస్తాయి. గుండెల్లో మంట: తిన్న వెంటనే నిద్రపోవడం వల్ల గుండెల్లో మంట వస్తుంది. ఎసిడిటీ, గుండెల్లో మంట, గుండెల్లో మంట వంటి సమస్యలు కూడా వస్తాయి. మీరు ఇప్పటికే ఎసిడిటీతో బాధపడుతున్నట్లయితే మీరు తిన్న వెంటనే నిద్రపోకూడదు. జీవక్రియ సమస్యలు ఉండవచ్చు:తిన్నవెంటనే నిద్రపోవడం వల్ల జీవక్రియ సమస్యలు తలెత్తుతాయి. అలాగే, ఇది ఊబకాయం, నిద్ర మరియు ఆరోగ్య సంబంధిత సమస్యలను కలిగిస్తుంది.

## మే డే ఫలాలు కార్మికులకు నిజంగా దక్కుతున్నాయా?

**- 8 గంటల పని హక్కు కాగితాలకేనా! - మేడే కేవలం సెలవు కాదు..**

**హక్కుల కోసం మోగే సమర శంఖం - రాగిడి మంగ శ్రీనివాసరెడ్డి**




**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** "పోరాడితే పోయేది ఏమీ లేదు... బానిస సంకెళ్ళు తప్ప" అనే నినాదంతో సాగిన కార్మికుల వీరోచిత పోరాటాల ఫలితమే మే డే. ఇది యాదృచ్ఛికంగా ఏర్పడిన రోజు కాదు... దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా కార్మికులు చేసిన దీర్ఘకాల పోరాటాల ప్రతిఫలం. అయితే, ఈరోజు పరిస్థితులు చూస్తే---మే డే ఇచ్చిన హక్కులు నిజంగా కార్మికులకు చేరుతున్నాయా అన్న ప్రశ్న ముందుకొస్తోంది. ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నప్పటికీ, శాశ్వత హక్కుల విషయంలో ఇంకా పెద్ద గ్యాప్ కనిపిస్తోంది. దేశంలోని అనేక రంగాల్లో కార్మికులు ఇప్పటికీ కనీస వేతనాలు, చట్టబద్ధ సౌకర్యాలు లేకుండా కష్టాలు పడుతున్నారు. 8 గంటల పని అనే ప్రాథమిక హక్కు చాలా చోట్ల అమలు కావడం లేదు. రోజుకు 10--12 గంటలు పనిచేసినా, నెలకు కేవలం 10--12 వేల రూపాయలే వేతనం అందుకుంటున్న కార్మికులు వేలల్లో ఉన్నారు. ఉద్యోగ భద్రత లేకుండా తక్కువ జీతాలకు పని చేయడం సాధారణంగా మారిపోయింది. బయోమెట్రిక్, ఫేస్ యాప్‌ల పేరుతో చిన్న ఆలస్యానికే వేతనాల్లో కోతలు విధించే పరిస్థితులు నెలకొన్నాయి. ఐటీ రంగంలో కూడా ఒత్తిడి పెరిగి, ఉద్యోగులు మానసికంగా కుంగిపోతున్నారు. కొన్ని సంఘటనల్లో ఆత్మహత్యల వరకు దారితీస్తున్నాయి. ఇంకా బాధాకరమైన విషయం ఏమిటంటేపని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలే లేవు. కూర్చునే స్థలం లేకుండా పనిచేసే పరిస్థితులు, మహిళా కార్మికులకు టాయిలెట్ సౌకర్యం లేకపోవడం వంటి సమస్యలు వారి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. డిగ్రీలు, పీజీలు చేసిన వేలాది మంది యువత కూడా ఉద్యోగ భద్రత లేకుండా, చట్టబద్ధ రక్షణలు లేకుండా పని చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో, మే డే కేవలం ఒక సెలవు రోజు కాదు... హక్కుల కోసం మళ్లీ పోరాడాల్సిన అవసరాన్ని గుర్తు చేసే రోజు. కార్మికులకు కనీస వేతనాలు, భద్రత, గౌరవం కల్పించే వరకు పోరాటం కొనసాగాల్సిందే. దేశ అభివృద్ధిలో కర్షకుడి పాత్ర ఎంత ముఖ్యమో, కార్మికుడి పాత్ర కూడా అంతే కీలకం. శ్రమ లేకుండా ఏ అభివృద్ధి సాధ్యం కాదు. అందుకే శ్రమను గుర్తించాలి... గౌరవించాలి... అప్పుడే మే డేకు పూర్తి సార్థకత దక్కుతుంది.

## పదో తరగతి ఫలితాల్లో అమీన్‌పూర్ వ్రిహా స్కూల్ ఘన ప్రభంజనం



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** అమీన్‌పూర్ వ్రిహా స్కూల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో పదోతరగతి విద్యార్థుల ప్రతిభను పాఠశాల యాజమాన్యం అభినందించింది. ఈ సందర్భంగా విద్యార్థులు సాధించిన అద్భుత ఫలితాలను వెల్లడించారు. మొత్తం 32 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 600 మార్కులకు గాను 588 మార్కులు సాధించిన అక్షిత స్కూల్ టాపర్‌గా నిలిచింది. 586మార్కులతో హాసిని ద్వితీయ స్థానం, 580 మార్కులతో శ్రేయ తృతీయ స్థానం దక్కించుకున్నారు. విద్యార్థుల క్రమశిక్షణతో కూడిన నిరంతర కృషి, అధ్యాపకుల అంకిత భావంతో చేసిన శిక్షణ వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పాఠశాల ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎన్. ప్రియబాంధవి, ప్రిన్సిపాల్ జి. రాధిక, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చెడు కొలెస్ట్రాల్ ఎందుకు పెరుగుతోంది? దీని వల్ల ఎలాంటి సమస్యలు వస్తాయి?



గత కొన్ని సంవత్సరాలుగా అనేక వ్యాధుల పరిధి పెరిగిపోతోంది. చెడు కొలెస్ట్రాల్ పెరగడం అనే సమస్య ఎదురవుతున్నాయి. చెడు కొలెస్ట్రాల్ పెరగడం వల్ల గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉంది. ఈ రెండు వ్యాధులు ప్రాణాంతకం. ఇప్పుడు కొలెస్ట్రాల్ పెరిగే సమస్య చిన్నవయసులోనే కనిపించడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో గుండెపోటు కేసులు కూడా పెరుగుతున్నాయి. అంతకుముందు పెద్దవాళ్లు చెడు కొలెస్ట్రాల్ పెరుగుతుందనే సమస్యతో తమ వద్దకు వచ్చేవారని, అయితే గత కొన్నేళ్లుగా 20 నుంచి 30 ఏళ్లలోపు వారిలో కూడా ఈ సమస్య కనిపిస్తోందని వైద్యులు చెబుతున్నారు. ఇంతలో చెడు కొలెస్ట్రాల్‌ను పెంచే సమస్యకు ప్రజలు ఎందుకు బలి అవుతున్నారనే ప్రశ్న తలెత్తుతుంది. ఈ విషయమై కార్డియాలజిస్ట్ డా.అజిత్ జైన్ మాట్లాడుతూ.. చెడు కొలెస్ట్రాల్ పెరగడానికి ప్రజల అనారోగ్య జీవనశైలి, సరైన ఆహారపు అలవాట్లు, వ్యాయామం లేకపోవడం ప్రధాన కారణాలని చెప్పారు. చాలా సందర్భాలలో, పెరిగిన చెడు కొలెస్ట్రాల్ లక్షణాలు చాలా ఆలస్యంగా గుర్తిస్తున్నారు. అటువంటి పరిస్థితిలో ఈ పెరిగిన కొలెస్ట్రాల్ కూడా గుండెపోటుకు కారణం అవుతుంది. శరీరంలో కొలెస్ట్రాల్ ఎంత మోతాదులో ఉండాలి? కొలెస్ట్రాల్‌లో చాలా రకాలు ఉన్నాయని డాక్టర్ జైన్ వివరించారు. ఇందులో అధిక సాంద్రత కలిగిన లిపోప్రొటీన్ అంటే మంచి కొలెస్ట్రాల్ మరియు తక్కువ సాంద్రత కలిగిన లిపోప్రొటీన్ అంటే చెడు కొలెస్ట్రాల్ ఉంటాయి. శరీరంలో మంచి కొలెస్ట్రాల్ 50 లేదా అంతకంటే ఎక్కువ ఉండాలి. అయితే చెడు కొలెస్ట్రాల్ ఎల్లప్పుడూ 100 కంటే తక్కువగా ఉండాలి. అంతకంటే ఎక్కువ ఉంటే వైద్యులను సంప్రదించాలి. చెడు కొలెస్ట్రాల్ పెరిగినప్పుడు ఏమి జరుగుతుంది? చెడు కొలెస్ట్రాల్ పెరగడం వల్ల అది గుండెలోని సిరల్లో పేరుకుపోతూనే ఉంటుందని, దాని వల్ల గుండె రక్తాన్ని సరిగ్గా పంప్ చేయలేకపోయి గుండెపోటు వస్తుందని డాక్టర్ జైన్ వివరిస్తున్నారు. అయితే సరైన సమయంలో పరీక్షలు చేయించుకోవడం, జీవనశైలిలో మార్పులు చేసుకోవడం ద్వారా దీన్ని అదుపులో ఉంచుకోవచ్చు. చెడు కొలెస్ట్రాల్‌ను ఎలా తగ్గించాలి. జంక్ ఫుడ్ మానుకోండి పరిమిత పరిమాణంలో మాత్రమే స్వీట్లు తినండి శారీరకంగా చురుకుగా ఉండండి తగినంత నిద్ర పొందండి ధూమపానం, మద్యపానం తగ్గించండి.

# గర్భధారణ సమయంలో బొప్పాయి తినడం వల్ల అబార్షన్ అవుతుందా? వైద్యులు ఏం చెబుతున్నారు?



గర్భధారణ సమయంలో మహిళలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. తల్లి, బిడ్డ ఇద్దరి భద్రత ముఖ్యం. చిన్న పొరపాటు కూడా తల్లి, బిడ్డపై ప్రభావం చూపుతుంది. ఈ సమయంలో ఆహారం, పానీయాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడానికి ఇది కారణం. ప్రెగ్నెన్సీ సమయంలో బొప్పాయి తినకూడదని మీరు తరచుగా వినే ఉంటారు. ఇంటి పెద్దలు కూడా అలానే చెబుతుంటారు. వైద్యులు కూడా వివిధ సలహాలు ఇస్తారు. గర్భిణీ స్త్రీలు బొప్పాయి తింటే గర్భస్రావం అవుతుందని కూడా కొందరు అంటున్నారు. ఇందులో ఎంత నిజం ఉందో చెబుతారా? ఒక అధ్యయనం ప్రకారం, గర్భధారణ సమయంలో పచ్చి బొప్పాయి తినడం వల్ల గర్భస్రావం లేదా అకాల డెలివరీ ప్రమాదాన్ని పెంచుతుందని, పండిన బొప్పాయి తినడం గర్భస్రావం ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఎలుకలపై చేసిన ప్రయోగం తర్వాత 2002లో ప్రచురితమైన ఒక అధ్యయనంలో పండిన బొప్పాయిని తిన్న గర్భిణీ ఎలుకలకు గర్భస్రావం అయ్యే ప్రమాదం తక్కువగా ఉందని, అయితే పచ్చి బొప్పాయి తినడం వల్ల గర్భస్రావం, నెలలు నిండకుండానే డెలివరీ అయ్యే ప్రమాదం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. బొప్పాయిలో ఉండే ఎంజైమ్‌ల వల్ల గర్భస్థ శిశువుకు నష్టం పెరుగుతుంది. అయితే, ఇప్పటి వరకు మనుషులపై అలాంటి అధ్యయనం లేదా పరిశోధన జరగలేదు. కానీ బొప్పాయి వినియోగం పూర్తిగా ప్రయోజనకరం లేదా హానికరం అని చెప్పలేము. పచ్చి లేదా పండిన బొప్పాయిలో లేటెక్స్, పాపైన్ ఉంటాయి. ఇవి అభివృద్ధి చెందుతున్న పిండానికి హానికరం. బొప్పాయిలోని రబ్బరు పాలు గర్భాశయం సంకోచించటానికి కారణమవుతుంది. ఇది పిండానికి చాలా హానికరం. గర్భధారణ సమయంలో పండిన బొప్పాయి తినడం ప్రయోజనకరంగా ఉన్నప్పటికీ, ప్రజలు పండిన, సగం పండిన బొప్పాయి మధ్య గందరగోళానికి గురవుతారు. అటువంటి పరిస్థితిలో పిల్లలకి ఎటువంటి హాని జరగకుండా ఉండటానికి ప్రజలు బొప్పాయి తినకుండా ఉంటారు. బొప్పాయిని ప్రెగ్నెన్సీ సమయంలో తినవచ్చని, పూర్తిగా పక్వానికి వచ్చి తక్కువ పరిమాణంలో తీసుకుంటేనే తినవచ్చని కొందరు ఆరోగ్య నిపుణులు అంటున్నారు. పూర్తిగా పండిన బొప్పాయి విటమిన్ సి, విటమిన్ ఇ మూలం. అలాగే ఫోలిక్ యాసిడ్‌తో పాటు ఫైబర్ కూడా పుష్కలంగా ఉంటుంది. ఇది ప్రయోజనకరంగా ఉంటుంది.(గమనిక: ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణుల సలహాలు, సూచనల మేరకు అందించడం జరిగింది.



# 6 నెలల వయస్సు వరకు పిల్లలకు నీరు తాగించకూడదు..

ఇంట్లోకి చిన్న అతిథి రాగానే.. తాతయ్యలే కాదు, ఇంట్లోని ప్రతి పెద్దాయన కూడా బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు తల్లిదండ్రులకు సలహాలు ఇవ్వడం మొదలుపెడతారు. తల్లిదండ్రులకు వైద్యులు ఇచ్చే సలహాల్లో ఆరు నెలల శిశువులకు నీరు తాగించకూడదనేది ఒకటి. నవజాత శిశువులకు మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇస్తారు. వైద్యులు వారికి ఆహారం ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. అంతే కాదు తాగేందుకు నీళ్లు కూడా ఇవ్వడానికి వైద్యులు నిరాకరిస్తున్నారు. వేసవిలో విపరీతమైన వేడిలో, కొన్నిసార్లు తల్లులు, కుటుంబ సభ్యుల మనస్సులో ఒక ప్రశ్న ఉంటుంది. పిల్లవాడు నీరు తాగకపోతే అతనికి ఏ డీహైడ్రేషన్ సమస్య వస్తుందని. అయితే, వైద్యుల తెలిపిన వివరాల ప్రకారం, తల్లి పాలలో 80 శాతం నీరు ఉంటుంది. ఇది అవసరమైన అన్ని పోషణ, డీహైడ్రేషన్ సమస్యను తీరుస్తుంది. 6 నెలల వరకు నవజాత శిశువుకు తల్లి పాలు తప్ప మరేమీ ఇవ్వకూడదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) పేర్కొంది. నవజాత శిశువులకు నీరు ఇస్తే, ఎలక్ట్రోలైట్ అసమతుల్యత ప్రమాదం ఉంది. ఈ స్థితిలో శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది. ఎలక్ట్రోలైట్స్ శరీరంలోని ఖనిజాలు, రక్తం, మూత్రం, ఇతర శరీర ద్రవాలలో ఉంటాయి. సోడియం, క్లోరిన్, ఫాస్ఫేట్, పొటాషియం అన్నీ ఎలక్ట్రోలైట్స్ ఉంటాయి. శరీరంలో ఎలక్ట్రోలైట్స్ సరైన సమతుల్యతను నిర్వహించడం చాలా ముఖ్యం. ఇది కాకుండా, ఫార్ములా పాలు తాగే పిల్లల శరీరం కూడా నీరు లేకుండా హైడ్రేట్ గా ఉంటుంది. అందుకే కనీసం 6 నెలల తర్వాత మాత్రమే పిల్లలకు నీరు ఇవ్వాలని సూచిస్తున్నారు వైద్యులు. డైల్యూటెడ్ ఫార్ములా పాలను తినిపించడం లేదా ఎక్కువ నీరు ఇవ్వడం శిశువు ఆరోగ్యాన్ని మరింత దిగజార్చుతుందని గుర్తుంచుకోండి. సాధారణ నీటిని తాగడం వల్ల బిడ్డకు ఎలాంటి శక్తి అందదని నిపుణులు చెబుతున్నారు. ఇది



కాకుండా ఇది ఖాళీ కేలరీలను కూడా కలిగి ఉంటుంది. కనుక ఇది 6 నెలల ముందు శిశువుకు ప్రయోజనకరం కాదు. బదులుగా ఇది పిల్లల అభివృద్ధిని ప్రభావితం చేస్తుంది.

# బాడీ మసాజ్ ఎందుకు, ఎవరికి అవసరం..? తప్పక తెలుసుకోవాలి.



వయసు యాభై దాటితే మీ దినచర్యలో బాడీ మసాజ్ కూడ చేర్చుకోవాలంటున్నారు ఆరోగ్య నిపుణులు. 45 నుంచి 50 దాటితే శరీరం లోపల ఉండే భాగాల ఎదుగుదల ఆగిపోయి అరుగుదల క్రమంగా మొదలవుతుంది. ఫలితంగా పని సామర్థ్యం తగ్గి కాళ్ళ నొప్పులు, కీళ్ళ నొప్పులు, మోకాళ్ళ నొప్పులు, మెడ నొప్పులు, బ్యాక్ పెయిన్ వంటి రుగ్మతలు వేధిస్తుంటాయి. వీటికి చెక్ పెట్టాలంటే రెగ్యులర్ బాడీ మసాజ్ చాలా అవసరం. ఇందుకోసం మన ఇంట్లోనే రోజూ ఉదయం స్నానం చేయడానికి ఓ అరగంట ముందు 10-15 నిమిషాల పాటు మనకు మనంగా బాడీ మసాజ్ చేసుకుంటే సరిపోతుంది. బాడీ పెయిన్స్ మరీ ఎక్కువగా ఉంటే ఫిజియోథెరపీ వంటివి తప్పవు. బాడీ మసాజ్‌తో ఒళ్లు నొప్పులు రాకుండా ఉంటాయి. ముందే ఒంటి నొప్పులతో ఇబ్బంది పడుతున్నట్టయితే అవి తగ్గిపోతాయంటున్నారు. ఇంట్లోనే బాడీ మసాజ్ ఎలా చేసుకోవాలి.. ఆరోగ్య ప్రయోజనాలేంటో కూడా తెలుసుకుందాం.. ఇంట్లోనే బాడీ మసాజ్ చేసుకోడానికి కొబ్బరి నూనె లేదా బాదం నూనెను ఉదయం స్నానానికి వెళ్ళేముందు ఓ పది పదిహేను నిమిషాల పాటు ఆయిల్‌తో బాడీ మసాజ్ క్రమం తప్పకుండా చేసుకుంటే..చక్కటి ఫలితం ఉంటుంది. ఇందుకోసం కావాలంటే మంచి ఆయుర్వేద పెయిన్ రిలీఫ్ ఆయిల్ వాడినా మంచి ఫలితాలే వస్తాయి. మసాజ్ కోసం కావాల్సిన ఆయిల్ తీసుకుని మన చేతి వేళ్ళతోనే రాపిడి ప్రెషర్ తో ఒళ్ళంతా పట్టించాలి. ఓ పది నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి. రోజూ క్రమం తప్పకుండా ఇలా చేస్తూ ఉంటే ఒళ్లు నొప్పులు మన దరి చేరవంటున్నారు. బాడీ పెయిన్స్ విషయంలో ముందే జాగ్రత్త పడటం చాలా అవసరం అంటున్నారు నిపుణులు. లేదంటే ఆ తర్వాత వైద్యం కోసం, ఫిజియోథెరపీ మెడిసిన్లు అంటూ ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. ఇలాంటి జాయింట్ పెయిన్స్, బాడీ పెయిన్స్ మరింత తీవ్రమైతే వేలకు వేలు పెట్టి ఖరీదైన సర్జరీలు, టెన్షన్లు తప్పవని నిపుణులు సూచిస్తున్నారు. ఒళ్లు నొప్పుల సమస్యతో ఇబ్బంది పడుతున్న వారు అనేక మంది ఉన్నారు. కాబట్టి రోజూ మనం బాడీ మసాజ్ అలవాటు చేసుకుంటే.. ఎన్నో అనారోగ్య సమస్యలను రాకుండా ముందే అడ్డుకోగలం అంటున్నారు. ప్రతిరోజూ మార్నింగ్ వాక్ తరువాత రెగ్యులర్‌గా బాడీ మసాజ్ చేసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచిదంటున్నారు. బాడీ మసాజ్ వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఒకటి, రెండు కాదు.. ఏకంగా 25 రకాల లాభాలు ఉన్నాయని వైద్యులు, నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా బాడీ మసాజ్ వలన రక్తప్రసరణ బాగా మెరుగవుతుంది. లో బ్లడ్ ప్రెషర్ ను నియంత్రిస్తుంది. ఒత్తిడిని బాగా తగ్గిస్తుంది. మజిల్స్ టెన్షన్ ని తగ్గిస్తాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. బాడీ పెయిన్స్ రాకుండా ఉంటాయి. ఆల్రెడీ బాడీ పెయిన్స్ ఉంటే తగ్గుతాయి.

# ఆ దేశంలో కొన్ని రకాల కాస్మెటిక్ ఉత్పత్తులతో తీవ్ర అనారోగ్యం.. వాటి అమ్మకం, వినియోగంపై నిషేధం..

ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కొన్ని రకాల మెడిసిన్స్ అమ్మకాలపై నిషేధం విధించింది. ముఖ్యంగా మైక్రోడెర్మాబ్రేషన్ వంటి కొన్ని కాస్మెటిక్ విధానాలకు ఉపయోగించే ముందులు లేదా కాస్మెటిక్ సర్జరీ తర్వాత నొప్పిని తగ్గించడానికి అమ్మే ఓవర్-ది-కౌంటర్ అనాల్జెసిక్ ఉత్పత్తులను ఉపయోగించవద్దని వినియోగదారులను హెచ్చరిస్తోంది. లేజర్ హెయిర్ రిమూవల్, టాటూయింగ్, చెవులు లేదా శరీరం మీద ఎక్కడైనా పియర్సింగ్ చేసినప్పుడు ఉపయోగిస్తున్న కొన్ని రకాల మందులపై నిషేధం విధించింది. అంతేకాదు ఫెడరల్ చట్టాన్ని ఉల్లంఘించి ఈ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసినందుకు ఆరు కంపెనీలకు, ఏజెన్సీలకు హెచ్చరిక లేఖలు జారీ చేసింది ప్రకారం ఈ ఉత్పత్తుల్లో కొన్ని లిడోకాయిన్ వంటి పదార్థాలను కలిగి ఉన్నాయని లేబుల్ చేయబడ్డాయి. ఇవి ఓవర్-ది-కౌంటర్ అంటే నొప్పి నివారణ ఉత్పత్తుల కోసం అనుమతించిన దానికంటే ఎక్కువ సాంద్రతలలో లిడోకాయిన్ వంటి పదార్థాలు ఉన్నట్లు తాము గుర్తించినట్లు చెప్పారు. డ్రగ్స్ కోసం కొత్త మార్కెటింగ్ కోడ్ “కొన్ని కాస్మెటిక్ చికిత్స చేసే సమయంలో ఈ ఉత్పత్తుల్లో క్రమరహిత హృదయ స్పందన, మూర్ఛ వంటి వ్యాధులకు కారకులుగా మారవచ్చు అని పేర్కొన్నారు. అంతేకాదు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు కూడా కలుగుతున్నాయని తాము గుర్తించినట్లు.. ఈ ఉత్పత్తులు తీసుకుంటున్న వినియోగదారుడు తీసుకునే ఆహార పదార్థాలతో కూడా సంకర్షణ చెందుతాయి, “అని పేర్కొంది. “ఈ ఉత్పత్తులు వినియోగదారులకు ఆమోదయోగ్యంకాని నష్టాలను కలిగిస్తున్నాయని.. కనుక మార్కెట్లో వీటి అమ్మకాలపై నిషేధం విధించినట్లు జిల్ ఫర్మాన్, సెంటర్‌లో కంప్లైయన్స్ ఆఫీసర్స్ డైరెక్టర్ అన్నారు. గత దశాబ్దంలో ఇలాంటి ఉత్పత్తుల గురించి వినియోగదారులకు హెచ్చరికలు చేసినప్పటికీ, ఏజెన్సీ ఆన్‌లైన్ , రిటైల్ స్టోర్‌ల్లో అందుబాటులో ఉంచుతూ ప్రమాదకరమైన ఉత్పత్తులను అమ్మకాలు కొనసాగుతున్నట్లు చెప్పారు. డుచెన్ మస్కులర్ డిస్ట్రోఫీకి స్టెరాయిడ్ ఉపయోగించని చికిత్సకు ఆమోదం తెలిపింది. అంతేకాదు ఈ సమస్యలను ఎలా పరిష్కరిస్తారో లేదా ఉత్పత్తులు చట్టాన్ని ఉల్లంఘించలేదని తాము భావిస్తున్నట్లు వివరిస్తూ అందుకు తగిన సమాచారాన్ని అందించాలని.. తాము ఇచ్చిన నోటీసు అందుకున్న 15 రోజులలోపు ఈ కంపెనీ యాజమాన్యం ప్రతిస్పందించాలని కంపెనీలను కోరింది. ఇప్పటికే ఉత్పత్తి చేసిన మెడిసిన్స్ ను స్వాధీనం చేసుకోవడం లేదా ఉల్లంఘించే ఉత్పత్తుల తయారీని, పంపిణీని నిలిపివేయాలని సదరు కంపెనీలను కోరుతోంది. అంతేకాదు ఇందుకు సంబంధించిన కోర్టు ఆర్డర్‌తో సహా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. మైక్రోడెర్మాబ్రేషన్ ఉత్పత్తులనులోకి ప్రవేశించకుండా, వినియోగదారుల వద్దకు చేరకుండా ఆపడానికి ఈ కంపెనీలలో కొన్నింటిని హిట్ లిస్ట్ లో ఉంచినట్లు పేర్కొంది.



# ఉదయాన్నే పరగడుపున ఈ డ్రింక్ తాగితే అనేక వ్యాధులు పరార్.. అద్భుతమైన హోమ్ రెమిడీస్



ప్రస్తుతం చాలా మందిని అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుంది. కొన్ని హోమ్ రెమీడిస్ పాటించడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి. అయితే ఉదయాన్నే కొన్ని డ్రింక్స్ తాగినట్లయితే శరీరంలోని కొన్ని సమస్యలు తొలగిపోతాయి. అల్లం వల్ల కలిగే ప్రయోజనాల గురించి కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. అన్ని వేళలా మందులు తీసుకునే బదులు, మీరు వంటగదిలోని కొన్ని వస్తువులపై ఆధారపడవచ్చు. అటువంటి పదార్థాలలో ఒకటి అల్లం. అల్లం అనేక పోషకాలతో నిండి ఉంటుంది. ఇందులో ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, జింక్, కాపర్, మాంగనీస్ పుష్కలంగా ఉన్నాయి. ఇందులో క్రోమియం, విటమిన్ సి, కాల్షియం, ఫాస్పరస్, ఐరన్ కూడా ఉన్నాయి. ఇది బ్యాక్టీరియా, వైరస్‌లతో పోరాడగలదు. మీరు టాన్సిల్ సమస్యలతో బాధపడుతుంటే మీకు అల్లం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. గొంతు నొప్పి నుండి టాన్సిలైటిస్ వరకు అన్నింటి నుండి ఉపశమనాన్ని అందిస్తుంది. అల్లంలో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ క్యాన్సర్ గుణాలు ఉన్నాయి. అలాగే ఇవన్నీ శరీరానికి చాలా ఉపయోగకరంగా ఉంటాయి. అల్లం రసం కూడా బరువు తగ్గడంలో సహాయపడుతుంది. ఖాళీ కడుపుతో అల్లం రసం తాగడం వల్ల కూడా చాలా ప్రయోజనాలు ఉన్నాయి. అల్లం రసం మధుమేహ వ్యాధిగ్రస్తులకు కూడా మేలు చేస్తుంది.ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో ఒక చెంచా అల్లం రసం కలపండి. క్రమం తప్పకుండా తాగాలి. అప్పుడు తేడా మీకే అర్థమవుతుంది. మీరు రోజంతా చాలా ఉల్లాసంగా ఉండగలరు. అయితే మీరు నిద్రలేచి, ఖాళీ కడుపుతో ఈ అల్లం నీటిని తాగితే, మీరు కేవలం కొన్నింటితో బరువు తగ్గవచ్చు. అందుకే ఈరోజు నుండే అలవాటు చేసుకోండి. (నోట్: ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణుల సలహాలు, సూచనల మేరకు అందించడం జరిగింది. వీటిని అనుసరించే ముందు వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నాము.

# డయాబెటిస్ ఎన్ని రకాలు..

## ఎలా సంభవిస్తుంది? నివారణ చర్యలు ఏమిటి?



డయాబెటిస్ చాలా సాధారణ సమస్యగా మారుతోంది. నేడు ప్రతి ఇంట్లో ఒకరు మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉన్నారు. భారతదేశంలో ఈ సంఖ్య చాలా వేగంగా పెరుగుతోంది. ఇప్పుడు యువత చిన్న వయస్సులోనే ఈ వ్యాధికి గురవుతున్నారు. డయాబెటిస్ అనేది చాలా తీవ్రమైన సమస్య. ఇది శరీరంలో రక్తంలో చక్కెర స్థాయి పెరుగుదల కారణంగా సంభవిస్తుంది. దానిని నియంత్రించకపోతే అది క్రమంగా శరీరంలోని ప్రతి అవయవాన్ని ప్రభావితం చేస్తుంది. ప్రకారం, 2030 నాటికి భారతదేశంలో మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య రెట్టింపు అవుతుంది. మధుమేహం రావడానికి గల కారణాలను, దానిని నివారించే మార్గాలను తెలుసుకుందాం. మధుమేహం అంటే ఏమిటి? శరీరంలో రక్తంలో గ్లూకోజ్ స్థాయి పెరిగినప్పుడు ఈ సమస్యను డయాబెటిస్ అంటారు. వాస్తవానికి, శరీరంలోని రక్తంలో గ్లూకోజ్‌ను నియంత్రించే పని ఇన్సులిన్ ద్వారా జరుగుతుంది. ఇది ప్యాంక్రియాస్‌లో ఉత్పత్తి అవుతుంది. ప్యాంక్రియాస్‌లో ఇన్సులిన్ ఉత్పత్తి అయిన తర్వాత రక్తంలో ఉండే గ్లూకోజ్‌ను నియంత్రిస్తుంది. కానీ కొన్ని కారణాల వల్ల క్లోమం తగినంత పరిమాణంలో ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయలేకపోయినప్పుడు, శరీరంలో గ్లూకోజ్ స్థాయి పెరిగి మధుమేహం సమస్య ప్రారంభమవుతుంది. మధుమేహం రకాలు మధుమేహం ప్రధానంగా రెండు రకాలుగా విభజించబడింది: టైప్-1, టైప్-2 మధుమేహం. ప్యాంక్రియాస్‌లో ఏదైనా లోపం కారణంగా చిన్నతనం నుండి ఇన్సులిన్ ఉత్పత్తి కానప్పుడు, పిల్లవాడు టైప్-1 డయాబెటిస్‌కు గురవుతాడు. అతని శరీరం ఇన్సులిన్ ఉత్పత్తి చేయలేకపోవటం వలన అతని జీవితాంతం ఇన్సులిన్ ఇవ్వబడుతుంది. టైప్-2 మధుమేహం మన అనారోగ్య జీవనశైలి కారణంగా వయస్సు పెరిగేకొద్దీ వస్తుంది. కానీ ఈ రోజుల్లో యువత అనారోగ్య జీవనశైలి చిన్న వయస్సులోనే టైప్-2 డయాబెటిస్‌కు కారణం అవుతోంది. టైప్ 2 డయాబెటిస్‌కు కారణాలు అనారోగ్య జీవనశైలి ఒత్తిడి బయట జంక్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం క్రమరహిత జీవనశైలి తక్కువ శారీరక శ్రమ ఊబకాయం మధుమేహం నివారణ జీవనశైలి మెరుగుదల ఆరోగ్యకరమైన, పోషకమైన ఆహారాన్ని తీసుకోవడం ఆహారంలో ఆకుపచ్చని కూరగాయలు, సీజనల్ పండ్లను తీసుకోవడం తగినంత నీరు తాగడం ఒత్తిడిని తగ్గించండి శారీరకంగా చురుకుగా ఉండటం రోజూ అరగంట పాటు వ్యాయామం లేదా వాకింగ్ చేయడం స్థూలకాయాన్ని నియంత్రిస్తుంది కొలెస్ట్రాల్, అధిక రక్తపోటు వంటి వ్యాధులను నివారించడం బయట జంక్, ఫాస్ట్ ఫుడ్ తక్కువగా తినండి

# బీర్ తాగితే ఒంటికి చలువ చేస్తుందా..? కిడ్నీలో రాళ్లు కరుగుతాయా?



ఎండాకాలం వస్తే మద్యం ప్రియులు బీర్లు తెగ సేవిస్తారు. అదెంటి అంటే.. బీర్ తాగితే ఒంటికి చలవు చేస్తుందని చెబుతారు. కానీ ఇది ఎంతమాత్రం కరెక్ట్ కాదంటున్నారు డాక్టర్లు. అందుకు ఎలాంటి శాస్త్రీయమైన ఆధారాలు లేవంటున్నారు. అంతేకాదు బీర్ తాగితే గుండెకు మంచిదనే ప్రచారాన్ని కూడా కొట్టి పారేస్తున్నారు. ఇక కొందరు బీర్ తాగడం వల్ల కిడ్నీల్లో రాళ్లు తగ్గుతాయని చాలామంది నమ్ముతారు. ఇది నిజం కాదని నెఫ్రోలాజిస్టులు నొక్కి చెబుతున్నారు. అయితే బీర్ తాగేవారు లావు అవుతారు అనడంలో కొంతమేర వాస్తవం ఉంది. అయితే బరువు పెరిగేందుకు ఇది మంచి పద్ధతి కాదు. ఒక గ్రాము ఆల్కాహాల్ సేవిస్తే 7 కేలరీలు శరీరానికి అందుతాయి. ఈ క్రమంలో బీర్ అధికంగా సేవిస్తే బరువు పెరుగుతారు. ఇక బీర్‌ను తలకు పట్టిస్తే.. షాంపులా వాడితే జుట్టు పెరుగుతుందన్నది మరికొందరి వాదన. జుట్టు కుదుళ్ల నుంచే బలంగా ఉండాలి. జుట్టుకు ఏదైనా రాసుకుంటే పెరుగుతుందనే దాన్ని సైన్స్ విశ్వసించదు అంటున్నారు డాక్టర్లు. ఆల్కాహాల్ కొద్ది మొత్తంలో తీసుకుంటే మంచిదని గతంలో పరిశోధనల్లో తేలింది. అయితే వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్.. జనవరిలో విడుదల చేసిన రిపోర్ట్ ప్రకారం.. ఎంత మొత్తంలో ఆల్కాహాల్ తీసుకున్నా కూడా అది ఆరోగ్యానికి చేటే అని వెల్లడించింది. ఆల్కాహాల్ సేవనం పలు రకాల క్యాన్సర్లకు కారణం అవుతుంది. అయితే బీర్ కాకుండా ఇతర రకాల ఆల్కాహాల్ తీసుకునే వారికి లివర్ 5 ఏళ్లలో దెబ్బతింటే, బీర్ తాగే వారికి 10 సంవత్సరాల్లో దెబ్బతింటుందని కొందరు డాక్టర్స్ చెబుతున్నారు.

# ప్లేఆఫ్ రేసు నుంచి ముంబై అవుట్?

## స్పోర్ట్స్

ఐపీఎల్ 2026 చాలా ఇంట్రస్టింగ్‌గా సాగుతోంది. బుధవారం ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగిన 41వ హైఓల్టేజ్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయం సాధించింది. ఆరు వికెట్ల తేడాతో ముంబై ఇండియన్స్‌ను ఓడించింది. సొంత గడ్డపై ముంబై ఇండియన్స్‌కు నిరాశ తప్పలేదు. భారీ స్కోరు సాధించినప్పటికీ మ్యాచ్‌ను గెలవలేకపోయింది. వరుస పరాజయాలతో పాయింట్ల పట్టికలో ముంబై ఇండియన్స్ 9వ స్థానానికి పడిపోయి ప్లేఆఫ్ అవకాశాలను క్లిష్టతరం చేసుకుంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ 243 పరుగులు చేసింది. ఆ జట్టులో ర్యాన్ రిక్లటన్ వీరవిహారం చేశాడు. 123 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ముంబై ఇండియన్స్ తరఫున ఆడిన దిగ్గజాలకు సాధ్యం కాని రికార్డును నమోదు చేశాడు. దీంతో కేవలం ఐదు వికెట్లు మాత్రమే కోల్పోయి 244 పరుగుల లక్ష్యాన్ని ఎస్ఆర్‌హెచ్‌కు ఇచ్చింది. భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో హైదరాబాద్ తడబడుతుందని ముంబై భావించింది. కానీ ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ తమ మార్క్ ఆరంభాన్ని అందించారు. ముఖ్యంగా హెడ్ అయితే సిక్సర్స్‌తో ముంబై బౌలర్లను ఊచకోత కోశాడు. వరుస ఓవర్లలో వికెట్లు పడినా హైదరాబాద్ ఏ మాత్రం వెనక్కి తగ్గలేదు. ఆరంభాన్ని క్యాష్ చేసుకున్న హెన్రిచ్ క్లాసెన్, సలీల్ అరోరా మిగతా పని పూర్తి చేశారు. ఇంకా 8 బంతులు మిగిలి ఉండగానే ఆరు వికెట్ల తేడాతో ముంబైని ఓడించారు. ఈ మ్యాచ్



హైదరాబాద్‌ను పాయింట్ల పట్టికలో మెరుగు పరిస్తే, ముంబైను 9వ స్థానంలో పడేసింది. ముంబై ఓటమికి ప్రధానంగా బౌలింగ్ వైఫల్యం, కెప్టెన్ హార్దిక్ పాండ్యా తీసుకున్న కొన్ని నిర్ణయాలు, క్యాచ్‌లు పట్టకపోవడం. కీలక సమయంలో ఒక డీఆర్ఎస్ విషయంలో పాండ్యా చేసిన పొరపాటు ముంబైకి విజయాన్ని దూరం చేసింది. దీంతో హెడ్ దూకుడుగా ఆడి స్కోర్‌బోర్డు పరుగులు పెట్టించాడు. అతని క్యాచ్‌లను కూడా మూడుసార్లు జారవిడిచారు. ముంబైకి ప్లే ఆఫ్ ఆశలు లేనట్టేనా అంటే చెప్పలేదు. ఇప్పటి వరకు 8 మ్యాచ్‌లు ఆడిన ముంబై కేవలం రెండు మాత్రమే గెలిచింది. ఆ జట్టుకు కేవలం నాలుగు పాయింట్లు మాత్రమే ఉన్నాయి. టోర్నీలో ప్లేఆఫ్‌కు వెళ్లాలంటే మిగితా ఆరు మ్యాచ్‌లలో కచ్చితంగా అన్నీ గెలవాలి. 12 ఇప్పుడు నాలుగు మొత్తం 16 పాయింట్లో ప్లేఆఫ్ బెర్తు ఖరారు చేసుకోవచ్చు. ఒకవేళ ఆరింటిలో ఐదు మ్యాచ్‌లు గెలిస్తే ఆ జట్టు ఖాతాలో 14 పాయింట్లు ఉంటాయి. అప్పుడు ఇతర జట్ల ఫలితాలు, నెట్ రన్ రేట్‌పై ఆధారపడాలి. మరో రెండు మ్యాచ్‌లలో ఓడిపోతే ఈ ఏడాదికి గుడ్‌బై చెప్పేసి వచ్చే సీజన్ కోసం ప్లాన్స్ వేసుకోవాల్సి ఉంటుంది. ముంబై ఇండియన్స్ ప్లేఆఫ్ ఆశలను సజీవంగా ఉండాలి అంటే మే రెండున చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచ్‌లో తప్పక గెలవాలి. ఆ మ్యాచ్ చెన్నైలో జరగనుంది. నాల్గో తేదీన సొంత గడ్డపై లక్నోతో మ్యాచ్ ఉంటుంది. 10న ఆర్సీబీతో తలపడనుంది. 14వ తేదీన పంజాబ్ కింగ్స్‌తో హిమాచల్ ప్రదేశ్‌లో ఢీ కొట్టనుంది. 20న కేకేఆర్‌తో, 24న రాజస్థాన్ రాయల్స్‌తో పోటీ పడనుంది. ఐదు సార్లు ఛాంపియన్ జట్టు పాయింట్ల పట్టికలో అడుగున ఉండటాన్ని అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. హార్దిక పాండ్యా సారథ్యంలో జట్టులో సమన్వయం లోపించిందని విమర్శలు వస్తున్నాయి. ముంబై ప్లే ఆఫ్‌కు చేరాలంటే కేవలం తమ ప్రదర్శనపై కాకుండా ఇతర జట్ల గెలుపోటములను కూడా గమనించాల్సి ఉంటుంది.

## సన్ రైజర్స్ నయా సంచలనం సలీల్ అరోరా

ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ వరుస విజయాలతో దూసుకుపోతుంది. బుధవారం వాంఖడే వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 244 పరుగుల లక్ష్యాన్ని 18.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఈ మ్యాచ్‌లో సన్ రైజర్స్ నయా సంచలనం సలీల్ అరోరా ఆఖరిలో వేగంగా ఆడి హైదరాబాద్ విజయంలో తన వంతు పాత్ర పోషించాడు. ఐపీఎల్ 2026లో సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుకు అదరగొట్టే ఆటగాడు సలీల్ అరోరా దొరికాడు. వేలంలో రూ. 1.5 కోట్లకు కొనుగోలు చేసినప్పుడు అనేక అనుమానాలు వ్యక్తమైన ఈ అన్‌క్యాప్డ్ వికెట్‌కీపర్ కమ్ బ్యాటర్.. ఇప్పుడు తన ప్రదర్శనతో అందరికీ సమాధానం ఇచ్చాడు. ముఖ్యంగా ముంబై ఇండియన్స్‌పై జరిగిన హై స్కోరింగ్ మ్యాచ్‌లో తన అద్భుత ఫినిషింగ్ ఇన్నింగ్స్‌తో జట్టుకు భారీ విజయాన్ని అందించాడు. సీజన్ ప్రారంభంలో వరుసగా తక్కువ స్కోర్‌తో ఔట్ కావడం వల్ల సలీల్ అరోరాపై పలు విమర్శలు వచ్చాయి. అయితే ముంబై ఇండియన్స్‌తో జరిగిన 244 పరుగుల భారీ ఛేజ్‌లో ఈ యువ క్రికెటర్ తన సత్తా ఏంటో బయటపెట్టాడు. ఛేజింగ్‌లో 17వ ఓవర్లో నితీశ్ కుమార్ రెడ్డి ఔటైన తరువాత క్రీజులోకి వచ్చిన ఈ ఆటగాడు విధ్వంసకర ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. కేవలం 10 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 30 పరుగులతో అజేయంగా నిలిచాడు. ముఖ్యంగా స్టార్ పేసర్ జస్ ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో అతడు కొట్టిన సిక్సర్ గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతోంది. చివరి 18 బంతుల్లో 24 పరుగులు అవసరమైన సమయంలో అరోరా.. బుమ్రా బౌలింగ్ లో భారీ నో-లుక్ సిక్స్ కొట్టాడు. డీప్ స్క్వేర్ లెగ్ పైకి కొట్టి బంతి ఎక్కడికి వెళ్తుందో చూడకుండానే షాట్ పూర్తి చేశాడు సలీల్ అరోరా. పంజాబ్‌లోని అమృత్‌సర్‌కు చెందిన సలీల్ అరోరా 2002 నవంబర్ 7న జన్మించాడు. అతడి తండ్రి రాకేష్ అరోరాకు ఓ చిన్న వ్యాపారం ఉంది. ఆయన కూడా ఓ మాజీ క్రికెటర్. ఆయన జిల్లా స్థాయిలో క్రికెట్ ఆడారు. అయితే.. కుటుంబ బాధ్యతల కారణంగా ఆయన మధ్యలోనే క్రికెట్‌ను వదిలి వ్యాపారంలోకి ప్రవేశించారు. అయినప్పటికీ ఆయనలోని క్రికెటర్ మాత్రం సజీవంగానే ఉన్నారు. అందుకే.. సలీల్ పుట్టినప్పుడు, తన కొడుకును ఒక క్రికెటర్‌గా చేయాలని నిర్ణయించుకున్నాడు. 23 ఏళ్ల సలీల్ తన తండ్రి కలను నెరవేరుస్తున్నాడు. గత సంవత్సరం సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో కేవలం 39 బంతుల్లోనే సెంచరీ చేసి సంచలనం సృష్టించడంతో సలీల్ తొలిసారిగా వెలుగులోకి వచ్చాడు. ఆ మ్యాచ్‌లో సలీల్ 45 బంతుల్లో 11 సిక్సర్లు, 9 ఫోర్లతో సహా 125 పరుగులు చేశాడు. ఈ క్రమంలో ఐపీఎల్ 2026లో సలీల్‌ను 30 లక్షల కనీస ధరతో వేలంలోకి రాగా.. చివరికి సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ.1.50 కోట్లకు కొనుగోలు చేసింది.





## నా సక్సెస్ సీక్రెట్ ఇదే!

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ అభిషేక్ శర్మ పరుగుల సునామీ సృష్టిస్తున్నాడు. ప్రస్తుతం టీ20 ఫార్మాట్‌లో ప్రపంచ నంబర్ వన్ బ్యాటర్‌గా ఉన్న అభిషేక్, తన అద్భుతమైన ఫామ్ వెనుక ఉన్న అసలు కారణాన్ని వెల్లడించాడు. ఆస్ట్రేలియా స్టార్ ఆటగాడు, తన టీమ్ మేట్ ట్రావిస్ హెడ్ ప్రభావం తన బ్యాటింగ్ శైలిపై చాలా ఎక్కువగా ఉందని అభిషేక్ పేర్కొన్నాడు. జియో స్టార్ తో జరిగిన సంభాషణలో అభిషేక్ తన మనసులోని మాటలను పంచుకున్నాడు. హెడ్ తన బ్యాటింగ్ అప్రోచ్ ను ఎలా మార్చాడో, మైదానంలో భయం లేకుండా ఎలా ఆడాలో నేర్పించాడో వివరించాడు. ట్రావిస్ హెడ్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులోకి రాకముందు నుండే తాను అతని ఆటను గమనిస్తున్నానని, దాదాపు ఏడాదిన్నర కాలంగా అతని బ్యాటింగ్ స్టైల్ తనను ఆకట్టుకుందని అభిషేక్ తెలిపాడు. అతను తన టీమ్ మేట్ అయినప్పుడు తాను చాలా సంతోషించానని, అతనితో డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడం ఒక గొప్ప అనుభవమని వెల్లడించాడు. అతనితో మాట్లాడినప్పుడు మొదట అడిగింది అతని బ్యాటింగ్ మైండ్‌సెట్ గురించేనని, మూడు ఫార్మాట్లలోనూ అతను బౌలర్లపై ఎలా ఆధిపత్యం చెలాయిస్తాడో తెలుసుకోవాలని అనుకున్నానని అభిషేక్ చెప్పాడు. బ్యాటింగ్ విషయంలో ట్రావిస్ హెడ్ చాలా సింపుల్ ప్లాన్ ఫాలో అవుతాడని అభిషేక్ తెలిపాడు. "బంతిని జాగ్రత్తగా గమనించు, మొదటి బంతి నుండే బాదగలనని నీకు అనిపిస్తే ఏమాత్రం ఆలోచించకుండా షాట్ ఆడేయ్ అని హెడ్ నాకు సలహా ఇచ్చాడు. ఐపీఎల్ ప్రాక్టీస్ సెషన్లలో నేను అదే ఫాలో అయ్యాను. ఇప్పుడు నా మైండ్‌సెట్ పూర్తిగా మారిపోయింది. బంతి నా జోన్ లో పడితే చాలు, మొదటి బంతి నుండే సిక్సర్ బాదడానికి ప్రయత్నిస్తున్నాను. ఈ అగ్రెసివ్ అప్రోచ్ వల్లే నేను పవర్ ప్లేలో ఎక్కువ రన్స్ చేయగలుగుతున్నాను" అని ఈ యంగ్ సెన్సేషన్ వివరించాడు. ప్రపంచంలోనే ఐపీఎల్ నంబర్ వన్ టీ20 లీగ్ అని అభిషేక్ కొనియాడాడు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దిగ్గజ ఆటగాళ్లతో కలిసి ఆడటం ఒక వరం లాంటిదని అభిప్రాయపడ్డాడు. ప్రతి ఐపీఎల్ సీజన్‌ను తానొక పాఠంలా భావిస్తానని, అగ్రశ్రేణి ఆటగాళ్లతో పోటీ పడటం వల్ల ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చని చెప్పాడు. మైదానంలో ఎదురయ్యే ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో ఐపీఎల్ నేర్పిస్తుందని అభిషేక్ అభిప్రాయపడ్డాడు. ఈ సీజన్‌లో అభిషేక్ శర్మ ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల్లో 425 పరుగులు చేశాడు. టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో అతను అగ్ర స్థానంలో నిలిచి, ఆరెంజ్ క్యాప్ ను సొంత చేసుకున్నాడు. 400 పరుగులతో రెండో స్థానంలో 15 ఏళ్ల వయసున్న వైభవ్ సూర్యవంశీ ఉన్నాడు. ఈ సీజన్‌లో అభిషేక్ ఇప్పటికే ఒక సెంచరీ, మూడు హాఫ్ సెంచరీలు నమోదు చేశాడు. ముఖ్యంగా 200ం స్ట్రైక్ రేట్ తో బ్యాటింగ్ చేస్తూ బౌలర్లకు పీడకలలా మారాడు. 50కిపైగా యావరేజ్ తో నిలకడగా రాణిస్తున్నాడు. ఇక ముంబై ఇండియన్స్ తో జరుగుతున్న మ్యాచ్ లోనూ అభిషేక్ సత్తా చాటాడు. 24 బంతుల్లోనే 45 పరుగులు సాధించి, 425 పరుగులతో ఆరెంజ్ క్యాప్ దక్కించుకున్నాడు. ఇందులో 4 ఫోర్లు, 3 సిక్సర్లు ఉన్నాయి. ఇక 244 పరుగుల టార్గెట్ తో బరిలోకి దిగిన సన్ రైజర్స్ హైదరాబాద్ కు మరో ఓపెనర్ హెడ్ (30 బంతుల్లో 76, 4 ఫోర్లు, 8 సిక్సర్లు) తో కలిసి అభిషేక్ 129 పరుగులు జోడించాడు.

## సూర్య ఆటపై మండిపడుతున్న అభిమానులు

2026 ఐపీఎల్?లో భారీ అంచనాలతో బరిలోకి దిగిన ముంబయి ఇండియన్స్? పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. ముఖ్యంగా ఆ జట్టు స్టార్ ప్లేయర్ సూర్య కుమార్? యాదవ్ ఫామ్ ఆందోళన కలిగిస్తోంది. తాజాగా సన్?రైజర్స్ హైదరాబాద్?తో మ్యాచ్?లోనూ ఇదే పరిస్థితి. ఐదు పరుగులే చేసి పెవిలియన్? బాట పట్టాడు. ఈ సీజన్?లో ఎనిమిది మ్యాచ్?లు ముగిసినా సూర్య నుంచి చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ రాలేదు. దీంతో "స్కై"పై అభిమానులు విమర్శలు గుప్పిస్తున్నారు. అతడి కెరీర్? ముగిసినట్లేనా? అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.ఈ సీజన్‌లో సూర్యకుమార్ పూర్తిగా ఫామ్ కోల్పోయాడు. ఎనిమిది ఇన్నింగ్స్‌లలో 20.25 సగటున 162 పరుగులు మాత్రమే చేశాడు. సగటు మరీ దారుణంగా ఉంది. స్ట్రైక్ రేట్ 140.87 నమోదైంది. అయితే మిడిలార్డర్?లో బాగా ఆడతాడనుకున్న స్కై ఈ సీజన్‌లో సత్తా చాటలేకపోతున్నాడు. చివరి ఆరు ఇన్నింగ్స్‌లో సూర్య వరుసగా 6, 33, 0, 15, 36, 5 స్కోర్లు? చేశాడు. అప్పుడప్పుడు మెరిసినా, ఈ సీజన్?లో గేమ్?ఛేంజర్ ?లాంటి ఆట మాత్రం ఆడలేకపోయాడు. ముంబయి ఇండియన్స్ మిడిల్ ఆర్డర్‌కు సూర్యకుమార్ ఎంతో కీలకం. ఓపెనర్లు కష్టపడుతున్న సమయంలో బాధ్యత తీసుకోవాల్సిన అతడు తరచూ నిరాశ పరుస్తున్నాడు.సూర్యకుమార్ ఫామ్ విఫలమవుతుండటంపై సోషల్?మీడియాలో తీవ్ర చర్చ జరుగుతోంది. గతంలోలాగా సూర్య ఎందుకు ఆడలేకపోతున్నాడని, అతడి పేలవ ప్రదర్శన వల్ల టీమ్? నుంచి వైదొలగాల్సిన పరిస్థితి ఏర్పడుతుందా? అంటూ కామెంట్లు పెడుతున్నారు. కీలక మ్యాచ్‌లలో రాణించలేకపోతున్నాడని అంటున్నారు. సూర్యకుమార్ ముంబయి ఇండియన్స్ స్టార్? బ్యాటర్లలో ఒకడు. 'సూర్య కంప్లీట్?గా ఫామ్? కోల్పోయాడు. అసలు అతడు టచ్?లోనే లేడు. ఇలాంటి వ్యక్తి టీమ్‌ఇండియాకు ఎలా నాయకత్వం వహిస్తున్నాడో అర్థం కావట్లేదు. కెప్టెన్ అనేవాడు ముందుండి జట్టును నడిపించాలి. కానీ అతడు పరుగులు చేయడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాడు. ఇది ఇలాగే కొనసాగితే అతడు అనేక ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. కెప్టెన్సీ అనేది ప్రదర్శన ఆధారంగా వస్తుంది' అని ఓ నెటిజన్ ఎక్స్?లో రాసుకొచ్చాడు. అలాగే 2024 సౌతాఫ్రికాతో సిరీస్? నుంచే సూర్య ఫామ్?లో లేడని, అతడు 2025 ఆసియా కప్?లోనూ విఫలమయ్యాడని మరో నెటిజన్ పోస్టు చేశాడు. టీ20 వరల్డ్?కప్?లోనూ సూర్య ఒక్క మ్యాచ్?లో మాత్రమే రాణించాడని రాసుకొచ్చాడు. సూర్య కెరీర్ దాదాపు ముగిసినట్లే! 2028 టీ20 వరల్డ్?కప్? కోసం టీమ్‌ఇండియా ఇప్పట్నుంచే కొత్త కెప్టెన్?ను నియమించి ప్రిపరేషన్ ప్రారంభించాలని మరో యూజర్ అన్నాడు. అయితే మరికొంత మంది మాత్రం సూర్యకు మద్దతుగా నిలుస్తున్నారు. ప్రస్తుతం సూర్యకు బ్యాడ్ ఫేజ్ నడుస్తుందని, కొంత ఓపిక పడితే అతడు సెట్ అవుతాడని భారీ ఇన్నింగ్స్?తో కమ్?బ్యాక్ అయ్యే ఛాన్స్ ఉందని అంటున్నారు. అయితే సూర్య ఇప్పటికైనా ఫామ్ అందుకొని పరుగులు సాధించాల్సిన అవసరం ఉంది. లేదంటే టీమ్‌ఇండియాలో అతడి స్థానం కూడా గల్లంతయ్యే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంది. ప్రస్తుత ఐపీఎల్?లో వైభవ్ సూర్యవంశీ, ప్రియాంశ్ ఆర్య లాంటి కుర్రాళ్లు రాణిస్తుండడం, శ్రేయస్ అయ్యర్ కెప్టెన్?గా ఆకట్టుకుంటుండంతో జట్టులో చోటు కోసం తీవ్ర పోటీ ఏర్పడుతుంది. అందుకే 35ఏళ్ల సూర్యను టీ20 జట్టులో కొనసాగించే ఆలోచన మేనేజ్?మెంట్? చేయదని వాదనలు వినిపిస్తున్నాయి.





## బుమ్రా కూడా మనిషే.. మరమనిషి కాదు

**ముంబై ఇండియన్స్ బౌలింగ్ కోచ్ కీరన్ పోలార్డ్**

పేలవ ఫామ్‌తో సతమతమవుతున్న ముంబై ఇండియన్స్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు ఆ జట్టు మేనేజ్‌మెంట్ అండగా నిలిచింది. బుమ్రా కూడా మనిషేనని, ఫామ్ కోల్పోవడం సహజమేనని ముంబై ఇండియన్స్ బౌలింగ్ కోచ్ కీరన్ పోలార్డ్ అన్నాడు. అతనికి ముంబై ఇండియన్స్ అండగా ఉంటుందని స్పష్టం చేశాడు.ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో బుమ్రా దారుణంగా విఫలమయ్యాడు. 4 ఓవర్లు బౌలింగ్ చేసి ఒక్క వికెట్ తీయకుండా 54 పరుగులు సమర్పించుకున్నాడు. ఇప్పటి వరకు 8 మ్యాచ్‌లు ఆడిన బుమ్రా రెండు వికెట్లు మాత్రమే తీసాడు. బుమ్రా ఐపీఎల్ కెరీర్‌లోనే ఈ సీజన్ అతనికి వరస్ట్‌గా మారిపోయింది. దాంతో అతనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న కీరన్ పొలార్డ్.. బుమ్రా వైఫల్యం గురించి మాట్లాడాడు. 'ఏ ఆటగాడైనా సరైన ప్రదర్శన చేయలేకపోతే.. వెంటనే ప్రతి చిన్న విషయాన్ని నిశితంగా పరిశీలిస్తుంటాం. సదరు ఆటగాడు ఎందుకు ఆడలేకపోతున్నాడనే దానిపై చర్చలు పెడుతుంటాం. ఇలాంటి వాటి నుంచి జస్‌ప్రీత్ బుమ్రా మినహాయింపేమీ కాదు. గత కొన్నేళ్లుగా అతను ఎలాంటి ప్రదర్శన కనబర్చాడో మనం చూశాం. బుమ్రా కూడా మనిషే కదా.. అతను కూడా తప్పులు చేస్తాడు. కాలం కలిసి రానప్పుడు గతంలో చేసిన మంచిని గుర్తు చేసుకోవాలి. బుమ్రా తన స్థాయికి తగ్గట్లు రాణించ లేకపోయాడు. అయినా.. ఇప్పటికీ అతను వరల్డ్ నంబర్‌వన్ బౌలర్. అలానే మా ముంబై ఇండియన్స్‌కు కీలక బౌలర్.

## రియాన్ పరాగ్‌కు భారీ షాకిచ్చిన బీసీసీఐ!

రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ సిగరెట్ వివాదాన్ని బీసీసీఐ తీవ్రంగా పరిగణించింది. అతడి మ్యాచ్? ఫీజులో 25శాతం కోత విధిస్తున్నట్లు పేర్కొంది. అలాగే పరాగ్ ఖాతాలో 1 డీమెరిట్ పాయింట్ కూడా చేర్చినట్లు తెలిపింది. ఈ మేరకు ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ అధికారికంగా ఓ ప్రకటన విడుదల చేసింది. పరాగ్ ఐపీఎల్ నిబంధనలు ఉల్లఘించినట్లు ఆ ప్రకటనలో పేర్కొంది.'పంజాబ్ కింగ్స్?తో మ్యాచ్?లో ఐపీఎల్ ప్రవర్తనా నియమావళి కోడ్? 2.21ను రియాన్ పరాగ్ ఉల్లంఘించాడు. దీనిని లెవెల్ 1 తప్పిదంగా భావిస్తూ అతడి మ్యాచ్? ఫీజులో 25 శాతం కోత విధిస్తూ, 1 డీమెరిట్ పాయింట్ చేర్చుతున్నాం' అని ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ పేర్కొంది. పరాగ్ కూడా? తన తప్పును అంగీకరించినట్లు తెలిసింది. అలాగే మ్యాచ్ రిఫరీ అమిత్ శర్మ విధించిన ఫైన్?ను స్వీకరించాడు. కాగా, ఇటీవల ముల్లాన్?పుర్ వేదికగా పంజాబ్ కింగ్స్?తో జరిగిన మ్యాచ్?లో రియాన్ పరాగ్ చేసిన పని వివాదాస్పదం అయ్యింది. ఈ మ్యాచ్ సెకండ్ ఇన్నింగ్స్ 16వ ఓవర్లో డ్రెస్సింగ్ రూమ్?లో కూర్చొని ఉన్న పరాగ్ ఈ సిగరెట్ (ఎలక్ట్రిక్ సిగరెట్) తాగుతూ కనిపించాడు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్?గా మారాయి. దీనిపై పెద్ద దుమారమే రేగింది. డ్రెస్సింగ్ రూమ్?లో అలాంటి పనులు చేయడంపై నెటిజన్లు సైతం పరాగ్?పై మండిపడ్డారు. ఈ వ్యవహారాన్ని సీరియస్?గా తీసుకున్న బోర్డు ఈ మేరకు చర్యలు చేపట్టింది. అయితే భారత్?లో ఈ సిగరెట్ల వాడకంపై నిషేధం ఉంది. వీటిని కేంద్ర ప్రభుత్వం 2019లోనే బ్యాన్ చేసింది. ఎలక్ట్రిక్ సిగరెట్లు, ఆ పరికరాల ఉత్పత్తి, అమ్మకం, కొనుగోలు, వాడకాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించింది. దీంతో పరాగ్?పై తీవ్ర విమర్శలు వచ్చాయి. అయితే ఈ నిబంధన ఉల్లంఘిస్తే ఎవరైనా సరే 'ప్రొహిబిషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్ సిగరెట్స్ యాక్ట్ (రాజుజూా) 2019' ప్రకారం రూ. లక్ష జరిమానాతోపాటు, జైలు శిక్ష కూడా ఎదుర్కోవాల్సి ఉంటుంది. అయితే దీనిపై రాజస్థాన్ మేనేజ్?మెంట్ నుంచి మాత్రం ఎలాంటి ప్రకటన రాలేదు. ఈ ఐపీఎల్?లో పరాగ్ పేలవంగా ఆడుతున్నాడు. ఇప్పటిదాకా ఈ సీజన్?లో పరాగ్? నుంచి భారీ ఇన్నింగ్స్ రాలేదు. ఇటీవల పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో పరాగ్ 16 బంతుల్లో 29 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్?కు చేరాడు. ఈ సీజన్?లో పరాగ్?కు అత్యధిక స్కోర్ ఇదే. ఇక ఇప్పటిదాకా ఈ సీజన్?లో 9 మ్యాచ్‌ల్లో అతడు కేవలం 117 పరుగులే చేశాడు.రాజస్థాన్ రాయల్స్ ప్రదర్శన విషయానికొస్తే,ఆ జట్టు ఇప్పటిదాకా 9 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో 6 మ్యాచ్?ల్లో విజయం సాధించగా, మూడింట్లో ఓడింది. ప్రస్తుతం 12 పాయింట్ల (0.617 నెట్? రన్?రేట్)తో టేబుల్?లో నాలుగో స్థానంలో కొనసాగుతోంది.

# విశ్వాజి



## తప్పు చేయకండి.. ఎండలో అవి అవసరాలు కాదు.. అనర్థాలు!

ఎండాకాలం వచ్చిందంటే చర్మానికీ, శరీరానికీ అవసరాలు మారతాయి. దానికి తగ్గట్టు కొన్ని విషయాల్లో మనమూ మారతాం. అక్కడే తప్పు చేసే అవకాశం ఉంది. ఇవి అవసరాలు కాదు,అనర్థాలు అంటున్నారు చర్మ, ఆరోగ్య నిపుణులు.
ఇంట్లో అక్కర్లేదు.. సన్‌స్క్రీన్ బయటికెళ్లేప్పుడు మాత్రమే రాసుకోవాలి. ఇంట్లో ఉన్నా, కారులో వెళ్తున్నా అక్కర్లేదు అనుకోవడం అపోహ మాత్రమే. మనం ఎక్కడ ఉన్నా మన చుట్టూ ఉండే వెలుతురులో చర్మానికి హాని చేసే అతినీల లోహిత కిరణాలు ఉంటాయి. కాబట్టి తప్పకుండా ఈ సమయంలో సన్‌స్క్రీన్ వాడాలి.
కడుగుతూనే ఉండాలి... ఎండాకాలం వచ్చిందంటే అదేదో యాడ్‌లో 'కడుగు బాబు కడుగు' అన్నట్టు మొహాన్ని మాటి మాటికీ నీళ్లతో కడుగుతుంటారు. ఇది ఎండవేళ చర్మానికి హాయిని కలిగించి, తేమగా ఉంచుతుందని అనుకుంటారు. కానీ ఇది నిజం కాదు. ఇలా మాటిమాటికీ నీటితో చర్మాన్ని కడగడం వల్ల 'ట్రాన్స్ ఎపిడెర్మల్ వాటర్ లాస్ (టీఈడబ్ల్యూఎల్)' అని పిలిచే ప్రత్యేక పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో చర్మం తేమను కోల్పోయి పొడిబారుతుంది. అదైతే చాలు.. వేసవిలో ఏ వీధి మూలన చూసినా మజ్జిగ, పుదీనా రసం కుండలు, జీరా నీళ్లు, నిమ్మరసాలు దొరుకుతుంటాయి. ఎండవేళ చలువ చేస్తాయన్న ఉద్దేశంతో వాటిని స్వేచ్ఛగా తాగుతుంటారు. కానీ, ఇలా బయట దొరికేవి తాగేప్పుడు అక్కడ ఎంత పరిశుభ్రత పాటిస్తున్నారు, ఎలాంటి నీళ్లు వాడుతున్నారులాంటివి గమనించాలి. లేకపోతే పొట్టకు లేనిపోని తంటా తెచ్చినట్టే. అన్నీ తాగొచ్చు.. ఎండవేళ శరీరంలో నీటి స్థాయుల్ని నిలిపి ఉంచేందుకు ద్రవాలు ఎక్కువగా తీసుకోవాలి. కాబట్టి మంచీ చెడులతో సంబంధం లేకుండా ఏమైనా తాగొచ్చు అనుకోవడం పొరపాటు. కేవలం మజ్జిగ, కొబ్బరినీళ్లలాంటి సంప్రదాయ ఆరోగ్యకర పానీయాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. మిల్క్‌షేక్‌లు, శీతల పానీయాల్లాంటి హై క్యాలరీ డ్రింకులను ఏ కాలంలో అయినా పక్కన పెట్టేయాల్సిందే.

# ఎదుర్కోడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి



'కోరుకున్న రంగంలో రాణించాలంటే మనలో ఒక తపన ఉండాలి. ఒక తపస్సులా ఆ రంగాన్ని స్వీకరించాలి. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఎదుర్కోడానికి సిద్ధంగా ఉండాలి' అంటారు. ఐదు పదుల వయసు దాటిన విపుల్ వర్షిణే. లక్నోవాసి అయిన విపుల్ వర్షిణే ముప్ఫైఏళ్లుగా ఆర్కిటెక్చర్ రంగంలో తనదైన ముద్ర వేస్తూ, గుర్తింపు పొందారు. ఒక్కరూ తన మాట వినడం లేదు అనే నిరాశ నుంచి రెండు విమానాశ్రయాల రూపకల్పన చేసేంత స్థాయికి ఎదిగారు. విపుల్ వర్షిణే తనను తాను శక్తిగా మలుచుకున్న విధానం నేటి మహిళలకు స్ఫూర్తిని కలిగిస్తుంది. 'నా పేరు విపుల్ అనే ఉండటంతో మగ ఆర్కిటెక్ట్ అనుకుని, సంప్రదించేవారు. నేను మహిళను అని తెలిసి వర్క్ ఇవ్వడానికి వెనకడుగు వేసేవారు. ఇప్పుడు ఈ పరిస్థితుల్లో కొంతమార్పు చూస్తున్నాను కానీ, 30 ఏళ్ల క్రితం నేను ఆర్కిటెక్ట్ అని చెబితే చాలామంది ఆశ్చర్యపోయేవారు. ఇప్పుడు నేను రెండు విమానాశ్రయాలను డిజైన్ చేసే స్థాయికి ఎదిగాక ఈ రంగంలో అమ్మాయిలూ రాణించగలరు అనే స్పష్టత వచ్చింది. ఈ విషయాన్ని నిరూపించడానికి నేను చేసిన ప్రయత్నం ఆషామాషీ కాదు. సృజనతో అడుగు... పుట్టి, పెరిగింది లక్నోలో. స్కూల్ ఏజ్ నుంచి పెయిం టింగ్స్ వేయడం, కార్టూన్స్ గీయడం వంటివి చూసి వాటిని పత్రికలకు పంపించే వారు నాన్న. మొదట నేను మెడిసిన్ చదవాలని కోరుకున్న మా నాన్న నాలోని సృజనాత్మకత చూసి ఆర్కిటెక్ట్ ఇంజినీరింగ్ చేయమని సలహా ఇచ్చారు. ఎందుకంటే ఆర్కిటెక్చర్ సైన్స్, సృజనాత్మకతల సమ్మేళనంగా ఉంటుంది. మా నాన్న మనసులో నేను గవర్నమెంట్ ఉద్యోగం చేయాలని, అది నాకు సురక్షితమైనదని భావించేవారు. నేను ఎంచుకున్న రంగం చాలా శ్రమతో కూడుకున్నదని ఆయనకు తెలియదు. అప్పట్లో కంప్యూటర్లు లేవు కాబట్టి రాత్రంతా డ్రాయింగ్ బోర్డ్ పైనే పని చేయాల్సి వచ్చేది. ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు.. "నేను ఆర్కిటెక్చరల్ ఇంజినీరింగ్ చదువుతున్నప్పుడు మా క్లాస్‌లో ముగ్గురం మాత్రమే అమ్మాయిలం. ఈ వృత్తిలో అబ్బాయిలదే అధిపత్యమని అప్పుడు అర్థమైంది. కాలేజీలో చదివే సమయంలోనే పెళ్లి అయ్యింది. మావారు సివిల్ ఇంజనీర్ కాబట్టి పెళ్లయ్యాక ఆయనతోనే కెరీర్‌ప్రారంభించాను. భవనాలు కట్టే లొకేషన్‌కు వెళ్లేటప్పుడు నాతో మాట్లాడేందుకు కూలీలు తడబడేవారు. మేస్త్రీలు నా మాటలను అస్సలు పట్టించుకునేవారు కాదు. ఒక మహిళ యజమానిగా మారడం వారెవరికీ ఇష్టం ఉండదని అప్పుడు అర్థమైంది. అసలు నన్ను వారు నిర్మాణశిల్పిగా అంగీకరించలేదు. నిరాశగా అనిపించేది. కానీ, నా డిజైన్ ప్రకారమే పనిచేయాల్సి ఉంటుందని నా నిర్ణయాన్ని సున్నితంగానూ, అంతే కచ్చితంగానూ తెలియజేశాను. అక్కడ నుంచి ఆర్కిటెక్ట్‌గా ఎదగడానికి నన్ను నేను మార్చుకుంటూ వెళ్లాల్సి వచ్చింది. ఆఫీస్‌లో నాకు, నా భర్తకు విడివిడిగా క్యాబిన్లు ఉండేవి. క్లయింట్స్ వచ్చినప్పుడల్లా నా సలహా తీసుకోవాలని నా భర్త తరచూ వారికి చెప్పాల్సి వచ్చేది. తీసుకున్నప్రాజెక్ట్ పూర్తి చేయడం పట్ల పూర్తి శ్రద్ధ పెట్టేదాన్ని. కానీ వచ్చిన వాళ్లు మాత్రం 'మిస్టర్ విపుల్ వర్షిణే ఎప్పుడు వస్తారు' అని అడిగేవారు. నేనే విపుల్ అని, ఆర్కిటెక్ట్ అని తెలిసి ఆశ్చర్యపోయేవారు. 200 భవనాల జాబితా.. భవన నిర్మాణంలో నా వర్క్‌ని కొనసాగిస్తూనే లక్నోలోని చారిత్రక కట్టడాలపై, వాటి పరిరక్షణ గురించిప్రాజెక్ట్ వర్క్ చేశాను. అక్కడి వారసత్వ కట్టడాల పట్ల ఎలాంటి జాగ్రత్తలూ తీసుకోవడం లేదని తెలుసుకొని దాదాపు 200 భవనాల జాబితాను తయారు చేశాను. ఆ జాబితాను పురావస్తు శాఖకు అప్పగించాను. ఆ సమయంలోనే 500 పేజీల ఆప్రాజెక్ట్ వర్క్‌ని పుస్తకంగా తీసుకువస్తే ప్రయోజనకరంగా ఉంటుందన్న సన్నిహితుల సలహాతో బుక్‌గా తీసుకువచ్చాను. అలా రచనా ప్రపంచంలోకి అడుగుపెట్టాను. ఇప్పటి వరకు మన దేశ వారసత్వ సంపదపైన ముఖ్యంగా లక్నో సంస్కృతి, వారసత్వ నగరం, చరిత్ర ద్వారా నడక, మ్యూజింగ్స్ ఇన్ బెనారస్, ఎ కెలిడోస్కోప్ ఆఫ్ ది హార్ట్, లక్నో ఎ ట్రెజర్ పేర్లతో 5 పుస్తకాలు ప్రచురిత మయ్యాయి. ఇటీవలే అయోధ్యకు సంబంధించి ఎ వాక్ త్రూ ది లివింగ్ హెరిటేజ్ ప్రచురితమైంది. 'షామ్ ఎ అవద్ పుస్తకంలో లక్నో సంస్కృతిపై స్కెచ్‌లు కూడా వేశాను. లక్నోలోని చికంకారీ ఎంబ్రాయిడరీ, ఈ నగరంలోని వీధులు, మార్కెట్ల గురించి ప్రస్తావించాను. లక్నో ఇన్‌టాక్‌కి కన్వీనర్‌గా ఉన్నాను. లేహ్ విమానాశ్రయం .. ఓ సవాల్! 2018లో లేహ్ ఎయిర్‌పోర్ట్ డిజైన్ చేసే అవకాశం వచ్చింది. ఈప్రాజెక్ట్ నాకు అత్యంత సవాల్‌గా ఉండేది. ఎందుకంటే అక్కడ భూమి, పర్యావరణం చాలా భిన్నంగా ఉంటాయి. పర్వతాల కారణంగా భూభాగం చాలా తేడాగా ఉంటుంది. విమానాశ్రయం అరైవల్, డిపార్చర్ లాంజ్‌ల మధ్య 3 అంతస్తుల వ్యత్యాసం ఉంది. అక్కడ లగేజీ బెల్ట్ రివర్స్ చేయాల్సి వచ్చింది. ఉష్ణోగ్రత చాలా తక్కువ కాబట్టి, ఎయిర్ కండీషనర్లలో ఉపయోగించే ద్రవం ఘనీభవన స్థానం కంటే తక్కువగా ఉంది. అలాంటప్పుడు ప్రత్యేక రసాయనాలను ఉపయోగించి, దానిని ఏర్పాటు చేశాను. లేహ్‌లో అనేక బౌద్ధ విహారాలు ఉన్నాయి. ప్రవేశం ద్వారం వద్ద 30 అడుగుల ఎత్తైన బుద్ధుని విగ్రహాన్ని ఉంచాను. అక్కడి స్థానిక సంస్కృతి, కళ, హస్తకళలను దృష్టిలో ఉంచుకుని రంగు రంగుల వలలు,ప్రార్థన చక్రాలను ఏర్పాటు చేయించాను. అయోధ్య విమానాశ్రయం పనిప్రారంభించినప్పుడు అక్కడ మహంతులు, సాధువులను కలుస్తూ ఉండేదాన్ని. ఎందుకంటే అక్కడి నిర్మాణాన్ని బాగా అర్థం చేసుకోవాలి, సరైన సమాచారం కోసం చాలా పుస్తకాలు చదివాను. వివిధ వృత్తులలో ఉన్న వ్యక్తులతో మాట్లాడాను. దీంతో అయోధ్యపై నాకు ఆసక్తి పెరుగుతూ వచ్చింది. ఆ తర్వాత దానినే పుస్తకంగా తీసుకు వచ్చాను. ఒక సృజనాత్మక వ్యాపకం నన్నూ నా దిశను మార్చింది. సవాల్‌గా ఉన్న రంగంలో సమున్నతంగా నిలబడేలా చేసింది. ఏ రంగం ఎంచుకున్నా అందులో మనదైన ముద్ర తప్పక వేయాలి. అప్పుడే, ఎక్కడ ఉన్నా సరైన గుర్తింపు లభిస్తుంది' అని వివరిస్తారు విపుల్ వర్షిణే.

# విజయాలకు తను ఒక 'ల్యాండ్ మార్క్'..



సంపన్న కుటుంబ నేపథ్యం లేని మిక్కీ జగ్తియాని 'ల్యాండ్‌మార్క్'తో ఒక్కోమెట్టు ఎక్కుతూ ప్రపంచ కుబేరుల సరసన నిలిచాడు. భర్త అడుగు జాడల్లో నడిచి వ్యాపార నైపుణ్యాన్ని సొంతం చేసుకున్న రేణుకా జగ్తియాని 'ల్యాండ్ మార్క్'కు తనదైన మార్క్ జోడించి ఆ వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరించింది. తాజాగా.. ఫోర్బ్స్ న్యూ బిలియనీర్స్ 2024 జాబితాలో చోటు సాధించింది.రేణుకా జగ్తియాని నేతృత్వంలోని దుబాయ్ చెందిన రిటైలింగ్ దిగ్గజం 'ల్యాండ్‌మార్క్' 21 దేశాలలో పాదరక్షల నుంచి గృహోపకరణ వస్తువుల వరకు వివిధ బ్రాండ్‌లతో విజయపథంలో దూసుకుపోతుంది. హాస్పిటాలిటీ బిజినెస్‌లో కూడా గెలుపు జెండా ఎగరేసింది. ఎప్పటికప్పుడు కొత్త ప్రణాళికలతో ముందుకువెళ్లే రేణుక మిడిల్ ఈస్ట్, ఇండియా, ఆగ్నేయాసియాలోని కీలక మార్కెట్‌లలో రాబోయే కాలంలో వందలాది స్టోర్‌లను ప్రారంభించాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఎలాంటి వ్యాపార అనుభవం లేని రేణుక 1993లో ల్యాండ్‌మార్క్ గ్రూప్‌లోకి అడుగు పెట్టింది. 'ఇది సాధ్యమా!' అనుకునే వాళ్లు సందేహాల దగ్గరే తచ్చాడుతారు. 'కచిత్చంగా సాధ్యమే' అనుకునే వాళ్లు ముందుకు దూసుకుపోతారు. రేణుక రెండోకోవకు చెందిన మహిళ. వేగంగా వ్యాపార నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవడమే కాదు ఫాస్ట్-ఫ్యాషన్ బిజినెస్ 'స్ప్లాష్'తో తనదైన ముద్ర వేసింది. 'స్ప్లాష్' పదకొండు దేశాలలో 200 స్టోర్స్ వరకు విస్తరించింది. మన దేశంలో 1999లో లైఫ్‌స్టైల్, హోమ్ సెంటర్ అండ్ మాక్స్‌లాంటి అయిదు ఫార్మట్స్‌లో ప్రస్థానం ప్రారంభించి 900 స్టోర్స్‌లో విస్తరించింది ల్యాండ్‌మార్క్. 2017లో రేణుక ల్యాండ్ మార్క్ గ్రూప్ చైర్‌పర్సన్, సీయీవోగా బాధ్యతలు స్వీకరించింది. రేణుక భర్త మిక్కీ జగ్తియాని సౌత్ ఆఫ్రికా ఇమిగ్రెంట్స్‌ను దృష్టిలో పెట్టుకొని బహ్రెయిన్‌లో బేబీ ?ొడక్ట్స్ స్టోర్‌ను మొదలుపెట్టాడు. అక్కడినుంచిప్రారంభమైన బుడి బుడి అడుగుల వ్యాపారం 'ల్యాండ్‌మార్క్' రూపంలోఎక్కడికో వెళ్లింది. భర్త నిర్మించిన వ్యాపార సామ్రాజ్యాన్ని చెక్కుచెదరకుండా నిలబెట్టడం అంత సులువు కాదు. కాని ఎక్కడా రేణుక వెనకడుగు వేయలేదు. అయితే ప్రపంచంలోని ఎన్నో కంపెనీలపై పడినట్లే కోవిడ్ సంక్షోభ ప్రభావం 'ల్యాండ్‌మార్క్' పై పడింది. రెండు నెలలకు పైగా స్టోర్స్ అన్నీ క్లోజ్ అయిపోయాయి. ఆ తరువాత మెల్లమెల్లగా కొత్త గైడ్‌లైన్స్‌తో తెరుచుకోవడం మొదలైంది. 'విపత్కరమైన పరిస్థితుల్లో ఆపరేషనల్‌ప్రాసెస్‌లో ర్యాపిడ్ చేంజెస్ చేశాము. ఉద్యోగుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాం. క్వారంటైన్‌లో ఉన్న ఉద్యోగులు లేదా వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సహాయం అందించాం, వారిలో ధైర్యం నింపాం. ఆఫీస్, స్టోర్ ఉద్యోగుల కోసం ప్రత్యేక వసతి ఏర్పాటు చేశాం. ఉద్యోగుల కోసమే కాదు కోవిడ్ బాధితుల కోసం మా ఫౌండేషన్ తరపున ఎన్నోరకాల సేవాకార్యక్రమాలు చేపట్టాం' అంటూ ఆ రోజులను గుర్తు తెచ్చుకుంటుంది రేణుక. రేణుక జగ్తియాని భర్త మిక్కీ జగ్తియాని 71 సంవత్సరాల వయసులో చనిపోయారు. కొన్ని సంవత్సరాల క్రితం ఒక రిపోర్టర్ ఆయనను 'మీ నెక్స్ ?్లన్ ఏమిటి?' అని అడిగాడు. దీనికి మిక్కీ జగ్తియాని చెప్పిన జవాబు.. 'నా గురించి నేను పూర్తిగా తెలుసుకోవడానికి ఎక్కువ సమయం గడపాలనుకుంటున్నాను. వ్యాపార సంబంధిత విషయాల గురించి కాకుండా నేనెవరిని? జీవితపరమార్థం ఏమిటి? లాంటి విషయాల గురించి ఆలోచిస్తుంటాను. వ్యాపార లాభాలే కాదు జీవితానికి సంబంధించిన ఎన్నో అంశాలలో ఆనందం దొరుకుతుంది' భర్త అడుగుజాడల్లో నడిచి, వ్యాపార నైపుణ్యాన్నే కాదు సేవాదృక్పథాన్ని సొంతం చేసుకున్న రేణుకా జగ్తియాని వ్యాపారంతో పాటు సేవాకార్యక్రమాలకు కూడాప్రాధాన్యత ఇస్తోంది. భర్త అడుగుజాడల్లో నడిచి, వ్యాపారనైపుణ్యాన్నే కాదు సేవాదృక్పథాన్ని సొంతం చేసుకున్న రేణుకా జగ్తియాని వ్యాపారంతోపాటు సేవా కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇస్తోంది.


# 'నిద్రాయోగం'! శారీరక ఆరోగ్యంపై నిద్ర ముద్ర ఇది..



అనేక యోగ ముద్రలు ఉన్నట్లే, 'యోగ నిద్ర' కూడా ఉంది. నిద్ర కూడా ఒక యోగమే." నిద్ర పట్టడం ఒక యోగం, బాగా నిద్రపోవడం ఒక భోగం, నిద్ర పట్టకపోవడం ఒక రోగం" అని చెప్పవచ్చు. ముఖ్యంగా మారిన పని సంస్కృతి (వర్క్ కల్చర్), వివిధ ఒత్తిళ్ల నేపథ్యంలో నిద్ర కొంతమందికి వరంగా, ఎక్కువమందికి శాపంగా మారి కొత్త కొత్త ఆరోగ్య సమస్యలు పుట్టుకొస్తున్నాయని మానసిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కొందరికి నిద్ర ఎక్కువ కావడం, కొందరికి తగ్గిపోవడం ఈ మధ్యకాలంలో వచ్చిన ముఖ్య పరిణామంగా పరిశీలకులు భావిస్తున్నారు. మన జీవన గమనంపై, మానసిక, శారీరక ఆరోగ్యంపై నిద్ర వేసే ముద్ర చాలా గొప్పది. "కంటికి నిద్ర వచ్చునే? సుఖంబగునే రతికేళి?" అంటాడు శ్రీనాథ కవి సార్వభౌముడు ఒక సందర్భంలో. "మత్తు వదలరా నిద్దుర మత్తు వదలరా" అన్నాడు ఆధునిక కవి కొసరాజు రాఘవయ్య చౌదరి. ఇలా నిద్ర చుట్టూ అనేక మాటలు, చర్చలు, సిద్ధాంతాలు పుట్టుకొచ్చాయి. 'నిద్ర' శరీరానికి సంబంధించిన ఒక విశ్రాంత స్థితిగా చెప్పినప్పటికీ, అది మనసుకు, మెదడుకు కూడా వర్తిస్తుందని చెప్పాలి. శరీరానికి విశ్రాంతి ఎంత అవసరమో, మెదడుకు కూడా అంతే అవసరం. అవయవాల అలసట తీర్చి, తిరిగి రెట్టింపు శక్తితో దైనందిన కార్యక్రమాలను చేపట్టడంలో నిద్ర పోషించే పాత్ర చాలా కీలకమైంది. మానవ జీవితంలో నిద్ర ప్రాథమిక అవసరమని, అది పౌరుల ప్రాథమిక హక్కు, అని సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేసింది. నిద్ర, నిశ్శబ్దం, విశ్రాంతి ఆరోగ్య రీత్యా మానవులకు తప్పనిసరి అవసరమని, నిశ్శబ్దం బంగారం లాంటిదని న్యాయస్థానాలు సైతం వ్యాఖ్యానించాయి. నిద్రపై అనేక పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం జరిపిన పరిశోధనల పరంగా చూస్తే, రోజుకు 8 గంటల కంటే తక్కువ నిద్ర పోయే వారిలో శారీరక సామర్థ్యం తక్కువగా ఉంటుందని అర్థం చేసుకోవాలి. ప్రతి సంవత్సరం మార్చి నెల మూడో శుక్రవారం నాడు 'ప్రపంచ నిద్ర దినోత్సవం' కూడా జరుపుకుంటున్నారు. సాధారణంగా పెద్దవాళ్ల కంటే చిన్నపిల్లలకు ఎక్కువ నిద్ర ఎంతో అవసరం. ఇది వారి శారీరక పెరుగుదలలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. నెలబాలుడు నుంచి వృద్ధుడి వరకూ నిద్ర పోవాల్సిన సగటు సమయంపై అనేక పట్టికలు విడుదలయ్యాయి. కానీ, పాటిస్తున్న వారిసంఖ్య పరిమితం మాత్రమే. ముఖ్యంగా, ఆధునిక జీవనశైలి నిద్రపై పెను ప్రభావాలను చూపిస్తోంది. నిద్రకు సంబంధమైన అంశాల్లో ఆహారం పాత్ర ఎంతో కీలకం. మెలటోనిన్ స్థాయిల్ని పెంచే ఆహారం వల్ల గాఢ నిద్ర పడుతుందని ఆస్టన్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు తాజాగా విడుదల చేసిన నివేదికలో వివరిస్తున్నారు. మన ఆలోచనా విధానంతో పాటు మనం తీసుకొనే ఆహార, పానీయాల బట్టి కూడా నిద్ర ఆధారపడుతుందని కొందరు శాస్త్రవేత్తలు నమ్ముతుంటారు. ఈ అంశం ఇంకా శాస్త్రీయంగా రుజువు కావాల్సిన అవసరం ఉంది. మెలటోనిన్ అనేది ఒక హార్మోన్. మనం తీసుకొనే ఆహారం.. నిద్రకు అత్యంత అవసరమైన మెలటోనిన్‌ను అనుకూలంగా, లేదంటే ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. దానికి అనుగుణంగా నిద్ర తీరు మారిపోతుంది. అమైనో ఆమ్లం(ట్రిప్టోఫాన్) ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల మెలటోనిన్ హార్మోన్ స్థాయిలు బాగా పెరుగుతాయి. తద్వారా నిద్ర బాగా పడుతుంది. విటమిన్-డి, మెగ్నీషియం, జింక్ ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు మంచి నిద్రకు ప్రేరకాలుగా నిలుస్తాయి. చేపలు, కివీ పండు, టార్ట్ చెర్రీలు నిద్ర పట్టడానికి ఎంతో ఉపయోగపడతాయి. పడుకునే ముందు గ్లాసు వేడి పాలు తాగితే మంచి నిద్ర పడుతుంది. ఇలా నిద్రకు - ఆహార, పానీయాలకు ఉండే సంబంధాలను నిపుణులు వివరిస్తున్నారు. నిద్రను - మత్తును వేరు వేరుగా చూడమంటున్నారు. (గుండెలు పిండే విషాదం : మరణానికి ఏర్పాట్లు చేసుకుంటున్న స్టార్ యాక్టర్) మద్యపానం వల్ల మెదడు చైతన్య రహితంగా మారి మత్తుగా అనిపిస్తుంది.అది మత్తే కానీ, నిద్ర కాదని వైద్యులు అంటున్నారు. నిద్ర విషయంలో నిర్దిష్ట సమయాలను పాటించడం కూడా ఎంతో ముఖ్యమని చెబుతున్నారు. నేటి కాలంలో, పెరిగిన వృత్తుల వైవిధ్యం, వేళల నేపథ్యంలో సమయపాలన పాటించడం అందరికీ సాధ్యపడదు. వారి వారి వీలునుబట్టి నిద్ర వేళల విషయంలో క్రమశిక్షణను అనుసరించాల్సి ఉంటుంది. ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్స్ నుంచి వచ్చే వెలుగులు కూడా హానికరం అని అంటున్నారు. నిద్రకు ఉపక్రమించే ముందు, పడక గదులలో వీటికి దూరంగా ఉండమని నిపుణులు చేసే సూచనలను గౌరవిస్తే మంచిది. వ్యాయామం, నడక, శారీరక శ్రమ, యోగాభ్యాసం, ధ్యానం, ప్రాణాయామం నిత్యం సాధన చేయడం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందని చెబుతున్నారు. సంగీతం వినడం, పుస్తకాలు చదవడం, మెదడుకు మేత వేసే పనులు చేయడం కూడా నిద్రపై మంచి ప్రభావాన్ని చూపిస్తాయని తరచూ మనం వింటున్నాం. రోగ నిరోధక శక్తిని పెంచుకోవడం ఎంత ముఖ్యమో ఈ కరోనా కాలంలో బాగా ప్రచారంలో ఉంది. నిద్ర అందుకు ఎంతో ఉపయోగపడుతుంది. నాడీ వ్యవస్థ సక్రమంగా పనిచేయాలన్నా, మంచి నిద్ర అవసరం. నిద్ర తగ్గితే కాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. 'నిద్ర ఒక చిత్తవృత్తి'గా పతంజలి యోగ సూత్రాలు చెబుతున్నాయి. ఆహారంతో పాటు మనసును అదుపులో ఉంచుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన నిద్రకు శరీరం అలవాటు పడుతుందని యోగాచార్యులు సూచిస్తున్నారు. నిద్ర ఎంతసేపు పొయ్యామన్నదాని కంటే? ఎంత బాగా నిద్ర పోయామన్నదే ముఖ్యం. 'నిద్రించడం' ఒక కళగా భావిస్తే అన్నీ సర్దుకుంటాయి. యోగం, భోగం, ఆరోగ్యం అన్నీ కలిసి వస్తాయి.

## ఇలా మాత్రం 'చెవి'ని శుభ్రం చేయకండి..

పెరుగుతున్న కాలుష్యానికి ఆరోగ్య సమస?్యలు కూడా అధికమవుతున్నాయి. మనకు తెలియకుండానే రోగాల బారిన పడుతున్నాం. ఈ కాలుష్యానకి చెవి, ముక?్కు, కంటి సమస్యలు నిత్యం వెంటాడుతున్నాయి. చెవి విషయానికొస్తే, చిన్న పిల?్లల్లోనే కాకుండా పెద్దవారిలోనూ వినికిడి లోపం పెరుగుతంది. వాటికి కారణాలు కూడా చాలా ఉన్నాయి. మరి చెవిని కాపాడడంలో.. చేయాల్సిన జాగ్రత్తలను చూద్దాం.
చెవులను రక్షించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలివి..
పల్లెటూళ్లలో వేసవి సెలవులు రాగానే ఈత నేర్చుకోవడం కోసం పిల్లలు నీటి కుంటలు, చెరువులకు వెళ్తుంటారు. చెరువుల్లోని మురికి నీరు చెవుల్లోకి చేరి ఇన్ఫెక్షన్లు రావచ్చు. అందువల్ల ఈత నేర్చుకోవాలనుకునే పిల్లలు పరిశుభ్రమైన నీళ్లలోనే దిగాలి. చెవులను శుభ్రం చేయడానికి కొందరు గోరువెచ్చగా కాచిన కొబ్బరి నూనె, ఆముదం చెవుల్లో పోస్తారు. ఇలా ఎట్టిపరిస్థితుల్లోనూ చేయకూడదు. అపరిశుభ్రమైన నీటితో తయారు చేసే ఐస్‌క్రీముల వంటివాటితో గొంతుకు సంబంధించిన ఇన్ఫెక్షన్లు వస్తాయి. అవే ఇన్ఫెక్షన్లు చెవులకూ సోకే ప్రమాదం ఉంది. కాబట్టి చెవి, గొంతు, ముక్కు.. భాగాల్లో ఎక్కడ ఇన్ఫెక్షన్ కనిపించినా నిర్లక్ష్యం చేయకూడదు. ముఖ్యంగా పిల్లల విషయంలో ఈ జాగ్రత్తను మరింతగా పాటించాలి. పై జాగ్రత్తలు పాటించాక కూడా.. గులివి, చీము వంటి సమమస్యలతో పాటు.. చెవిపోటు ఎక్కువగా వస్తున్నా, సరిగా వినిపించకపోయినా.. వీలైనంత త్వరగా ఈఎన్‌టీ వైద్యనిపుణులను సంప్రదించాలి.



# ఆంధ్రప్రదేశ్

## కూటమిని కూల్చేదాకా నిద్రపోను

### అంబటి రాంబాబు ప్రకటన

కడప,ఏప్రిల్30 : సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో మాజీ మంత్రి అంబటి రాంబాబు కడప జిల్లా వేంపల్లి పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. సీఐ నరసింహులు ఆయన్ను విచారించారు. తెదేపా మండల కన్వీనర్ రామమునిరెడ్డి ఫిర్యాదు మేరకు ఫిబ్రవరి 1న పోలీసులు అంబటిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. విచారణ అనంతరం అంబటి రాంబాబు పులివెందుల బయలుదేరారు. తప్పుడు వాగ్దానాలతో రాష్ట్ర ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వాన్ని కూలదోసే దాకా తగ్గేదే లేదని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు. తనపై బనాయించిన అక్రమ కేసుల విచారణలో భాగంగా గురువారం ఆయన జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన కూటమి తీరుపై మండిపడ్డారు. తొలుత గండి వీరాంజనేయ దేవస్థానానికి వెళ్లిన అంబటి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇడుపుల పాయలోని వైఎస్సార్‌ఘాట్‌ను సందర్శించి మహానేత రాజశేఖర్‌రెడ్డికి పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా.. రాష్ట్ర ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలోనే కూలుస్తామని ఆయన ప్రతిజ్ఞ చేశారు. వైఎస్ జగన్‌ను మళ్లీ అధికారంలోకి తెచ్చే వరకూ అలుపెరగని పోరాటం చేస్తామని.. ఈ పోరాటంలో ఎన్ని కుట్రలు, దాడులు, కేసులు, జైళ్లు ఎదురైనా ధైర్యంగా పోరాడతామని.. వైఎస్సార్ సాక్షిగా ఇదే నా ప్రతిజ్ఞ అని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ అంబటి రాంబాబుపై అక్రమ కేసు బనాయించింది కూటమి ప్రభుత్వం. ఈ వ్యవహారంలో అంబటి తన వ్యాఖ్యలకు వివరణ ఇచ్చుకుని క్షమాపణలు కూడా చెప్పారు. అయినా కూడా వినకుండా టీడీపీ గూండాలు ఆయన ఇల్లు, ఆఫీస్‌పై దాడి చేసి విధ్వంసం సృష్టించాయి. ఈ కేసులో ఎవరినీ అరెస్ట్ చేయకపోగా.. టీడీపీ నేతల ఫిర్యాదు నేపథ్యంతో అంబటిపైనే కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారు. రెండువారాల పాటు రాజమండ్రి జైల్లో ఉన్న ఆయన బెయిల్‌పై విడుదలయ్యారు. అప్పటి నుంచి దాడి చేసిన వాళ్లపై, కస్టడీలో తనను టార్చర్ చేసిన పోలీసు అధికారులపై చర్యలు కోరుతూ ధర్మ పోరాటం చేస్తున్నారు. అయితే ఇప్పుడు ఈ కేసుల విచారణలో భాగంగా.. వేంపల్లి, పులివెందుల పోలీస్ స్టేషన్లలో విచారణకు అంబటి హాజరయ్యారు.

## కారంపూడి నగల దోపిడీ

### పోలీసుల అదుపులో నలుగురు నిందితులు

ల్నాడు,ఏప్రిల్30 : కారంపూడిలో పట్టపగలే దాడి చేసి బంగారు నగలు చోరీ చేసిన కేసులో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఏప్రిల్ 27న మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో బంగారు నగలు దుకాణాలకు అందించేందుకు వినుకొండకు చెందిన యక్కల శ్రీనివాసరావు కారంపూడి వచ్చారు. అతడిపై నలుగురు వ్యక్తులు దాడి చేసి రూ.కోటి విలువ చేసే ఆభరణాల సంచిని లాక్కెళ్లిన విషయం తెలిసిందే. ఎస్పీ కృష్ణారావు ఆదేశాలతో ఐదు బృందాలను నియమించి విచారణ చేపట్టారు. వినుకొండలో శ్రీనివాసరావు ఇంటి నుంచి బయలుదేరిన దగ్గర నుంచి చోరీ జరిగి, దుండగులు పారిపోయే మార్గాల్లో సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఘటన జరిగిన ముందురోజు నిందితులు కారంపూడిలోని పలు ప్రాంతాల్ని పరిశీలించినట్లు సీసీ ఫుటేజీలో గుర్తించారు. నిందితుల్లో ఒకరు గాంధీబొమ్మ సెంటర్లోని ఓ దుకాణంలో శీతల పానీయం తాగి ఫోన్‌పే చేశాడు. అతడి ఫోన్ నంబరు ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. వీరికి వినుకొండ, కారంపూడి, పిడుగురాళ్లలో కొందరు సహకరించినట్లు గుర్తించి, వారి వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది. సాంకేతికత ఆధారాలతో నిందితుల్ని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

## రామాలయ నిర్మాణంపై పిటిషన్లు ఉపసంహరణ

అమరావతి,ఏప్రిల్30 : పశ్చిమగోదావరి జిల్లాలోని ఆకివీడు రామాలయం నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లను వెనక్కి తీసుకున్నారు. ఏపీ హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. ఆలయ నిర్మాణాన్ని నిలిపివేయాలంటూ వేసిన పిటిషన్లను పిటిషనర్లు ఉపసంహరించుకున్నారు. రామాలయం నిర్మాణానికి అన్ని అనుమతులు ఉన్నాయని ప్రభుత్వ తరఫు న్యాయవాదులు కోర్టుకు వివరించారు. రామాలయం ఎ÷-లాన్‌తో పాటు ఆర్డీవో, ఎమ్ఆర్వో ఇచ్చిన అనుమతుల వివరాలను తెలిపారు. దీంతో 'రామాలయం నిర్మాణం చేసుకోవచ్చు కదా' అని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈ దశలో పిటిషనర్ల తరఫు న్యాయవాది జడ శ్రవణ్ మాట్లాడుతూ.. 'పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని' తెలిపారు. అయితే ఎ-లాన్‌ను సవాల్ చేస్తామని స్పష్టం చేశారు. పిటిషన్ ఉపసంహరణకు అనుమతి ఇవ్వాలని కోరగా.. అందుకు హైకోర్టు అనుమతి ఇచ్చింది.

## రాష్ట్ర సంక్షేమం కోసం రాజశ్యామల యాగం

### సొంతూరులో యాగం నిర్వహణపై మంత్రి పార్థసారథి

అమరావతి,ఏప్రిల్30 : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని మంత్రి కొలుసు పార్థసారథి రాజశ్యామల యాగం నిర్వహించారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పేర్లపై ప్రత్యేకంగా ఈ యాగాన్ని చేశారు. కృష్ణా జిల్లా పామర్రు నియోజకవర్గంలోని తన సొంత గ్రామమైన కారకంపాడులో రాజశ్యామల యాగాన్ని మంత్రి పార్థసారథి నిర్వహించారు. పెద్దఎత్తున హోమ గుండాన్ని నిర్మించి, పండితులతో యాగం జరిపించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మంత్రి కోరుకున్నారు. ఈ యాగంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మరోవైపు కూటమి శ్రేణులూ పెద్దఎత్తున తరలివచ్చారు. రాజశ్యామల యాగంతో మంత్రి పార్థసారథి స్వగ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. హిందూ సంప్రదాయాల ప్రకారం రాజకీయ విజయం, శత్రువులపై పైచేయి, అపారమైన జ్ఞానం, కీర్తి ప్రతిష్ఠల కోసం రాజశ్యామల యాగాన్ని చేస్తుంటారు. జ్ఞాన సరస్వతి రూపమైన రాజశ్యామల దేవిని ప్రసన్నం చేసుకునేందుకు భక్తులు ఈ యాగాన్ని చేస్తారు. పూర్వ కాలంలో చేసే రాజసూయ యాగంతో సమానమైన ఫలితాలను రాజశ్యామల యాగం ఇస్తుందని పండితులు చెబుతుంటారు.

## జిల్లాకో అరకు కాఫీ స్టాల్

విజయవాడ,ఏప్రిల్30 : రాష్ట్రంలో మహిళా సాధికారతకు 'పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ' (మెప్మా), నేటివ్ అరకు కాఫీ సంస్థ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. మిషన్ డైరెక్టర్ వాకాటి కరుణ ఆధ్వర్యంలో కుదిరిన ఈ ఎంవోయూ ద్వారా.. రాష్ట్రవ్యాప్తంగా ఫ్రాంచైజ్ విధానంలో అరకు కాఫీ దుకాణాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి జిల్లాలో రెండేళ్లలో రెండు అరకు కాఫీ షాపులు స్థాపించనున్నారు. మహిళలకు ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలు కల్పించడం ఒప్పంద ప్రధాన లక్ష్యం. రూ.5.90 లక్షలతో ఓ దుకాణం, రూ.పది లక్షలతో మొబైల్ కాఫీ షాప్ వంటి రెండు మోడల్స్‌ను ఎంపిక చేశారు. పీఎంఎఫ్ఎంఈ, పీఎంఈజీపీ పథకాల కింద మహిళలకు రుణాలు, సబ్సిడీలు అందజేస్తారు.

## పోరాటాలతోనే కార్మిక హక్కులకు రక్షణ

### కార్పొరేట్ సంతుష్టీకరణలో పాలకులు

### అనేక ఆందోళనతో అడ్డుకుంటూనే ఉన్నాం

### సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వి నాగేశ్వరరావు




విజయవాడ : ప్రభుత్వాలు కార్మికుల హక్కులపైనే కాక జీవితాలపైన, ప్రజాస్వామ్య హక్కులపైన, రాజ్యాంగ హక్కులపై దాడి చేస్తున్నాయి. ఈ హక్కులను కాపాడుకోవడానికి యావత్ కార్మికవర్గం పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. లేబర్‌కోడ్లను రద్దు చేయాలని, కార్మిక హక్కులు అమలు కావాలని అన్నారు. నిరంతరం కార్మిక దోపిడీ జరుగుతున్నా పాలకుల్లో చలనం లేదన్నారు. ఏటేటా మేడేలు జరుపుకోవడం తప్ప కార్మికుల పక్షాన నిర్ణయాలు తీసుకోవడం లేదని ఆయన ఆవేదన చెందారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకై మానవ హారాలు, పాదయాత్రలు, మహాప్రదర్శనలు నిర్వహించారు. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐదు సంవత్సరాలుగా రాజీ లేని పోరాటాలు సాగుతున్నాయి. వీటి ఫలితంగా నేటి వరకూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై ముందుకు సాగలేకపోయిందన్నారు. అయితే దానిని అభివృద్ధి చేసి, దానికి గనులు కేటాయించి, మరింత పటిష్టంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేయడం లేదన్నారు. తిరుపతి టిటిడి ఫారెస్టు కార్మికులు 38 నెలల పాటు ఆందోళనలు కొనసాగించారు. అనేక ఒత్తిళ్లు చేసినా కార్మికులు పోరాటాన్ని ఆపలేదన్నారు. విజయనగరం మిమ్స్ మెడికల్ కాలేజీ కార్మికులు 80 రోజుల పాటు పోరాటాలు చేశారు. 32 మందిపై అక్రమ కేసులు బనాయించారు. ఇద్దరు సిఐటియు నాయకులతో సహా 19 మంది కార్మికులను విశాఖ సెంట్రల్ జైలుకు 14 రోజులు రిమాండ్‌కు పంపారు. అయినా ఈ నిర్బంధాన్ని ఎదిరించి కార్మికులు పోరాటాన్ని కొనసాగించారు. నెల్లూరు మున్సిపాల్టీలో వర్క్ ఔట్‌సోర్సింగ్ విధానాన్ని అనుసరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం టెంటర్లు పిలవడానికి వ్యతిరేకంగా కార్మికులు 14 రోజుల పాటు సమరశీలంగా సమ్మె నిర్వహించారు. పోలీసు నిర్బంధాన్ని ఎదుర్కొని సమ్మెను జయప్రదంగా నిర్వహించారు. దీంతో ప్రభుత్వం టెండర్లను ఉపసంహరించుకోవడమే కాక, కార్మికులపై అక్రమంగా బనాయించిన కేసులను ఎత్తివేయక తప్పలేదు. విశాఖ డెయిరీ కార్మికుల పోరాటం, సినర్జీస్ కార్మికుల సమ్మె, బ్రాండిక్స్ కార్మికుల మూడు రోజుల సమ్మె, రాజమండ్రి ఆంధ్రా పేపర్‌మిల్లు కార్మికులు 2,500 మంది 34 రోజుల సమ్మె, ఎన్‌టిఆర్ జిల్లా ముఠా కార్మికుల సమ్మెలు ఈ కాలంలో జరిగాయి. కార్మికులు పోరాటాలతో కొన్ని విజయాలు సాధించుకోగలిగారు. నెల్లూరులో జెన్కోను అదానీకి కట్టబెట్టే ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ 396 రోజుల ఆందోళనను కార్మికులందరూ కలసి నిర్వహించారు. కార్మికులు, ఇంజినీర్లు కలసి సిఐటియు చొరవతో జెఎసి గా ఏర్పడి పోరాడారు. ప్రజల మద్దతు పొందారు. ప్రైవేటీకరణ ప్రతిపాదనను వెనక్కి నెట్టారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీలు 42 రోజుల పాటు ఎస్మాను సైతం ధిక్కరించి, నిర్బంధాన్ని ఎదిరించి సమరశీలంగా సమ్మె నిర్వహించారు. గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్, రిటైర్మెంట్ వయసు పెంపు, హెల్పర్ల ప్రమోషన్‌కు వయోపరిమితి పెంపు, మినీ అంగన్‌వాడీ సెంటర్లు మెయిన్ సెంటర్లుగా మార్పు, సమ్మె కాలపు వేతనాలు తదితర జీఓలను సాధించుకున్నారు. మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు 16 రోజుల సమ్మెను సమరశీలంగా నిర్వహించారు. వేతన పెంపు, ఇతర సమస్యలు పరిష్కరించుకున్నారు. సమగ్రశిక్ష కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 22 రోజులు సమ్మె నిర్వహించారు. దాదాపు 8 వేల మంది ఉద్యోగులు 23 శాతం వేతన పెంపు, సమ్మె కాలపు వేతనాలు సాధించుకున్నారు. ఆశా కార్మికులు సమరశీలంగా అనేక పోరాటాలు నిర్వహించి గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్లు, ప్రసూతి సెలవులు, పదవీ విరమణ వయసు పెంపులను సాధించుకున్నారు. మధ్యాహ్న భోజనం, భవన నిర్మాణం, ట్రాన్స్‌పోర్ట్ తదితర రంగాల్లోనూ పోరాటాలను నిర్వహించారు. రాజీ లేకుండా సమరశీలంగా ఫలితం వచ్చేదాకా పోరాడ్డం ద్వారా కార్మికవర్గం విజయాలు సాధించగలదని, ప్రభుత్వ విధానాలను వెనక్కి కొట్టగలదని తేటతెల్లమైందని నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ పోరాటాల వలన ఆయా కార్మికుల్లో పోరాట స్ఫూర్తిని పెంచాయి. రాష్ట్రంలో, కేంద్రంలో ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను భవిష్యత్తులో ఐక్య పోరాటాల ద్వారానే తిప్పి కొట్టగలం అన్నారు.

## టెన్త్ ఫలితాల్లో సత్తా చాటిన బిసి గురుకులాలు

### 96.02 శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు

### అభినందనలు తెలిపిన మంత్రి సవిత

అమరావతి,ఏప్రిల్30 : ఆంధ్రప్రదేశ్ పదో తరగతి ఫలితాల్లో ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలలు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నాయి. ఈసారి 96.02 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచాయి. ప్రభుత్వ పరిధిలో విద్యార్థుల సంఖ్యాపరంగా ఉన్న గురుకులాల్లో ఎంజేపీ సంస్థలు అగ్రస్థానంలో నిలవడం విశేషం. విద్యార్థుల ప్రతిభను ప్రతిబింబించేలా, నరవాడ ఎంజేపీ పాఠశాలకు చెందిన విద్యార్థులు 596, 593 మార్కులు సాధించి విశిష్ట ఫలితాలు నమోదు చేశారు. మొత్తం 100 పాఠశాలల్లో 30 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించడం ఈ సంస్థల విద్యా ప్రమాణాలను మరోసారి నిరూపించింది. ఈ అద్భుత విజయంపై మంత్రి సవిత హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది కృషి ఫలితంగానే ఈ మంచి ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. బీసీ విద్యార్థుల విద్యోన్నతికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఫలిస్తున్నాయని అన్నారు. అదే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీసుకుంటున్న ప్రోత్సాహక చర్యల వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని, బీసీ విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రుల తరఫున వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంజేపీ బీసీ గురుకులాల ఈ విజయంతో ప్రభుత్వ విద్యా సంస్థలపై విశ్వాసం మరింత పెరిగిందన్నారు మంత్రి సవిత.. కాగా, ఈ ఏడాది 6,18,131 మంది టెన్త్ పరీక్షలు రాయగా.. 5,26,9654 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.. అంటే 85.25 శాతం ఉత్తీర్ణత సాధించారు.. బాలురు 82.68 శాతం పాస్ అయితే.. బాలికలు 87.9 శాతం పాస్ అయ్యి మరోసారి సత్తా చాటారు.. ఇక, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు మే 25 నుంచి ప్రారంభమై జూన్ 4 వరకు కొనసాగనున్నాయి. ఈ పరీక్షల ద్వారా విద్యార్థులు తమ విద్యను కొనసాగించేందుకు మరో అవకాశం లభిస్తుంది. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మే 1 నుంచి మే 9 వరకు పరీక్ష ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. నిర్దిష్ట గడువులోపు ఫీజు చెల్లించడం తప్పనిసరి అని అధికారులు సూచించారు. ఇక, ఫలితాలపై సందేహాలు ఉన్న విద్యార్థులకు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం కూడా అవకాశం కల్పించారు. మే 1 నుంచి మే 7 వరకు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, సరైన ప్రణాళికతో చదివి మంచి ఫలితాలు సాధించాలని అధికారులు సూచిస్తున్నారు.

## సర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలి

### పార్టీ శ్రేణులను హెచ్చరించిన సజ్జల

అమరావతి,ఏప్రిల్30 : ఓటర్ల జాబితా సవరణపై అప్రమత్తంగా ఉండాలని వైసీపీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సూచించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఎస్ఐఆర్ పై సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణా రెడ్డి, ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి, పార్టీ ఐటీ, సోషల్ మీడియా, బూత్ కమిటీలకు సంబంధించి అధ్యక్షులు, పలు జిల్లాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ పేరుతో అధికార పక్షం చేసే అవకతవకలు, అక్రమాలను అడ్డుకోవాలని సూచించారు. పార్టీ ఓట్లు తొలగించకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. బూత్ కమిటీలు చేయబోయే పని చాలా కీలకమన్నారు. ఇటీవల సాంకేతిక పరిజ్ఞానం చాలా పెరిగిందన్నారు. అదే టెక్నాలజీ మోసం చేయడానికి కూడా వినియోగపడుతుందని వెల్లడించారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, మనం చాలా అప్రమత్తంగా పని చేయాల్సి ఉంటుందని వెల్లడించింది. ఓట్లు తీసివేయకుండా, అక్రమ ఓట్లు చేర్చకుండా చాలా జాగ్రత్త పడాల్సి ఉంటుంది. వ్యవస్థలను మేనేజ్ చేయడంలో చంద్రబాబు నాయుడు తర్వాతే ఎవరైనా. 2019 ఎన్నికలకు ముందు 40 నుంచి 45 లక్షల ఓట్లు తొలగించారు. ఆ సమయంలో జగన్ నాయకత్వంలో ఢిల్లీకి వెళ్లి ఎన్నికల సంఘాన్ని కలిసి ఫిర్యాదు చేశాం. 2002 నాటి ఓటర్ల జాబితాను ఆధారంగా తీసుకుని ఓటర్ల జాబితా సవరణ జరుగుతోంది. అప్పటి నుంచి రాష్ట్రంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. 1984 తర్వాత పుట్టి ఓటర్ల జాబితాలో ఉన్నవారు తిరిగి మళ్ళీ తమను తాము నిరూపించుకుంటేనే ఓటర్ల తుది జాబితాలో ఉంటారు.. ఈ విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. మిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్ఐఆర్‌లో భాగంగా 97 లక్షల మంది ఓటర్లను తొలగించారు. ఎస్ఐఆర్ ప్రారంభానికి ముందే అవసరమైన డేటా మొత్తం సిద్ధం చేసుకోవాలి. జోన్‌ల వారీగా చురుకైన కార్యకర్తలను గుర్తించి వారికి తగిన శిక్షణ ఇవ్వాలి. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా టీమ్‌లను సిద్ధం చేసి, ఎస్ఐఆర్‌పై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలి. మైక్రో లెవల్ మేనేజ్‌మెంట్, ఆర్గనైజేషన్ బలంగా ఉంటే ఎలాంటి పరిస్థితుల్లోనైనా విజయం సాధించవచ్చు. 2019 ఎన్నికల ఫలితాల కంటే మెరుగైన ఫలితాలు సాధించే సామర్థ్యం మనకు ఉందన్నారు.

## పెట్టుబడుల హబ్‌గా ఏపి

### టైటాన్ డిఫెన్స్ గ్రూప్ ప్రతినిధుల ఆసక్తి

### మంత్రి బిసి జనార్ధన్ రెడ్డితో ప్రతినిధుల భేటీ

అమరావతి,ఏప్రిల్30 : రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పూర్తిస్థాయిలో ముందుకు వచ్చే సంస్థలకు ప్రభుత్వం తరఫున పూర్తిస్థాయిలో సహాయ, సహకారాలు అందిస్తామని ఏపీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే అనేక సంస్థలు ముందుకు వచ్చాయని అన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ దేశానికే పెట్టుబడుల హబ్‌గా నిలుస్తోందని పేర్కొన్నారు. సుస్థిరమైన, నమ్మకమైన, బలమైన కూటమి పాలనపై విశ్వాసంతోనే రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయని తెలిపారు. శుక్రవారం మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితో టైటాన్ డిఫెన్స్ గ్రూప్ ప్రతినిధులు సమావేశం అయ్యారు. సచివాలయంలోని ఆర్ అండ్ బీ, ఐ అండ్ ఐ శాఖ కార్యాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా టైటాన్ డిఫెన్స్ సిస్టమ్స్ లిమిటెడ్ గ్రూప్ చైర్మన్, సీఈఓ కె. గిరికుమార్, సంస్థ ప్రతినిధులు కలిశారు. ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న టైటాన్ కంపెనీ నిర్వాహకులు ఆసక్తి చూపించారు. ఉత్పత్తి శ్రేణితో పాటు శిక్షణ, పరీక్ష, ధ్రువీకరణ, ఉన్నతీకరణ, ఆధునికీకరణ, నిర్వహణకు కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేయడంలో తమకు అనుభవం ఉందని టైటాన్ గ్రూప్ నిర్వాహకులు తెలిపారు.

## విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

అమరావతి,ఏప్రిల్30 : రాష్ట్రంలోని విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు రావాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. కోర్సుల ఫోర్ క్యాస్టింగ్ జరగాలని ఉన్నతాధికారులకు ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ స్థాయి యూనివర్సిటీలతో రాష్ట్రంలోని విశ్వ విద్యాలయాలు పోటీ పడేలా చర్యలు తీసుకోవాలని వారిని సీఎం చంద్రబాబు ఆదేశించారు. గురువారం రాజధాని అమరావతిలోని సచివాలయంలో పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్య తదితర శాఖలపై సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. రీసెర్చ్, ఇన్నోవేషన్, స్టార్టప్‌లను ప్రోత్సహించేలా విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవాలని ఉన్నతాధికారులకు దిశానిర్దేశర చేశారు. క్వాంటం టెక్నాలజీ కోర్సు ఆంధ్రా యూనివర్సిటీ ప్రారంభించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ కోర్సును ప్రారంభించిన ఆంధ్రా యూనివర్సిటీని సీఎం చంద్రబాబు అభినందించారు. ఈ సమీక్షలో ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎదురెదురుగా ఢీకొన్న ఆటోలు

### ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

### ట్రాక్టర్‌ను ఢీకొన్న ప్రైవేట్ బస్సు

ఒంగోలు,ఏప్రిల్30 : ఎదురెదురుగా వస్తున్న రెండు వాహనాలు ఢీకొన్న సంఘటన గురువారం ఉప్పుగుండూరు వద్ద జరిగింది. వివరాల్లోకి వెళితే.. జరుగుమల్లి మండలానికి చెందిన ట్రాలీ ఆటో.. ఉప్పుగుండూరు బైపాస్ నుంచి స్వగ్రామానికి వెళ్తోంది. మార్గంమధ్యలో ఉప్పుగుండూరు వద్ద ఎదురుగా వస్తున్న ప్యాసింజర్ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్యాసింజర్ ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడ్ని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఇకపోతే కర్నూలు నగరంలోని చెన్నమ్మ సర్కిల్ వద్ద ఉన్న జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు.. ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొంది. ట్రాక్టర్ బోల్తా పడటంతో అందులో ఉన్న తండ్రీ కుమారులకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు గాయపడిన వారిని చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. బస్సులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. ఈ ఘటనపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాదంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

## జనగామ మున్సిపల్ కౌన్సిల్‌లో ఉద్రిక్తత

### వైస్‌చైర్మన్‌కు గౌరవం ఇవ్వలేదంటూ బిఆర్ఎస్ ఆందోళన

జనగామ,ఏప్రిల్30 : జనగామలో శుక్రవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఉద్రిక్తంగా మారింది. మున్సిపల్ వైస్ చైర్మన్ భూష పర్వతాలుకు వేదికపై కుర్చీ ఇవ్వలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు నిరసనకు దిగారు. ఈ సమావేశం ప్రారంభమైన వెంటనే వైస్ చైర్మన్‌కు ప్రోటోకాల్ ప్రకారం స్థానం ఇవ్వలేదని బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది బీఆర్ఎస్ నేతలు స్వయంగా కుర్చీ తీసుకువచ్చి వైస్ చైర్మన్‌ను కూర్చోబెట్టడం పరిస్థితిని ఉద్రిక్తంగా మార్చింది. వివాదం మరింత పెరగడంతో పోలీసులు జోక్యం చేసుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ ఆదేశాల మేరకు వేదికపై కూర్చున్న వైస్ చైర్మన్‌ను పోలీసులు కిందకు దించారు. ఈ చర్యతో బీఆర్ఎస్ నాయకులు మరింత అసహనం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కడమంచి బాలమణి ఈ వివాదంపై స్పందించారు. ఈ వేదికపై కూర్చోవడానికి ప్రత్యేక హక్కు లేదా నిబంధన లేమీ లేవని, కమిషనర్ మార్గదర్శకాల ప్రకారమే సమావేశం నిర్వహించామని తెలిపారు. ఈ ఘటనలో ప్రోటోకాల్ ఉల్లంఘన జరగలేదని స్పష్టం చేశారు. ఈ వివరణతో సంతృప్తి చెందని బీఆర్ఎస్ నాయకులు వేదిక ముందు కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సమావేశాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. వైస్ చైర్మన్‌కు కనీస గౌరవం ఇవ్వలేదని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

## పిల్లల దత్తతలో జాగ్రత్తలు తీసుకోవాలి

హైదరాబాద్,ఏప్రిల్30 : పిల్లల దత్తత విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా వ్యవహరించాలని తెలంగాణ రాష్ట్ర శిశు, సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. దత్తత కావాలనుకున్న వారు ఐసీడీసీని సంప్రదించాలని సూచించారు. శుక్రవారం కాచిగూడ బస్ టెర్మినల్‌లో అమ్మఒడి తల్లిపాల ఫీడింగ్ కేంద్రాన్ని, కాచిగూడ రైల్వేస్టేషన్‌లో పిల్లల దత్తత కేంద్రాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో కలిసి మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడారు. సమ్మక్క - సారలమ్మ జాతరలో పిల్లల తల్లులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో, జన సమూహ ప్రాంతాల్లో, బస్సు టెర్మినల్, రైల్వేస్టేషన్, బస్టాండ్‌లలో తల్లిపాల ఫీడింగ్ కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అన్నారు.

క్రైమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక






## ప్రళయ్ మూవీ పనుల్లో రణ్‌వీర్ బిజీ

'ధురంధర్ 2' విజయంతో ఫుల్ జోష్‌లో ఉన్నారు నటుడు రణ్‌వీర్ సింగ్. ఈ సినిమా హిట్ తర్వాత గతంలో అంగీకరించిన కొన్ని సినిమాల నుంచి ఆయన వైదొలుగుతున్నారంటూ వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో 'ప్రళయ్' టీమ్ స్పందించింది. ఆయన ఈ సినిమా నుంచి వైదొలగలేదని స్పష్టం చేసింది.రణ్‌వీర్ సింగ్ హీరోగా జై మెహతా తెరకెక్కిస్తున్న చిత్రమిది. వీరిద్దరి మధ్య విభేదాలు వచ్చినట్లు కూడా ఇటీవల ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో టీమ్ స్పందిస్తూ.. 'రణ్‌వీర్, జై ఇద్దరూ 'ప్రళయ్' సినిమా పనుల్లో బిజీగా ఉన్నారు. నిరంతరం చర్చలు జరుపుతూ స్క్రిప్ట్‌ను లాక్ చేశారు. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయి. భారతీయ సినిమాలో ఇప్పటివరకు చూడని ఓ భారీ అద్భుతాన్ని తెరపై ఆవిష్కరించేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది. ఆగస్టులో 'ప్రళయ్' షూటింగ్ ప్రారంభమవుతుంది' అని వెల్లడించింది. దీనికోసం హిందీ చిత్రాలలో మునుపెన్నడూ చూడనివిధంగా ఓ ప్రపంచాన్ని నిర్మించనున్నామని చిత్రబృందం తెలిపింది. ఇక 'ప్రళయ్' విషయానికి వస్తే.. ప్రముఖ బాలీవుడ్ నిర్మాత హన్సల్ మెహతా కుమారుడు జై మెహతా ఈ చిత్రంతో వెండితెరకు దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. గతంలో ఆయన 'స్కామ్ 1992', 'లూటేరే' వంటి వెబ్‌సిరీస్‌లకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశారు. ఇక, రణ్‌వీర్ 'డాన్ 3' నుంచి వైదొలిగినట్లు కూడా ఇటీవల వార్తలు వచ్చిన విషయం తెలిసిందే.




## ఓటిటిలోకి బైకర్ విడుదల

టాలీవుడ్ యంగ్ హీరో శర్వానంద్ నటించిన లేటెస్ట్ స్పోర్ట్స్ డ్రామా 'బైకర్' ఓటీటీలోకి రాబోతుంది. భారతదేశంలోనే మొట్టమొదటి మోటోక్రాస్ రేసింగ్ నేపథ్యంతో తెరకెక్కిన ఈ చిత్రం, థియేటర్లలో విడుదలైన నెల రోజుల్లోనే డిజిటల్ ప్రేక్షకులను పలకరించబోతోంది. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు దక్కించుకుంది. దీంతో ఈ చిత్రం మే 1 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో కూడా ఇది అందుబాటులోకి రానుంది. ఇక హిందీలో ఈ సినిమాను 'శర్వా' అనే టైటిల్‌తో విడుదల చేస్తున్నారు. అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో శర్వానంద్ సరసన మాళవిక నాయర్ కథానాయికగా నటించగా, సీనియర్ నటుడు రాజశేఖర్ కీలక పాత్రలో కనిపించారు. ఒక ప్రొఫెషనల్ బైక్ రేసర్ తన కెరీర్‌లో ఎదుర్కొనే సవాళ్లు, తండ్రి ఆశయాల కోసం అతను చేసే పోరాటాన్ని ఈ సినిమాలో అద్భుతంగా చూపించారు. థియేటర్లలో మిశ్రమ స్పందన లభించినప్పటికీ, రేసింగ్ సీక్వెన్స్ మరియు టెక్నికల్ వాల్యూస్ పరంగా సినిమాకు మంచి ప్రశంసలు దక్కాయి.




## భోగిలో...కందుల సులోచనగా అనుపమ

టాలీవుడ్ నటుడు శర్వానంద్ కథానాయకుడిగా దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి' . ప్రస్తుతం ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుడగా తాజాగా ఈ సినిమా నుంచి కథానాయిక అనుపమ పరమేశ్వరన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సినిమాలో అనుపమ కందుల సులోచనా రాణి అనే గ్రామీణ యువతిగా కనిపించబోతుంది. చేతిలో క్యారేజీ, మోదుగ ఆకులు పట్టుకుని ఉన్న పోస్టర్ ప్రస్తుతం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. 1960ల నాటి తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు నేపథ్యంలో ఈ సినిమా సాగబోతున్నట్లు సమాచారం. సంపత్ నంది దర్శకత్వంలో వస్తున్న ఈ హై-వోల్టేజ్ డ్రామాలో శర్వానంద్ ఊరమాస్ అవతారంలో కనిపిస్తుండగా, అనుపమ పరమేశ్వరన్ మరియు డింపుల్ హయాతీ ఫీమేల్ లీడ్స్ గా నటిస్తున్నారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రాన్ని ఆగస్టు 28, 2026 న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.




## అగధలో మంజుల మనవరాలు జోవిక

ప్రముఖ సీనియర్ దర్శక నిర్మాత ఎమ్మెస్ రాజు ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న మిస్టికల్ డివైన్ థ్రిల్లర్ 'అగధ'. హారర్ జానర్‌లో రాబోతున్న ఈ చిత్రం నుంచి తాజాగా ఆసక్తికరమైన అప్‌డేట్ వెలువడింది. ఈ సినిమా ద్వారా తమిళ నటి వనితా విజయ్ కుమార్ కుమార్తె,అలనాటి మంజుల మనవరాలు జోవిక విజయ్ కుమార్ టాలీవుడ్‌కు పరిచయం అవుతున్నారు. చిత్రంలో ఆమె 'హరిణి' అనే పవర్‌ఫుల్ పాత్రను పోషిస్తుండగా, దీనికి సంబంధించిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో ఆమెను ఒక తీవ్రమైన శక్తిగా అభివర్ణించారు మేకర్స్. శ్రీ ఆదివరాహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బాలుసు నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రావణ్ రెడ్డి 'సింహ'గా, కామాక్షి భాస్కర్ల 'మహాదేవి'గా నటిస్తుండగా, ఉల్కా గుప్తా, షిజు అబ్దుల్ రషీద్ వంటి తారలు కీలక పాత్రలు పోషిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం మరియు హిందీ భాషల్లో విడుదల కానున్న ఈ సినిమాకు సుమారు 45 నిమిషాల పాటు సాగే భారీ వీఎఫ్ఎక్స్ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ప్రస్తుతం షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న ఈ చిత్రానికి రాకేష్ వెంకటాపురం సంగీతాన్ని అందిస్తుండగా, నాని చమిడిశెట్టి ఛాయాగ్రహణం, జునైద్ సిద్ధిఖీ ఎడిటింగ్ మరియు రాజీవ్ నాయర్ ప్రొడక్షన్ డిజైనింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.




## దృశ్యం-3 టీజర్ విడుదల

మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ 'దృశ్యం 3' టీజర్ ఎట్టకేలకు విడుదలైంది. బుధవారం సాయంత్రం విడుదలైన ఈ టీజర్ సోషల్ మీడియాను ఊపేస్తోంది. ఈ వీడియోలో గత రెండు భాగాలకు సంబంధించిన కీలక ఘట్టాలను గుర్తు చేస్తూనే, మూడో భాగంపై భారీ అంచనాలను పెంచేశారు దర్శకుడు జీతూ జోసెఫ్. గతంలో తన కుటుంబాన్ని రక్షించుకోవడానికి అత్యంత ధైర్యంగా, ప్రశాంతంగా ఎత్తుగడలు వేసిన జార్జ్ కుట్టీ, ఈసారి మాత్రం తీవ్రమైన భయంలో కనిపిస్తుండటం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. 'ఇప్పుడు నాకు భయంగా ఉంది సార్.. నన్ను ఇంకెవరో గమనిస్తున్నారని అనిపిస్తోంది' అంటూ మోహన్‌లాల్ చెప్పే డైలాగ్ ఈసారి కథలో ఏదో పెద్ద ప్రమాదం పొంచి ఉందని సూచిస్తోంది.




## కల్కి మూవీలో నటంచడం లేదన్న జెడి

రెబల్ స్టార్ ప్రభాస్, దర్శకుడు నాగ్ అశ్విన్‌ల కాంబినేషన్‌లో వచ్చిన 'కల్కి 2898ఏడీ' బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, ప్రస్తుతం సెట్స్‌పై ఉన్న ఈ చిత్ర సీక్వెల్‌కు సంబంధించి గత కొద్దిరోజులుగా ఒక ఆసక్తికర వార్త నెట్టింట హల్చల్ చేస్తోంది. టాలీవుడ్ సీనియర్ నటుడు జేడీ చక్రవర్తి ఈ రెండో భాగంలో ఒక కీలక పాత్ర పోషిస్తున్నారని జోరుగా ప్రచారం సాగుతుంది. అయితే తాజాగా తన సినిమా 'గాయపడ్డ సింహం' ప్రమోషన్లలో పాల్గొన్న ఆయన ఈ రూమర్లపై స్పందిస్తూ క్లారిటీ ఇచ్చారు. 'కల్కి 2'లో తాను నటిస్తున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని, ఇప్పటివరకు తాను ఎలాంటి షూటింగ్‌లోనూ పాల్గొనలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రచారాన్ని కేవలం సరదాగా ఎంజాయ్ చేశానని చెబుతూ, ఆ వార్తలకు జేడీ స్వస్తి పలికారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సీక్వెల్‌లో ప్రభాస్ భైరవ, కర్ణ పాత్రలతో పాటు మరో విభిన్నమైన లుక్‌లో కనిపించనున్నారని తెలుస్తోంది. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ వంటి దిగ్గజాల పాత్రల నిడివి ఈసారి మరింత ఎక్కువగా ఉంటుందని సమాచారం.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com